

ESTD: 1999

www.voodayam.com

వుదయం



ఖమ్మం | 04-11-2026 బుధవారం | సంపుటి : 14 | సంచిక :25 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on

బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్రతో
సమన్వయం చేసుకోవాలి

హైదరాబాద్, నవంబర్ 3 (వుదయం) : తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదనకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నిరంతరం చర్చలు జరపాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. గతంలో కుదిరిన ఒప్పందాలు, ఇతర కీలక అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్ర ప్రభుత్వంతో పరస్పరం మార్పిడి చేసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి తుమ్మిడిహట్టి బ్యారేజీపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు, తదుపరి కార్యాచరణకు సంబంధించి అధికారులకు పలు



సూచనలు చేశారు. బ్యారేజీ నిర్మాణం వల్ల మహారాష్ట్రలోని కొన్ని భూములు ముంపునకు గురైతే తగిన పరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను రెండు రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఖాతాలో జమ చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ముంపు ప్రభావంపై మహారాష్ట్ర ప్రభుత్వం స్వయంగా సర్వే నిర్వహించుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం కోరిన సమస్త సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అందించాలని నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహారాష్ట్రతో సమన్వయం చేసుకుంటూ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

దేశవ్యాప్తంగా
మెట్రో విస్తరణకు వేగం

1,200 కి.మీ.కు చేరిన రైలు మార్గాలు: ప్రధాని మోదీ

పుణె, నవంబర్ 3 (ఎఎంస్) :

దేశంలో పట్టణ రవాణా వ్యవస్థలో మెట్రో రైలు సేవలు గణనీయంగా విస్తరించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. 2014కు ముందు దేశవ్యాప్తంగా 248 కిలోమీటర్ల మేర మాత్రమే మెట్రో మార్గాలు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం వాటి పొడవు 1,200 కిలోమీటర్లకు చేరిందని తెలిపారు. మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలు దేశ ఆర్థిక కాభివృద్ధికి మరింత ఊతమిస్తాయని పేర్కొన్నారు. మంగళవారం వీడియో సమావేశం ద్వారా పుణె మెట్రో మూడో దశలోని గులాబీ మార్గాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అదే సమయంలో పుణె మెట్రో రెండో దశలో భాగంగా నాలుగు కొత్త మార్గాల



నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ పనులకు సుమారు రూ.21,800 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. రూ.8,300 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన 23 కిలోమీటర్ల గులాబీ మార్గాన్ని జాతికి అంకితం చేశారు. ఈ మార్గం హింజేవాడి సమాచార సాంకేతిక కేంద్రాన్ని జిల్లా న్యాయస్థానం మెట్రో స్టేషన్‌తో అనుసంధానించనుంది. ఈ మార్గం అందుబాటులోకి రావడంతో వేలాది మంది సమాచార సాంకేతిక రంగ ఉద్యోగులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు నగరంలో రహదారులపై రద్దీ తగ్గనుంది. వ్యక్తిగత వాహనాల వినియోగం కూడా తగ్గుతుందని అంచనా. ఈ మార్గంలో రైళ్లను మహిళా సిబ్బందే నడపనున్నారు. విద్యుత్ అవసరాల్లో సుమారు 30 శాతాన్ని సౌర విద్యుత్ ద్వారా సమకూర్చనున్నారు. పుణె మెట్రో రెండో దశకు సుమారు రూ.13,500 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఇందులో 2ఏ, 2బీ, 4, 4ఏ మార్గాలు ఉంటాయి. నగరంలోని ప్రధాన నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, సమాచార సాంకేతిక సంస్థల ప్రాంతాల

నిరసనల వల్ల వాణిజ్య
కార్యకలాపాలకు నష్టం

ఆందోళనలకు కాలపరిమితి తప్పనిసరి

పండగ వేళ నిరసనలతో వ్యాపారాలకు ఆటంకం

నిరసనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 3 (వుదయం) :



నిరసనల పేరుతో ఏ ఒక్కరూ బహిరంగ ప్రదేశాలను నిరవధికంగా తమ ఆధీనంలో ఉంచుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆందోళనలు నిర్వహించేందుకు అధికారికంగా కేటాయించిన ప్రదేశాలకూ నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని అభిప్రాయపడింది. పండగల సమయంలో దిల్లీలో నిరసనలు నిర్వహించవద్దని వ్యాపార సంఘాలు విపక్షాలు, ఇతర సంస్థలకు విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రాంతాన్ని శాశ్వతంగా ఆక్రమించుకోవడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. వివిధ సమస్యలపై రైతులు, న్యాయవాదులు సహా అనేక వర్గాలు నిరసనలు తెలపాల్సి ఉంటుందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికీ ఆందోళన చేపట్టే హక్కు ఉందని, అయితే ఇతరుల హక్కులకు భంగం కలిగించే లా వ్యవహరించకూడదని వ్యాఖ్యానించారు. నిరసనలకు పిలుపునిచ్చే వారే వాటి అనంతరం చోటుచేసుకునే పరిణామాలకు బాధ్యత వహించాలని ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. జులై 20న నిర్వహించిన ఆందోళనకు ఒక్కరోజు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ, నిరసనకారులు ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టకుండా ఆక్రమించుకున్నారని, అనంతరం పార్లమెంటు వరకు ప్రదర్శనగా వెళ్లారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపార సంఘాల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. దేశ రాజధానిలో నిరసనల కారణంగా సాధారణ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వాణిజ్య కార్యకలాపాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. రానున్న రెండు నెలల పాటు నిరసనల నిర్వహణపై ఆంక్షలు విధించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

విదేశాల్లో చిక్కుకున్న
మహిళకు కేటీఆర్ అండ



హైదరాబాద్, నవంబర్ 3 (వుదయం) :

ఉపాధి కల్పిస్తామని నమ్మించి విదేశాలకు పంపి మోసగించడంతో మస్కట్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తుప్పుడు లక్ష్మి ఎట్టకేలకు సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఆమెను నెల రోజుల్లోగా స్వదేశానికి తీసుకొస్తానని కుమారుడు రాజుకు ఇచ్చిన హామీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలబెట్టుకున్నారు. ఆయన చొరవతో లక్ష్మి తిరిగి కుటుంబ సభ్యుల చెంతకు చేరడంతో ఆ కుటుంబంలో సంతోషం నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని గోకఫస్వాడ గ్రామానికి చెందిన తుప్పుడు లక్ష్మి, ఆమె భర్త వెంకటప్ప ఫిబ్రవరి 27న ఉపాధి కోసం మస్కట్‌కు వెళ్లారు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత ఏజెంట్ చెప్పిన పనికి బదులుగా మరో పని అప్పగించడంతో లక్ష్మి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు అక్కడి యజమాని ఆమె పాస్‌పోర్టును తన వద్దే ఉంచుకుని స్వదేశానికి పంపేందుకు నిరాకరించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

తనను విదేశాలకు పంపించిన ఏజెంట్ కూడా ఫోన్ స్పందించకపోగా, భారత్‌కు తిరిగి పంపించేందుకు రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసినట్లు లక్ష్మి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ క్రమంలో ఆమెకు అందుబాటులో ఉన్నవైపై, సిమ్ కార్డు సేవలు నిలిచిపోవడంతో కుటుంబంతో సంబంధాలు తెగిపోయాయి. చివరకు పక్కింటివారి ఇంటర్నెట్ సాయంతో కుమారుడు రాజును సంప్రదించి తన పరిస్థితిని వివరించారు. తల్లి ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్న రాజు సెప్టెంబర్ 29న కేటీఆర్‌ను కలిసి తమ కుటుంబానికి ఎదురైన సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన కేటీఆర్ నెల రోజుల్లోనే పాస్‌పోర్టు సమస్యను పరిష్కరించి, లక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు వెంటనే సంబంధిత అధికారులకు లేఖ రాయడంతో పాటు అవసరమైన చర్యలు చేపట్టారు. కేటీఆర్ చొరవ ఫలితంగా లక్ష్మి క్షేమంగా భారత్‌కు తిరిగి చేరుకున్నారు. స్వదేశానికి చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్న లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు వచ్చి కేటీఆర్‌ను స్వయంగా కలిశారు. తనకు, తన కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

బహిరంగ చర్చకు వేదిక
మీరే నిర్ణయించండి

న్యూఢిల్లీ, నవంబర్ 3 (వుదయం)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ సవాల్ విసిరిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. తాజాగా మరోసారి అదే అంశాన్ని తెరపైకి తెచ్చారు. విదేశీ శక్తుల ప్రభావం, దేశ ఆర్థిక వ్యవస్థ, ఇతర కీలక అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. చర్చకు వేదికను ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే నిర్ణయించుకోవచ్చని స్పష్టం చేశారు. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. పార్లమెంటులో ఏ అంశంపైనైనా



చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ మరోసారి తన ప్రతిపాదనను వెల్లడించారు. ఈ చర్చ మీడియా ప్రతినిధులు, యువత సమక్షంలో జరగాలని సూచించారు. చర్చకు మధ్యవర్తిగా మోదీ ఎవరిని ఎంపిక చేసినా తనకు అభ్యంతరం లేదని, అవసరమైతే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అధిపతి మోహన్ భగవత్ కూడా మధ్యవర్తిత్వం వహించవచ్చని పేర్కొన్నారు. ''మోదీజీ.. సవాల్ విసిరి 24 గంటలు గడిచింది. మీరు ప్రతిపక్షం దేశద్రోహానికి పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. అందుకే ఏ వేదికైనా, ఏ ప్రాంతమైనా మీరే నిర్ణయించుకోండి. నాతో బహిరంగ చర్చకు రండి. దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో సంబంధాలు ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల స్వరూపం ఏమిటో చర్చలో తేల్చుకుందాం. వీలైనంత త్వరగా చర్చకు రండి. భయపడకండి'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

25న ముసాయిదా
ఓటర్ల జాబితా విడుదల

గ్రాడ్యుయేట్ ఓటర్ల దరఖాస్తులకు మరింత గడువు

సాంకేతిక సమస్యలతో ఓటు నమోదు గడువు పెంపు


ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



హైదరాబాద్, నవంబర్ 3 (వుదయం) :

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించినట్లు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. గత కొద్ది రోజులుగా అంతర్జాలంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు అంతరాయం ఏర్పడటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. జాబితా విడుదలైన రోజు నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాలు, అభ్యర్థనలను స్వీకరించనున్నట్లు సుదర్శన్ రెడ్డి వివరించారు.

ఇంతే కదా...!







వుదయం www.voodayam.com



చటాన్‌పల్లి ఆర్వోబీ పనులకు గ్రీన్ సిగ్నల్!

- మరో 50 రోజుల్లో పనులు ప్రారంభం: బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి

షాద్‌గర్, నవంబర్ 3,(వుదయం):

షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్వోబీ నిర్మాణ పనులకు త్వరలోనే మార్గం సుగమం కానుంది. మరో 50 రోజుల్లో ఆర్వోబీ పనులు ప్రారంభమవుతాయని బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కీలకమైన 20ఎ భూసేకరణ సర్వే నివేదికను రైల్వే అధికారులు స్వీకరించారని, వారం రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసి, టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని ఆర్ఎస్‌పీ సీఈవో మురళీకృష్ణ కుమార్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్‌సీ28 సర్వే కూడా త్వరలోనే పూర్తి చేసి టెండర్లు పిలుస్తారన్నారు. ఎంపీ డీకే అరుణ చొరవతోనే రైల్వే అధికారుల్లో చలనం వచ్చిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ప్రధాని మోదీల సహకారంతోనే భూసేకరణ నిధులతో సహా కేంద్రమే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందన్నారు. మూడేళ్లుగా పనులు నిలిచిపోవడానికి కారణమేంటో, ఈ జాప్యంపై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశం బీజేపీ నేతలు పలువురు ఉన్నారు.

షాద్‌నగర్‌లో ఉద్రిక్తత...

- కన్నీళ్ల వేళ... నేతల అనుచరుల పంతాల రచ్చ..
- చంద్రకళ భౌతికకాయం వద్ద ఎమ్మార్పీఎస్, ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం..
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

షాద్ నగర్,నవంబర్ 3,(వుదయం):



పరామర్శించాల్సిన చోటే రాజకీయం పడగవిప్పిందా..? నివాళులర్పించే వేదిక ఆధిపత్య పోరుకు నిలయంగా మారిందా..? అంటే అవుననే అంటున్నాయి షాద్‌నగర్‌లో మంగళవారం చోటు చేసుకున్న పరిణామాలు... శాతవాహన వర్సిటీ న్యాయశాస్త్ర విద్యార్థిని డాకూరి చంద్రకళ అంతిమ నివాళుల కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య పెరిగిన పంతాలు, వివాదంతో బాధిత ఇల్లు ఒక్కసారిగా రణరంగంగా మారగా.. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. ఆ వివరాలు ఓ సారి పరిశీలిస్తే..

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో నివాసముంటున్న దక్కలి సామాజిక వర్గానికి చెందిన చిన్నయ్య, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె చంద్రకళ శాతవాహన వర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతూ ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. చంద్రకళ భౌతికకాయానికి నివాళులర్పించేందుకు మంగళవారం ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ వేర్వేరుగా షాద్‌నగర్‌లోని ఆమె నివాసానికి చేరుకున్నారు.

ముందుగా వచ్చిన విశారదన్ మహారాజ్ చంద్రకళ భౌతికకాయానికి నివాళులర్పించారు. అయితే ఆయన నివాళులర్పించిన అనంతరం కూడా అక్కడే ఉండిపోవడంతో, ఆ తర్వాత వచ్చిన మందకృష్ణ మాదిగ కొంతసేపు బయటే వేచి చూడాల్సి వచ్చింది. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ నివాళులర్పించేందుకు మార్గం సుగమం చేయాలని, పక్కకు తప్పుకోవాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులు కోరగా.. మందకృష్ణ వచ్చి తనతో పాటే నివాళులర్పించవచ్చని విశారదన్ సూచించినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. దింతో తమ అధినేతకు ప్రత్యేకంగా నివాళులర్పించే అవకాశం ఇవ్వకుండా జాప్యం చేయడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఇరు పార్టీల అనుచరులు పంతాలకు దిగడంతో అక్కడ ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

పోలీసుల జోక్యం.. విజ్ఞప్తి చేసిన కుటుంబీకులు

బాధిత ఇంట్లో వాతావరణం వేడెక్కుతుండటంతో స్థానిక పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఇప్పటికే నివాళులర్పించినందున అక్కడి నుంచి పక్కకు వెళ్లాలని విశారదన్ మహారాజ్‌కు షాద్‌నగర్ ఎస్సై శ్రీకాంత్,సిబ్బంది సూచించారు. ఇదే సమయంలో బాధిత కుటుంబ సభ్యులు సైతం కన్నీళ్లతో అభ్యర్థించారు. తమ బిడ్డ భౌతికకాయం వద్ద ఎలాంటి ఘర్షణలకు దిగొద్దని, అందరూ సంయమనం పాటించి నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని విశారదన్‌ను పక్కకు పంపించడంతో వాతావరణం సద్దుమణిగింది. అనంతరం మందకృష్ణ మాదిగతో పాటు ఇతర నాయకులు చంద్రకళ భౌతికకాయానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కుత్బుల్లాపూర్‌లో హైడ్రా కొరడా

ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో..
ఆక్రమ కట్టడాలను తొలగించిన హైడ్రా
మల్లారెడ్డి ఫామ్ హౌస్ ప్రహరీ కూల్చివేత

హైదరాబాద్ :

ఫాక్స్ సాగర్ అభివృద్ధిని హైడ్రా చేపట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చిన ఆక్రమణలను తొలగించి పునరుద్ధరణకు అడుగులు వేస్తోంది. ఆ క్రమంలో ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ కట్టడాలను హైడ్రా సోమవారం తొలగించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏకంగా అర కిలోమీటరు మేర బండ్ నిర్మించడాన్ని హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. ఆ బండ్‌ను హద్దుగా ఫామ్ హౌస్ నిర్మాణానికి గాను కట్టిన ప్రహరీని హైడ్రా కూల్చి వేసింది. కొన్ని చోట్ల హద్దుగా వేసిన ఇనుప కంచెను కూడా తొలగించింది. ఫాక్స్ సాగర్‌కు మరోవైపు ఎఫ్‌టీఎల్ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డి ఫామ్ హౌస్ ప్రహరీని కూడా హైడ్రా కూల్చివేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో మట్టిని నింపి ప్రహరీ నిర్మించి.. గేటు ఏర్పాటు చేయగా.. హైడ్రా వాటిని తొలగించింది. దూలపల్లి విలేజ్‌లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మాజీమంత్రి మల్లారెడ్డి కుటుంబీకులకు సంబంధించిన ఫామ్ హౌస్ ఉంది. సర్వే నంబరు 124లో ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధి ఉండగా..వాటిని పట్టించుకోకుండా ప్రహరీ నిర్మించి గేటు పెట్టడాన్ని హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. ఎఫ్‌టీఎల్ హద్దుల్లో ఉండడంతో ప్రహరీని తొలగించినట్టు హైడ్రా స్పష్టం చేసింది. ఇలా దాదాపు 15 ఎకరాల వరకూ ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి జరిగి మల్లారెడ్డి కుటుంబీకులు ప్రహరీ నిర్మించినట్టు తేలింది. జీడిమెట్ల సర్వే నంబరు 41, 42లలో దాదాపు 20 ఎకరాల మేర ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో వచ్చిన ప్రహరీని కూడా హైడ్రా తొలగించింది. తన తండ్రి దీపక్ వర్మ, పినతండ్రి ప్రశాంత్ వర్మల వారసుడిగా చెబుతూ సుప్రీం కోర్టు న్యాయవాది సౌరబ్‌రాజ్ వర్మ అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఎఫ్‌టీఎల్ హద్దులను చూపించి ప్రహరీని హైడ్రా తొలగించింది.

వృథా అవుతున్న నీరు.. అవస్థలు పడుతున్న వ్యాపారస్తులు!

- వాటర్ ట్యాంక్ నిండిన ప్రతిసారీ రోడ్డుపైకి చేరుతున్న నీరు..
- నిలిచిపోతున్న నీటితో నిత్యం ఇబ్బందులు.. పట్టించుకోని అధికారులు!

షాద్ నగర్, నవంబర్ 3,(వుదయం):





నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు ఒకవైపు ప్రజలకు సూచిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయిలో మాత్రం నీరు వృథాగా పోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీలో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణంలోని రామకృష్ణ థియేటర్ వెనుక లైన్‌లో ఉన్న హనుమాన్ దేవాలయం సమీపంలో వాటర్ ట్యాంక్ నిండిన ప్రతిసారీ నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ట్యాంక్‌లో నీటిని నింపిన అనంతరం వదిలేయడంతో పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన సీసీ రోడ్డు ఒకే స్థాయిలో లేకపోవడంతో ప్రవహించిన నీరు ముందుకు వెళ్లకుండా రోడ్డుపైనే నిలిచిపోతోంది.

దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారితో పాటు అక్కడి వ్యాపారస్తులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు నీటి కొరత నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలని అధికారులు అవగాహన కల్పిస్తుంటే.. మరోవైపు ఇలా నీరు వృథాగా పోతుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ నుంచి నీరు వృథాగా బయటకు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, రోడ్డుపై నిలిచిపోతున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక వ్యాపారస్తులు కోరుతున్నారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌పై అఖిలపక్ష గర్జన

- కాలుష్య కబంధహస్తాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలి..
- శాశ్వత పరిష్కారం కోసం 108 రోజుల కార్యాచరణకు ప్రతిపాదన

తోటకూర వజ్రేష్ యాదవ్

కీసర, వుదయం



జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన,పర్యావరణ కాలుష్యం,ప్రజారోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించడమే లక్ష్యంగా మంగళవారం నాగారంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు,మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని,వేలాది మంది ప్రజల ఆరోగ్యం,జీవన ప్రమాణాలకు సంబంధించిన కీలకమైన ప్రజా సమస్య అని పేర్కొన్నారు.సమస్య పరిష్కారం కోసం పార్టీలకతీతంగా అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఐక్య పోరాటం కొనసాగించాలని,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.ఇందులో భాగంగా 108 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి,దశలవారీగా పోరాట కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో ప్రతిపాదించారు.రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు,స్థానిక ప్రజలను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం పై చర్చించారు.ప్రజారోగ్యం,పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించేందుకు అఖిలపక్షంగా కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,సీపీఐ మాస్ లైన్ నాయకుడు గడ్డం సదానందం,సీపీఎం నాయకుడు పి. సత్యం,టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి,టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్,దమ్మాయిగూడ జేఏసీ చైర్మన్ శంకర్ నాయక్, జవహర్‌నగర్ జేఏసీ కన్వీనర్ షేక్ షావలీ,జేఏసీ నాయకులు సామిరెడ్డి,సంజీవరెడ్డి,స్వర్ణ,కేపీ చారి,తెలంగాణ రక్షణ సమితి పార్టీ అధ్యక్షురాలు మేకలలిత యాదవ్,దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షుడు ముప్పా రామారావు,జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలు,మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్,చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్,కీసర డివిజన్ అధ్యక్షురాలు స్వప్న విజయ్ రెడ్డి,బీఆర్ఎస్ మాజీ చైర్మన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్,జవహర్‌నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్,మాజీ మేయర్ కావ్య,నాగారం మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,జవహర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్,దమ్మాయిగూడ టీడీపీ అధ్యక్షుడు కృష్ణారావు,డీసీసీ కార్యదర్శి పంగ హరిబాబు,శ్రీకాంత్ రెడ్డి,సదానంద,సీనియర్ నాయకుడు శంకర్ గౌడ్,మాజీ కౌన్సిలర్లు యాదగిరి గౌడ్,వెంకట్ రెడ్డి,దుర్గాప్రసాద్ గౌడ్, రమేష్,హరి గౌడ్,శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



1.13 కేజీల గంజాయి పట్టివేత..

రూ. 18,730 నగదు స్వాధీనం.

హైదరాబాద్ :

దూళిపేట్ ఎక్సైజ్ స్టేషన్లోని బలరాం గల్లీలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న ఇద్దరినీ ఎక్సైజ్ స్టేషన్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బంది అరెస్ట్ చేశారు.

నిందితుల వద్ద 1.13 కేజీల గంజాయి తో పాటు గంజాయి అమ్మకాలు జరిపిన రూ.8,730 నగదును స్వాధీనం చేసుకున్నారని సీఐ తెలిపారు.

ఈ కేసులో మంగళ్ హాట్ కు చెందిన హతఘాడే ఆమన్(43), సంతోష్‌సింగ్ (42) లను అరెస్ట్ చేశారు.

గంజాయిని పట్టుకున్న కేసులో సీఐ ప్రవీణ్ కుమార్, విప్లవ రెడ్డి తో పాటు వెంకన్న,జనార్ధన్, షబ్బీర్, రిజ్వాన్, నాగరాజు, సూర్య, పరమేశ్వరి, అనితలు ఉన్నారు.

నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

బోహ్రా కమ్యూనిటీ సభ్యుల దీపావళి శుభాకాంక్షలు..



- బోహ్రా కమ్యూనిటీ సభ్యుల ఆత్మీయ దీపావళి శుభాకాంక్షలకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు

ఆల్వాల్ (వుదయం):

దీపావళి పండుగను పురస్కరించుకుని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారికి బోహ్రా కమ్యూనిటీకి చెందిన ప్రముఖులు, సభ్యులు హృదయపూర్వకంగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా జనాబ్ సైపుల్లా భాయ్ సాబ్, జనాబ్ అబ్బాస్ భాయ్ సాబ్, అమ్మర్ షాకీర్, హకీమ్ మియాజీవాలా, బుర్హానుద్దీన్ షాకీర్, హుస్సేన్ సలేహ్ తదితరులు ఎమ్మెల్యే గారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.బోహ్రా కమ్యూనిటీ సభ్యులు చూపిన ఆప్యాయతకు, ప్రేమాభిమానాలకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాంటి పండుగలు సమాజంలో సోదరభావం, ఐక్యత, పరస్పర గౌరవం, స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు సుఖసంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. బోహ్రా కమ్యూనిటీ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు మరోసారి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు 48 వ రోజుకు చేరిక

ఆల్వాల్ :



తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 48 వ రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించాలని దీక్షా శిబిరం వేదికగా నాయకులు డిమాండ్ చేశారు. *

ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన విధివిధానాలను వెంటనే ఖరారు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాలు అందించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.*

ఈరోజు రిలే నిరాహార దీక్షలో శ్రీనివాస్ గౌడ్ కూర్చున్నారు ఈ కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, దయాకర్,దోలి సుదీర్,అనంతుల సంతోష్, మంద శోభన్ బాబు,ముత్యాలు, మల్లేష్, అనిల్ రాజ్ ,సంగమేశ్వర్ నాగేశ్వర్ రావు,రమేష్,అరుణ్, రాము తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

ఎస్‌కేఎస్ ఫోర్‌క్‌లిఫ్ట్ సర్వీసెస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 3,

మేడ్చల్ జిల్లా చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఎస్‌కేఎస్ ఫోర్‌క్‌లిఫ్ట్ సర్వీసెస్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో వస్తున్న నూతన అవకాశాలను యువ పారిశ్రామికవేత్తలు అందిపుచ్చుకోవాలని, నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటు చేస్తూ ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పారిశ్రామికవాడల్లో వ్యాపార సంస్థల అభివృద్ధి స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.

ఎస్‌కేఎస్ ఫోర్‌క్‌లిఫ్ట్ సర్వీసెస్ సంస్థ క్లుగాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అధీకృత డీలర్‌గా మెటీరియల్ హ్యాండ్లింగ్ రంగంలో సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. సంస్థ యాజమాన్యం నాణ్యమైన సేవలతో వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, BRS పార్టీ నాయకులు వినియోగదారులు, వ్యాపార భాగస్వాములు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.


నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు
- జిల్లాలో ఇప్పటికే 10 క్రిమినల్ కేసులు నమోదు

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

హైదరాబాద్





ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరలకే బియ్యం విక్రయించాలని,వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) డి.విజయేందర్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యానికి ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ విక్రయ ధరలను ఆయన వెల్లడించారు.తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ.66,తెలంగాణ సోనా బియ్యం కిలో రూ.74, తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం కిలో రూ.79 చొప్పున విక్రయించాలని స్పష్టం చేశారు.రైస్ మిల్లర్లు,రైస్ ట్రేడర్లు,హోల్ సేల్ డిపో నిర్వాహకులు,రిటైలర్లు నిర్ణయించిన ధరలకు మించి బియ్యం విక్రయించరాదని సూచించారు. ప్రభుత్వ ధరలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేసినట్లు గుర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో 10 క్రిమినల్ కేసుల నమోదు

బియ్యం అధిక ధరల విక్రయాలపై ఇప్పటివరకు జిల్లాలో 10 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు.జిల్లా పౌర సరఫరాల అధికారి,సివిల్ సప్లై అధికారులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ నిర్ణయాలను ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి రిటైల్,హోల్‌సేల్ బియ్యం వ్యాపారి తమ దుకాణాల ముందు ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలను స్పష్టంగా కనిపించేలా బ్యానర్ ప్రదర్శించాలని ఆదేశించారు.ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి కోరారు.

డంప్ యార్డ్ నిర్వహణ లోపాలపై ఎమ్మెల్యే నిలదీత

దీపావళిలోపు సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

సంగారెడ్డి జిల్లా ప్రతినిది వుదయం :



డంప్ యార్డ్ నిర్వహణలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎంకేపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అధికారులతో పాటు ఎంకేపల్లి గ్రామస్థులతో కలిసి ఆయన డంప్ యార్డ్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. గ్రామస్థుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, దీపావళి పండుగలోపు పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

డంప్ యార్డ్ నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్త రోడ్లపైకి చేరుతోందని, దీంతో కుక్కలు, పందులు, పశువుల సంచారం పెరిగిపోయిందని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో కుక్కల స్వైరవిహారంతో విద్యార్థులు,మహిళలు, పాదచారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చెత్తను రోడ్లపై వేయకుండా డంప్ యార్డ్‌లోనే నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా డంప్ యార్డ్ నుంచి వెలువడుతున్న కలుషిత వర్షపు నీరు సమీపంలోని రెండు చెరువుల్లో కలుస్తుండటంతో నీరు కలుషితమవుతోందని, దీనివల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామస్థులు వివరించారు. ఈ రెండు చెరువులు గంగకత్వ కాలువకు టెయిల్ ఎండ్ పాండ్స్ కావడంతో కలుషిత జలాలు చెరువుల్లోకి చేరకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయని, ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా ఎంకేపల్లి చౌరస్తాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు, ప్రయాణికుల భద్రత దృష్ట్యా వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంకేపల్లి గ్రామ యువత, మాజీ సర్పంచులు రాములు, శేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

జానకీనగర్ చోరీ కేసును ఛేదించిన అల్వాల్ పోలీసులు



29.2 తులాల బంగారం, 27 తులాల వెండి స్వాధీనం – ఒకరి అరెస్ట్, మరో నిందితుడు పరారీ

ఆల్వాల్ వుదయం

అల్వాల్ పోలీస్టేషన్ పరిధి జానకీ నగర్ లో గత శనివారం రాత్రి జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఇంట్లో వారు సాయంత్రం దమ్మాయి గూడలోని బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో చోరీ జరిగినట్లు 100/112 కు ఫిర్యాదు చేశారని అల్వాల్ ఏసిపి రమేష్ తెలిపారు. ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అల్వాల్ పోలీసులు దార్ల అల్వాల్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించామన్నారు. నెహెమయ్య అలియాస్ బ్రూస్లీ అనే నిందితుడు, మరో నిందితుడు నితిన్ ఫ్రాన్సిస్ తో కలిసి చోరికి పాల్పడినట్లు సాంకేతిక ఆధారాలతో గుర్తించినట్లు ఏసిపి రమేష్ తెలిపారు. చోరికి గురైన 29.2 తులాల బంగారం, 27 తులాల వెండి ఆభరణాలను రెండవ నిందితుడు నితిన్ ఫ్రాన్సిస్ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. ఫ్రాన్సిస్ ను బేగంపేట్ లోని బాలమ్ రాయ్ ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకోగా ప్రధాన నిందితుడు దార్ల నెహెమయ్య ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు ఏసిపి వివరించారు. నిందితులను గుర్తించడం, చోరికి గురైన సొత్తును పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అల్వాల్ పోలీసులను ఏసిపి అభినందించారు.

PHC భవన నిర్మాణానికి రూ.1.కోటి 43 లక్షల నిధులు మంజూరు

-ఊర్కొండకు PHC మంజూరు చేయించిన MLA

ఊర్కొండ వుదయం:



నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం

* అభివృద్ధి పనులపై నిరంతరం పర్యవేక్షణ..

* నిత్యం అధికారులతో అభివృద్ధి పనులపై చర్చలు...ఊర్కొండ మండల అభివృద్ధిలో తన పేరు చిరస్థాయిగా నిలువాలనేదే *MLA జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరిక

ఊర్కొండ: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జననేత, అభివృద్ధి ప్రదాత *ఎమ్మెల్యే శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఊర్కొండ మండలానికి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు..

* ఊర్కొండ మండల కేంద్రంలో వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ PHC భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన MLA నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే గారికి మండల ప్రజల తరపున ధన్యవాదాలు.. కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము ఊర్కొండ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దాప నిఖిల్ రెడ్డి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు



గ్రేటర్ హైదరాబాద్





ఘనంగా కాంగ్రెస్ అధ్యక్షులు వరగాని వాసు జన్మదిన వేడుకలు

బాచుపల్లి, నవంబర్ 3,(వుదయం ప్రతినిధి),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ సర్కిల్, బండారి లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు జన్మదిన వేడుకలు వారి నివాసం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు వాసుని గజమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి వారితో కేక్ కట్ చేయించి వారికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఆ భగవంతుని ఆశీస్సులతో వారు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్పూ ర్తిగా కోరుకుంటు వారు చేపట్టే ప్రతి పనిలో విజయం సాధిస్తూ, మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాల ని, సమాజానికి మరింత సేవ చేస్తూ అందరి అభిమానాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్య క్షులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, కుటుంబ సభ్యులు తదితరు లు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు – బండారు దత్తాత్రేయ

- **మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది**

ముషీరాబాద్,నవంబర్ 03 (వుదయం)



యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలకు బానిసలై అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబుల్లా ఖాన్ ఆడిటోరియంలో అలై బలై ఫౌండేషన్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 'ఫ్రీ ఇండియా' అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, అలాంటి యువత మత్తు పదా ర్థాల మాయలో పడి తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవడం అందోళనకర మని అన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాలకే కాకుండా కుటుంబ వ్య వస్థకు, సమాజ శాంతికి కూడా తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, మా దకద్రవ్యాల అక్రమ విక్రయాలు, విచ్చ లవిడి వినియోగాన్ని అరికట్టేందుకు ప్ర భుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల ప్రభావం తో వ్యక్తులు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారని, అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయ ని పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. యువతలో అవగాహన పెంపొందించడంతో పాటు పాఠశాల లు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్య తిరేక పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలిచినప్పుడే ఆరోగ్యకరమైన, ప్రశాం తమైన సమాజాన్ని నిర్మించగలమని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో జమ్మూ కాశ్మీర్ రిటైర్డ్ డీజీపీ కే. రాజేంద్ర కుమార్, రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తిరుమల్ రావు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, సీనియర్ జర్నలిస్ట్ రాము శర్మ, రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనకు మరిన్ని అవగాహన కార్యక మాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు.



జాతీయ స్థాయిలో శ్రీ గురుదత్త పాఠశాల విద్యార్థుల పతకాల పంట

- **గ్రాప్లింగ్ పోటీల్లో సాయి రాహుల్‌కు కాంస్యం.. హర్ష వర్ధన్‌కు రజతం**

ముషీరాబాద్, నవంబర్ 3(వుదయం)

జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో నల్ల కుంట శ్రీ గురుదత్త ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, నగరానికి గర్వకారణం గా నిలిచారు. పదో తరగతి విద్యార్థులు, స్నేహితులైన ఎన్. సాయి రాహుల్, టి. హర్ష వర్ధన్ 2026లో ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో నిర్వహించిన 19వ గ్రా ప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (GFI) జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి తమ సత్తా చాటారు. అండర్ 18 బాలుర విభాగంలో పోటీపడి ఒకరు కాంస్య పతకం, మరొకరు రజత పతకం కైవసం చేసుకున్నారు.

రెండేళ్ల క్రితం వేసవి శిక్షణ శిబిరంలో ప్రారంభమైన వీరి క్రీడా ప్రయాణం నేడు జాతీయ స్థాయిలో పతకాల సాధన వరకు చేరడం విశేషం. హైద రాబాద్ విద్యానగర్‌లోని పవర్ జోన్ శాంక్చురీలో మాస్టర్స్ మల్లేష్, హరీష్ శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో గ్రాప్లింగ్, బ్రె జిలియన్ జియుజిట్సు, రెజ్లింగ్, కిక్‌బా క్సింగ్ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో కఠోర శిక్షణ పొందుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇప్పటికే పలు స్వర్ణ, రజత పతకాలతో పాటు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతున్న విద్యార్థులను పాఠశాల చైర్మన్ వై.ఎస్. శర్మ, ప్రిన్సిపాల్ రేణుక అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్న వారి కల నెరవేరాలని ఆకాంక్షిం చారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనంపై పుణ్యక్షేత్రాల యాత్ర



- **శ్రీశైలం, తిరుపతి, కాణిపాకం దర్శించుకున్న గడ్డపోతారం యువకుడు**

జిన్నారం నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)

గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన సుభాష్ భక్తి సంకల్పంతో చేపట్టిన యాత్రను విజయవంతంగా పూర్తి చేసు కున్నాడు గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన యువకుడు మద్దూరి సుభాష్. తన హీరో హోండా ద్విచక్ర వాహనంపై శ్రీశైలం, తిరుమల తిరుపతి, కాణిపాకం పుణ్యక్షేత్రాలను సందర్శించి స్వామివార్ల ను దర్శించుకున్నాడు. సాధారణ ద్విచక్ర వాహనంపై పలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించడం విశేషంగా నిలిచింది. ఈ యాత్రలో భాగంగా శ్రీశైలం మల్లికార్జున స్వామివారిని, తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకుని ప్ర త్యేక పూజలు నిర్వహించాడు. భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఈ యాత్ర తనకు ఎంతో సంతృప్తి నిచ్చిందని సుభాష్ పేర్కొన్నాడు. ఆధునిక వాహనాలు, సౌకర్యాలపై కాకుండా తన వద్ద ఉన్న హీరో హోండా ఫ్యాషన్ ప్రోపైనే పుణ్యక్షేత్రాల యాత్ర చేపట్టడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. సుభాష్ భక్తి సం కల్పాన్ని తెలిసిన స్థానికులు, స్నేహితులు అభినందిస్తున్నారు.

SC - డక్కలి విద్యార్థినీ చంద్రకళ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి

- **రూ 25 లక్షల ఎక్స్ గ్రేషియా మరియు ఇతర అన్ని రకాల ప్రయోజనాలను అందించాలి.**
- **విద్యార్థినీలు సమస్యలను ధైర్యం, తెగువతో ఎదుర్కోవడం నేర్చుకోవాలి.**
- **ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు.**
- **విద్యార్థినీలకు అండగా ఉండడానికి MRPS 24 గంటలు అందుబాటులో ఉంటుంది.**
- **MRPS అధినేత 'పద్మశ్రీ' మందకృష్ణ మాదిగ.**

షాద్ నగర్, నవంబర్ 3,(వుదయం):



వివరణ :-

SC డక్కలి కులానికి చెందిన మొదటి తరం విద్యార్థినీ ఎన్నో అవరోధాలు అధి గమించి కోటి ఆశలతో శాతవాహన యూనివర్సిటీలో చేరి లా కోర్సు చదు వుతున్న డాకూరి చంద్రకళ ఆత్మహత్య చేసుకొని మరణించడం అత్యంత వి చారకరమని, సమాజ జీవనానికి దూరంగా అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉన్న ఆమె కుటుంబాన్ని మానవీయ కోణంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని అండగా నిలబడా లని MRPS వ్యవస్థాపక అధ్యక్షులు 'పద్మశ్రీ' మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.డాకూరి చంద్రకళ అంతక్రియలు షాద్ నగర్ లో జరుగగా MRPS అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు హాజరై ఆమె భౌతిక దేహానికి పూ లమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రకళ పాడే మోసి అంత్య క్రియలు పూర్తి అయ్యేంత వరకు ఉన్నా రు.ఈ సందర్భంగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారు మాట్లాడుతూ " డక్కలి కులం అంటారనితనానికి, అవమానా లకు, వివక్షతకు అణచివేతలకు గురై ఎన్నో ఏండ్లుగా ప్రధాన సమాజానికి దూరంగా బతుకుతుందని అన్నారు. అలాంటి డక్కలి కులంలో అక్షరాస్యత అతి తక్కువ.ఉన్నత చదువుల్లో డక్కలి కులానికి చెందిన వారు లక్షలాది వి ద్యార్థుల్లో ఎవరో ఒకరి అరుదుగా కని పిస్తారు.అలా యూనివర్సిటీ స్థాయికి చేరుకొని లా చదువుకోవడానికి డాకూరి చంద్రకళ ఎన్నో అవరోధాలను, కష్టాల ను దాటి ఉంటుంది.ఇప్పుడు ఉన్నత చదువులను పూర్తి చేసుకుని ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబానికి కొండంత అండగా ఉంటుందని భావిస్తున్న సమయంలో ఆమె అర్ధంతరంగా ఆత్మ హత్యకు పాల్పడి తన జీవితాన్ని ముగిం చుకోవడం అత్యంత విచారకరం అని అన్నారు.ఆమె మరణానికి కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు.దళితుల్లో అత్యంత దళితులు, పేదల్లో అత్యంత పేదలైన డక్కలి చంద్రకళ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకో వాలని డిమాండ్ చేశారు.చంద్రకళ మృతితో ఆమె తల్లితండ్రుల కలలు చెదిరిపోయి వారి భవిష్యత్ ఆందోళన కరంగా మారింది అని అన్నారు. అం దువల్ల ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి తక్షణమే రూ 25 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.నిన్న కరీంనగర్ లో MRPS నిర్వహించిన ఆందోళన ఫలితంగా శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తన పరిధిలో ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వడానికి అం గీకరించడం, తక్షణ సహాయం కింద లక్ష యాభై వేల రూపాయలు ఇవ్వడం జరిగింది అని అన్నారు.ఇక రాష్ట్ర ప్ర భుత్వం రూ 25 లక్షల ఎక్స్ గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం , ఒక ఇల్లు , మూడు ఎకరాల భూమి ఇచ్చి అన్ని విధాలుగా అందుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర ఎస్సీ అభివృ ద్ధి శాఖ మంత్రివర్యులు అడ్లూరు లక్ష్మణ్ కుమార్ గారితో స్వయంగా మాట్లాడ డం జరిగిందని , వారు సానుకూలంగా స్పందించారని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కూడా స్పందించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవడానికి ముందుకు వస్తుందని ఆశిస్తున్నామని అన్నారు.

అలాగే విద్యార్థినీలు (గర్ల్స్) ఎంత పెద్ద సమస్యలు ఎదురైనా ఎవరు ఆత్మహత్య లకు పాల్పడద్దని , ధైర్యంతో,తెగువతో ఎదురించాలని పిలుపునిచ్చారు.ఎంత పెద్ద సమస్య ఎదురైన MRPS ను సం ప్రదించాలని , విద్యార్థులకు అండగా నిలబడడానికి MRPS 24 గంటలు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని , ధైర్యంగా ఎదుర్కోవడమే పరి ష్కారం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో MRPS ఉమ్మడి రం గారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ, MSP మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, MRPS మాజీ జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ.

అర్హులైనవారు పట్టభద్రుల ఓటర్ గా నమోదు చేసుకోవాలి

- **అర్హులైనవారు పట్టభద్రుల ఓటర్ గా నమోదు చేసుకోవాలి**
- **బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్**

కుత్బుల్లాపూర్, నవంబర్ 3,(వుదయం ప్రతినిధి),



2027 మార్చిలో జరగనున్న మహబూబ్ నగర్ రంగారెడ్డి హై దరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ విడుద లైన సందర్భంగా పట్టభద్రులు ఓటర్ గా నమోదు చేసుకోవాలని నిజాంపేట్ సర్కిల్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్ప టికే నోటిఫికేషన్ విడుదలైందని, నవంబర్ 1, 2023 లోపు గ్రాడ్యు యేషన్ పూర్తయిన పట్టభద్రులు ఈ ఓటు హక్కును నమోదు చేసుకోవా లని, నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీలలో గల పట్టభద్రు లను గుర్తించి వెంటనే ఓటరు నమోదు చేయించాలన్నారు. గతంలో ఓటు వేసిన వారు కూడా మరోమారు ఓటును నమోదు చే సుకోవాలి. ఎందుకంటే గత ఎన్ని కల్లోని ఓటరు జాబితా పూర్తిగా రద్దవుతుందని, నూతనంగా ఓటరు నమోదు చేసుకున్న వారితో కలిపి నూతన ఓటరు జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేస్తుంది. ప్రతి డివిజన్, వార్డు, బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రాడ్యు యేట్ ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియో గించుకునేలా కృషి చేయాలని, రంగా రెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలలో ఉన్న పట్టభద్రులు అందరూ తమ ఓటు నమోదు చేసుకో వాలని పిలుపు నిచ్చారు.

శంకర్‌పల్లి మండలంలో జలసిరి పనులపై

జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ సమీక్ష..





- **ప్రతి గ్రామపంచాయతీలో 100 ఇంకుడు గుంతల నిర్మాణానికి లక్ష్యం..**

శంకర్ పల్లి నవంబర్ 03 (వుదయం)

మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామపంచా యతీని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణం మరియు జలసిరి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షిం చారు.అనంతరం శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, మండలంలో చేపడుతున్న జలసిరి పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భం గా ప్రతి గ్రామపంచాయతీలో కనీసం 100 ఇంకుడు గుంతలను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ పనులన్నిం టినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించా రు. నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయని వారిపై తప్పనిసరిగా శా ఖాపరమైన చర్యలు తీసుకుంటామని హె చ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. ప్రవీణ్ కుమార్, మండల పంచాయతీ అధికారి గిరిరాజు, ఏఈ పీఆర్ నందకిషోర్, ఏఈ (ఎంట్రా) వెంకటేశ్వర్లు, ఏపీఓ నాగభూష ణం, ఈసీ. జనార్దన్ రెడ్డి, టీవీ. యాదయ్య మరియు మండలంలోని అన్ని గ్రామపం చాయతీల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆశీస్సులు.. ప్రజాసేవకు మరింత ప్రోత్సాహం!

- **బీరంగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్‌కు ఘన సన్మానం**
- **పటేల్‌గూడలోని నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు**

అమీన్‌పూర్ (వుదయం):



బీరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా ఈర్ల రాజు ముదిరాజ్ నియమితులైన సందర్భం గా కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ ప్రాం తాలకు చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. పటేల్‌గూ డలోని ఆయన నివాసానికి చేరుకున్న సంఘం నాయకులు శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సమాజానికి విలువైన మార్గదర్శకులని, వారి అనుభవం, సూచనలు, ఆశీస్సులు యువతకు ఎంతో స్ఫూర్తినిస్తాయని అన్నారు. పె ద్దలను గౌరవించడం, వారి అవసరా లను గుర్తించి సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

గతంలో సీనియర్ సిటిజన్స్ సాయంత్రం వేళల్లో ఒకచోట చేరి ప్రశాంతంగా గడిపేందుకు అనువైన స్థలాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, వారు సౌకర్యవంతంగా కూర్చునేం దుకు బల్లలు, బెంచీలు, కుర్చీలు సమకూర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం సుమారు 100 మంది సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ అక్కడ సమావే శమవుతూ, వాకింగ్ చేస్తూ, ఒకరితో ఒకరు ఆత్మీయంగా మాట్లాడుకుం టూ ఆనందంగా సమయం గడుపు తున్నారని చెప్పారు.

వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే తనకు ఎంతో సంతృప్తినిస్తుందని, భవిష్యత్తులోనూ సీనియర్ సిటిజ న్స్‌కు అవసరమైన సహాయ సహకా రాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.

సీనియర్ సిటిజన్ నాయకులు రా మచంద్ర గౌడ్ మాట్లాడుతూ.. ఈర్ల రాజు ముదిరాజ్ వంటి ప్రజాసేవా దృక్పథం కలిగిన నాయకులు సమా జానికి ఎంతో అవసరమని అన్నారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలను అర్థం చేసుకొని, వారిని కుటుంబ సభ్యుల్లా ఆదరిస్తూ ప్రత్యేకంగా సమావేశ స్థలా న్ని ఏర్పాటు చేయడం, అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీ యమని పేర్కొన్నారు.

తామంతా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ పరిసర ప్రాంతాల్లో కుటుంబాలతో స్థిరపడ్డామని, తమ పిల్లలు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన తమను పరాయివారిగా చూడకుండా సొంతవారిలా ఆదరి స్తూ, అవసరాలను గుర్తించి సహా యపడుతున్న ఈర్ల రాజు ముదిరా జ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు, మంచి అవకాశా లు రావాలని ఆకాంక్షిస్తూ, ఆయన ప్రజాసేవా ప్రయాణంలో తామంతా అండగా ఉంటామని రామచంద్ర గౌడ్ స్పష్టం చేశారు.

సీనియర్ సిటిజన్స్ నాయకులు తనపై చూపిన అభిమానం, అందించిన ఆశీస్సులు మరింత బాధ్యతను పెంచాయని ఈర్ల రాజు ముదిరాజ్ అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అం దుబాటులో ఉంటూ, సేవా కార్యక మాలను నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజ న్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, ఇతర సంఘం నాయకులు, పలువురు సీనియర్ సి టిజన్స్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బోర్లు వేస్తే

చర్యలు తప్పవని హెచ్చరిక



జిన్నారం నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)

బొల్లారం పట్టణ పరిధిలో అనధికా రిక బోర్‌వెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ని బంధనలను పట్టించుకోకుండా, సంబంధిత శాఖల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు పొంద కుండానే బోర్లు వేస్తున్న ఘటనను అధికారులు గుర్తించారు. ఈ నేప థ్యంలో మంగళవారం జిన్నారం రెవెన్యూ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ యా దయ్యలు రంగంలోకి దిగి స్థానిక చర్చి బస్తీ సమీపంలో బోర్‌వెల్ తవ్వకాలకు ఉపయోగిస్తున్న వా హనాన్ని సీజ్ చేశారు. అనంతరం స్వాధీనం చేసుకున్న వాహనాన్ని తదుపరి చర్యల నిమిత్తం ఐడీఏ బొల్లారం పోలీసులకు అప్పగిం చారు. పట్టణ ప్రాంతాల్లో అనుమ తులు లేకుండా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాల వినియోగం, తవ్వకాల నియంత్రణకు సంబం ధించిన నిబంధనలు ఉల్లంఘించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. బోర్‌వెల్ తవ్వకా లు చేపట్టే ముందు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి అనుమ తులు పొందాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి అనధికా రికంగా బోర్లు వేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హె చ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మౌలానా స్థానికులు పాల్గొన్నారు.

14వ వార్డులో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- **అధికారులకు వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్**

చేవెళ్ల,నవంబర్ 03 (వుదయం)




వినియోగదారుల దినోత్సవాన్ని పురస్క రించుకుని చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని 14వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్య లను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు 14వ వార్డు మున్సిప ల్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ..వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి,విద్యుత్ సరఫరాలో అంతరా యాలు,ఇతర సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వార్డులో విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచి,వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 14వ వార్డ్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్,ఏడీఈ సాయినాథ్, ఏఈ రాజేందర్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



"దేశాన్ని అస్థిరపరిచేందుకు విపక్షాలు విదేశీ శక్తుల సాయం తీసుకుంటున్నారంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపణలు చేస్తున్నారు. ఈ అంశంపై నాతో బహిరంగ చర్చకు రావాలి. మోడీయే విదేశశక్తుల అండతో ప్రధాని పీఠాన్ని కాపాడుకుంటున్నారు. విదేశీ శక్తులసాయంతోనే మీరు ప్రధాని అయ్యారు. వాటి అండతోనే ఈ పీఠంపై కొనసాగుతున్నారు. ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నియంత్రిస్తున్నది విదేశీయులే. విదేశీ సోషల్ మీడియా మీకు సంపూర్ణ మద్దతిస్తోంది. ఈ అంశంపై ఏ వేదికపైనైనా, ఎప్పుడైనా మీతో బహిరంగ చర్చలకు నేనుసిద్ధం. మీకు ధైర్యం ఉంటే రండి. మీరు రారు."

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

వే'మన' పద్యం



వాన కురియకున్న వచ్చును క్షామంబు
వాన కురిసెనేని వరదపారు
వరద కరవు రెండు వరసతో నెరుగుడీ
విశ్వదాభిరామ వినురవేమ

సంపాదకీయం

పేదరికం తగ్గిందా.. లెక్కల్లోనేనా?

పేదరిక నిర్మూలన ఏ దేశానికైనా అత్యంత కీలకమైన అభివృద్ధి లక్ష్యం. కోట్లాది మంది ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో భారతదేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించిన గణాంకాలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. రోజుకు మూడు డాలర్ల కంటే తక్కువ వినియోగ సామర్థ్యం ఉన్నవారి శాతం దశాబ్దం క్రితం 26 శాతంగా ఉండగా, ప్రస్తుతం 2.6 శాతానికి తగ్గినట్లు నివేదిక పేర్కొంది. బహుముఖ పేదరిక సూచికలు కూడా ఇదే ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ పరిణామం సంతోషించదగినదే. అయితే గణాంకాల్లో కనిపిస్తున్న అభివృద్ధి సామాన్యుల జీవితాల్లోనూ అంతే స్థాయిలో ప్రతిఫలిస్తోందా? అన్నదే ఇప్పుడు కీలకమైన ప్రశ్న.

పేదరికాన్ని కొలిచే విధానాలు, ప్రామాణికాలు మారినప్పుడు ఫలితాల్లోనూ వ్యత్యాసాలు కనిపించే అవకాశం ఉంది. ప్రభుత్వం అందించే ఉచిత రేషన్, ఆహార భద్రత వంటి సంక్షేమ పథకాలు కోట్లాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్నాయి. అయితే ఈ సాయాన్ని పరిగణనలోకి తీసుకొని పేదరికం తగ్గిందని నిర్ధారించడం ఎంతవరకు సమంజసం? ఉచిత ఆహార ధాన్యాలు అందుతున్నంతకాలం ఆకలి బాధ కొంతవరకు తగ్గవచ్చు. కానీ ఆ సహాయం నిలిచిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటి? స్థిరమైన ఆదాయం, గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక భద్రత లేకుండా పేదరికం నుంచి పూర్తిగా బయటపడినట్లు చెప్పగలమా? సంక్షేమ సాయం పేదరికాన్ని తాత్కాలికంగా తగ్గించవచ్చు. కానీ స్వయం సమృద్ధి మాత్రమే ప్రజలకు శాశ్వత భరోసా కల్పిస్తుంది. మాతృ ఆరోగ్యం వంటి సూచికల్లో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను విస్మరించలేం. నిరుద్యోగం, అసంఘటిత రంగ కార్మికుల అభద్రత, వ్యవసాయ ఆదాయాల్లో అనిశ్చితి కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండగా, విద్య, వైద్యం సామాన్యులకు భారంగా మారుతున్నాయి. నెలవారీ ఆదాయంలో అధిక భాగం ఆహారం, అలాగే బ్యాంకు ఖాతాలు, విద్యుత్ కనెక్షన్లు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాల లభ్యత జీవన ప్రమాణాల మెరుగుదలకు సూచికలుగా ఉపయోగపడుతున్నాయి. అయితే బ్యాంకు ఖాతా ఉండటం వేరు.. అందులో పొదుపు ఉండటం వేరు. విద్యుత్ కనెక్షన్ ఉండటం వేరు.. బిల్లు చెల్లించే ఆర్థిక సామర్థ్యం ఉండటం వేరు. సంక్షేమ పథకాల అమలులో భాగంగా తెరిచిన ఖాతాలను మాత్రమే అభివృద్ధికి కొలమానంగా చూపడం సరైన అంచనా కాదు. ప్రజల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి, జీవన వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.మరోవైపు ఆకలి, పోషకాహార లోపం, శిశు మరణాలు, మాతృ ఆరోగ్యం వంటి సూచికల్లో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను విస్మరించలేం. నిరుద్యోగం, అసంఘటిత రంగ కార్మికుల అభద్రత, వ్యవసాయ ఆదాయాల్లో అనిశ్చితి కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండగా, విద్య, వైద్యం సామాన్యులకు భారంగా మారుతున్నాయి. నెలవారీ ఆదాయంలో అధిక భాగం ఆహారం, అద్దె, వైద్యం, పిల్లల చదువులకే ఖర్చవుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఎలా నిలదొక్కుకోగలవు? ఉద్యోగం ఉన్నా జీవన వ్యయాలను తట్టుకోలేని పరిస్థితి ఉంటే దానిని పేదరిక నిర్మూలనగా భావించలేం.ప్రపంచ బ్యాంకు నివేదికను పూర్తిగా తప్పుబట్టాల్సిన అవసరం లేదు. పేదరికం తగ్గుదలకు దోహదపడిన సంక్షేమ పథకాలు, ఆర్థిక అవకాశాలు, మౌలిక సదుపాయాల విస్తరణను గుర్తించాలి. అదే సమయంలో గణాంకాల వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక వాస్తవాలను కూడా పరిశీలించాలి. పేదరికాన్ని అంచనా వేసేటప్పుడు వినియోగ వ్యయంతోపాటు ఉపాధి భద్రత, వాస్తవ వేతనాలు, పోషకాహారం, విద్య, వైద్య ఖర్చులు, అప్పుల భారం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.దేశం నిజంగా పేదరికం నుంచి బయటపడాలంటే ప్రజలకు ఉచిత పథకాలతోపాటు స్థిరమైన ఉపాధి, నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, గౌరవప్రదమైన వేతనాలు కల్పించాలి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరాలి. గణాంకాల్లో పేదరికం తగ్గడం ఒక విజయమే కావచ్చు. కానీ సామాన్యుడి ఇంట్లో ఆకలి తగ్గి, ఆదాయం పెరిగి, భవిష్యత్తుపై భరోసా కలిగినప్పుడే అది నిజమైన విజయమవుతుంది.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

బియ్యం ధరలను పెంచుతున్న సిండికేట్ వ్యాపారులు

నేటి ప్రభుత్వాల పాలనలో రైతాంగం పండించే ఏ పంటకు న్యాయమైన ధర లభించక నష్టపోయినరైతులు అప్పుల పాలై బలవన్మరణాల పాల్పడుతుంటే, మరొక వైపున బడా వ్యాపారులు, పెద్ద పెద్ద రైస్మిల్లర్లు లాభాలతో జేబులు నింపుకుంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు మాత్రం నిత్యావసర ధరలపెరుగుదలతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా బియ్యం ధరల పెరుగుదల సామాన్య ప్రజలపై తీవ్రప్రభావం చూపుతున్నది.
కేంద్ర తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు ఆకాశం వైపు పరిగెడుతున్నాయి. జూలై 2026 వరకు రిటైల్ మార్కెట్ లో సోనా మసూరి కిలో 65 రూపాయలు ఉంటే , అక్టోబర్ నాటికి 85 నుండి 105 రూపాయలకు చేరింది. బి పి టి 52 నుండి 65 నుండి 75 రూపాయలకు కేజీ ధర పెరిగింది. సాధారణ రకం 38 నుండి 50 రూపాయలకు పెరిగింది. అంటే మూడు నెలల్లో సో నా మసూరి ధర 30నుండి 40 రూపాయలు పెరిగితే ,బి పి టి 20 రూపాయలు, సాధారణ బియ్యం 12 రూపాయలు పెరిగింది. జూలై 2026 మేలు రకం సో నా మ సూ రి 26 కేజీల బస్తా 1400 వందల నుండి 1600 రూపాయలు ఉంటే, అక్టోబర్ నాటికి 2,200 నుండి 2,400 రూపాయలకు పెరిగింది. దీన్నిగమనిస్తే మూడు నెలల కాలంలో ఏ మోతాదులో బియ్యం ధరలు పెరిగింది అర్థం అవుతుంది. బియ్యం ధరలతో పాటు పంచదార కిలో 30 నుండి 65 రూపాయలకు పెరగగా, ఏడాది కాలం ఉల్లిపాయ ధర 83% పెరగగా,ఎండు మిర్చి ధర 54% పెరిగింది.
కంది పప్పు, కూరగాయల ధరలు పెరిగాయి. ధరల పెరుగుదల పేద, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడి తీవ్ర ఆర్థిక సమస్యను ఎదుర్కొంటున్నారు.
ధరల పెరుగుదలకు కారణాలు : బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి ప్రభుత్వ విధానాలు, సిండికేట్ వ్యాపారులే కారణం. సిండికేట్ వ్యాపార వర్గం మార్కెట్ యంత్రాంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని ,కృత్రిమ కొరత సృష్టించి, వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల నుండి బియ్యం అమ్మకం వరకు ప్రతి దశలోనూ ధరలను వీళ్లే నిర్ణయిస్తారు. మార్కెట్ యార్డుల్లో ఒకే రకమైన తక్కువ ధర నిర్ణయించి రైతులు ఆ ధరకే

అమ్ముకునే పరిస్థితులు కల్పిస్తారు. పంట సీజన్ ముగిసేనాటికి ధాన్యం అంతటినీ కొనుగోళ్లు చేసి దాసి పెడతారు. మార్కెట్ లోకి సరుకు రాకుండా చేసి వినియోగదారుల్లో భయాందోళనలు సృష్టించడం ద్వారా ధరలు పెరిగేలా చేస్తారు. చిన్న వ్యాపారులు లేదా స్వతంత్ర మిల్లర్లు తక్కువ ధరకు బియ్యం అమ్మ కుండా అడ్డుకుంటారు. తమ మాట వినని వారిని, వ్యాపార పరంగా బహిష్కరించడం లేదా సరుకు అందకుండా చేయడం వంటి చర్యలకు పాల్పడతున్నారు. రైతుల నుండి వినియోగదారులకు చేరే లోపు కనీసం 3 నుండి 4 దశల్లో సిండికేట్ సభ్యులు మారి, ప్రతి దశలోనూ లాభాల శాతాన్ని పెంచుకుంటూ పోతున్నారు.
దీనివల్ల రైతులకు దక్కేది తక్కువ, వినియోగదారులు పెట్టే ధర ఎక్కువ అవుతున్నది.
సిండికేట్ల లాభాలు మరియు మోసాలు : బియ్యం మార్కెట్లో సిండికేట్ వ్యాపారుల లాభాలు సాధారణ వ్యాపార లాభాల కంటే 3 నుండి 4 రెట్లు అధికంగా ఉన్నాయి. మార్కెట్ ను తమ అదుపులో ఉంచుకోవడం ద్వారా వీరు అక్రమంగా భారీ లాభాలు గడిస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరకంటే 15 నుండి 20% తక్కువ ధరకు కొనుగోళ్లు చేస్తారు. అదే సరుకును వినియోగదారులకు అమ్మేటప్పుడు మార్కెట్ ధర కంటే 30 నుండి 40% అదనపు ధరకు విక్రయించి రెండు విధాల భారీగా లాభాలు గడిస్తున్నారు. 40 రూపాయలకు కొన్న బియ్యాన్ని గోదాముల్లో నిల్వ ఉంచి , మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి కిలో 60 నుండి 70 రూపాయలకు అమ్ముతున్నారు. వందల కోట్ల లాభాలు పొందుతున్నారు. సాధారణ లేదా నాణ్యత లేని బియ్యాన్ని అత్యాధునిక మిల్లుల్లో పాలిస్ చేసి బ్రాండెడ్ సంచుల్లో ప్యాక్ చేసి, సూపర్ ఫైన్ రకం పేరుతో మార్కెట్లో అమ్మి 50% పైగా లాభాలు గడిస్తున్నారు. పేదలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని కిలో 10 నుండి 15 రూపాయలకు కొనుగోళ్లు చేసి, వాటిని పాలిస్ పట్టి బహిరంగ మార్కెట్లో 40 నుండి 50 రూపాయలకు అమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం బియ్యాన్ని జీ ఎస్టీ పరిధిలో జీ రో టాక్స్ కేటగిరిలో ఉంచినప్పటికీ సిండికేట్ వ్యాపారులు పాత పన్నుల విధానాన్ని సాకుగా చూపిస్తూ వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. పన్నుల రాయితీ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించకుండా క్వింటాళ్ కు 400 నుండి 500 వరకు తమ జేబుల్లో వేసుకుంటున్నారు.
సిండికేట్ వ్యాపారులతో మంత్రుల సంబంధాలు: రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన వ్యాపారుల వెనుక ఉన్న రాజకీయ శక్తుల పై తీవ్ర చర్చ సాగుతూనే ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, అధికార పార్టీ నేతలు రైస్ మిల్లర్ల తో కుమ్మక్కు అయి మార్కెట్ లో ధరల పెరుగుదలకు కారణం అవుతున్నారని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. వినియోగదారుల సంఘాలు మరియు రాజకీయ ఇశ్లేషకుల ప్రకారం వ్యాపార కూటములకు, రాజకీయ నాయకుల మధ్య క్షేత్ర స్థాయిలో లావాదేవీల సంబంధాల గురించిన ప్రచారం జరుగుతూనే ఉంది. రైస్ మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపార సామ్రాజ్యాలు రాజకీయ పార్టీలకు భారీగా ఎన్నికల నిధులు సమకూరుస్తుంటాయి. అందుకు ప్రతి ఫలంగా తమ వ్యాపారాల పై ప్రభుత్వ నిఘా మరియు తనిఖీలు పెద్దగా లేకుండా చేసుకుంటున్నారనే ఆరోపణలు వచ్చాయి. మంత్రులు లేదా స్థానిక ప్రజా ప్రతినిధుల రక్షణ ఉండటం వల్ల సిండికేట్ వ్యాపారులు సూపర్ ఫైన్ బియ్యాన్ని అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. నిత్యావసర వస్తువుల చట్టాలను ఉల్లంగించి భారీగా నిల్వలు ఉంచినప్పటికి ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోకుండా చూసుకుంటున్నారు. ఎల్ ని నో ప్రభావం వల్ల వరి సేద్య విస్తీర్ణం తగ్గటమే కాకుండా ధాన్యం దిగుబడి కూడా తగ్గుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా బియ్యం కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ఫలితంగా బియ్యం దిగుమతులు ఎక్కువ అవుతాయి.ఇలాంటి పరిస్థితుల్లో సాగు నీరు ఉన్నా, నీటి సమస్య పేరుతో వరి సేద్యం చేయవద్దని ఏ పీ కూటమి ప్రభుత్వ రైతాంగానికి చెప్పడం, తెలంగాణ ప్రభుత్వం వరి క్రాష్హాలిడే ప్రకటించడం పై రైతాంగం తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు.ముఖ్య మంత్రి చంద్రబాబు వ్యవసాయం దండగ అనే అభిప్రాయం తో , కార్పొరేట్, కాంట్రాక్ట్వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నారు. చిన్న,సన్న కారు రైతులు కాంట్రాక్ట్ వ్యవసాయానికి తమ భూములు ఇచ్చి వాటిల్లో కూలీలుగా పని చేయమని చెప్పారు. రాష్ట్రంలో మొదటి సారి కాంట్రాక్ట్ వ్యవసాయం చంద్రబాబు ప్రోద్బలంతో కుప్పంలో ప్రారంభమైంది. అది విఫలమౌటమే కాకుండా దాని దుష్ఫలితాలు నేటికి రైతులను అనుభవిస్తున్నారు.
రాష్ట్రంలో రైతుల పరిస్థితులను, ఎల్ ని నో ప్రభావాన్ని, ఏర్పడనున్న ఆహార ధాన్యాల కొరతను దృష్టిలో పెట్టుకుని కుంటి సాకులు మాని వరి సేద్యానికి అనుమతించాలని, బియ్యం తదితర ఆహార ధాన్యాల ధరల పెరుగుదలను , సిండికేట్ వ్యాపారుల మోసాలను అరికట్టాలని, దొంగ నిల్వలను బయటకు తీయాలని, బహిరంగ మార్కెట్లో మేలు రకం బియ్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే చౌక ధరకు విక్రయించాలని రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతాంగం, పేద, మధ్య తరగతి ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్యమించాలి.



బొల్లిముంత సాంబశివరావు
9885983526

గిగ్ కార్మికుల జీవితాలకు భద్రత ఏది ?

చేతిలో స్మార్ట్‌ఫోన్.. వీపున డెలివరీ బ్యాగ్.. గమ్యం చూపేది యాప్.. ఆదాయం నిర్ణయించేది అల్గారిథమ్! నగర జీవనంలో నిత్యం కనిపిస్తున్న ఈ దృశ్యం భారత ఉపాధి రంగంలో వస్తున్న పెనుమార్పుకు ప్రతీక. ఇంటి గుమ్మం వద్దకే ఆహారం, సరుకులు తెచ్చేవారు, ఒక్క క్లిక్‌తో ప్రయాణ సౌకర్యం కల్పించేవారు మన దైనందిన జీవితాన్ని సులభతరం చేస్తున్నారు. కానీ అదే వేగంతో పరుగులు తీస్తున్న వారి జీవితాలకు సామాజిక భద్రత ఎంత? ప్రమాదం ఎదురైతే ఆదుకునేదెవరు? అనారోగ్యంతో పనిచేయలేకపోతే కుటుంబాన్ని నెట్టుకొచ్చేదెలా? వృద్ధాప్యంలో ఆసరా ఏమిటి? విస్తరిస్తున్న గిగ్ ఆర్థిక వ్యవస్థ ముందున్న అసలు ప్రశ్నలివే.
నీతి ఆయోగ్ అంచనా ప్రకారం 2020 21లో దేశంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు 77 లక్షల మంది. 202930 నాటికి వీరి సంఖ్య 2.35 కోట్లకు చేరవచ్చని అంచనా. అంటే పదేళ్లలో దాదాపు మూడు రెట్లు పెరుగుతున్న శ్రామిక శక్తి ఇది. గిగ్ ఉపాధి ఇక అదనపు సంపాదనకు పరిమితమైన వ్యవస్థ కాదు. దేశ ఉపాధి ముఖచిత్రాన్నే మార్చగల రంగంగా రూపుదిద్దుకుంటోంది. అందువల్ల దీనిని కేవలం డిజిటల్ వ్యాపార నమూనాగా కాకుండా, కోట్లాది కుటుంబాల జీవన భద్రతతో ముడిపడిన కార్మిక వ్యవస్థగా చూడాల్సిన సమయం వచ్చింది.ఈ వాస్తవాన్ని గుర్తిస్తూ సోషల్ సెక్యూరిటీ కోడ్2020లో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కల్పించారు. జీవిత, వైకల్య భద్రత, ప్రమాద బీమా, ఆరోగ్యం, ప్రసూతి ప్రయోజనాలు, వృద్ధాప్య రక్షణ వంటి సామాజిక భద్రతా అంశాలకు చట్టపరమైన ప్రాతిపదిక ఏర్పడింది. ప్రత్యేక సామాజిక భద్రతా నిధి, జాతీయ సామాజిక భద్రతా బోర్డు వంటి వ్యవస్థలకు అవకాశం కల్పించడం ముందడుగే.202526 కేంద్ర బడ్జెట్‌లో ప్లాట్‌ఫామ్ కార్మికులను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడం, గుర్తింపు కార్డులు ఇవ్వడం, ఆయుష్మాన్ భారత్‌ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పరిధిలో ఆరోగ్య ప్రయోజనాలు కల్పించడం వంటి చర్యలు ప్రకటించారు. 2025 డిసెంబర్ 1 నాటికి దాదాపు 5.12 లక్షల మంది ప్లాట్‌ఫామ్ కార్మికులు ఈశ్రమ్‌లో నమోదయ్యారు. జొమాటో, స్విగ్గీ, ఉబర్, ఓలా, బ్లింకిట్, అమెజాన్, ర్యాపిడో, జెప్టో, అర్బన్ కంపెనీ వంటి ప్రధాన సంస్థలు కూడా ఈ వ్యవస్థతో అనుసంధానమయ్యాయి.అయితే అత్యంత ఆందోళనకరమైన వాస్తవం ఏమిటంటే, లక్షలాది మంది గిగ్ కార్మికులు ఇప్పటికీ పటిష్ఠమైన సామాజిక భద్రతకు దూరంగానే జీవిస్తున్నారు. అనారోగ్యం, ప్రమాదం లేదా అకస్మాత్తుగా ఆదాయం నిలిచిపోయే పరిస్థితి ఎదురైతే వారి కుటుంబ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలే ప్రమాదముంది. ఉపాధి సంఖ్యలు పెరుగుతున్నాయని సంతృప్తి చెందడం సరిపోదు. ఆ ఉపాధికి కనీస భద్రత, గౌరవం, భవిష్యత్తుపై భరోసా కల్పించలేకపోతే డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరణ వెనుక సామాజిక అభద్రత కూడా అంతే వేగంగా విస్తరించే ప్రమాదం ఉంటుంది.నమోదు అంటే భద్రత కాదు; గుర్తింపు అంటే హక్కుల సాధన పూర్తయినట్లూ కాదు. ప్రమాద బీమా, ఆరోగ్య రక్షణ, ఆదాయం కోల్పోయినప్పుడు కనీస ఆర్థిక ఆసరా, వృద్ధాప్య భద్రత వంటి ప్రయోజనాలు కాగితాల నుంచి కార్మికుడి జీవితంలోకి రావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అగ్రిగేటర్ సంస్థలు తమ బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించుకోవాలి. సంక్షేమ పథకాలు సరళంగా, పారదర్శకంగా, ప్రతి అర్హుడికి అందుబాటులోకి రావాలి.డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వేగం ఎంత ముఖ్యమో, దానిని మోస్తున్న శ్రమకు భద్రత అంతకంటే ముఖ్యం. ప్రతి డెలివరీ వెనుక ఒక మనిషి ఉన్నాడు; ప్రతి రైడ్ వెనుక ఒక కుటుంబం ఉంది. యాప్‌కు రేటింగ్ ఇచ్చే వ్యవస్థ ఉంది. శ్రమకు భరోసా ఇచ్చే వ్యవస్థ కూడా ఉండాలి. ఉపాధి అవకాశాలను సృష్టించడమే అభివృద్ధి కాదు;
ఆ ఉపాధిలో గౌరవం, భద్రత, భవిష్యత్తుపై నమ్మకం కల్పించినప్పుడే అది నిజమైన డిజిటల్ ప్రగతి అవుతుంది.



సి.హెచ్.(ప్రతాప్)
77998 00773

పది లక్షల ఎకరాల భూమి వివాదం!

తెలంగాణలో భూహక్కుల పంచాయితీ.. వికారాబాద్‌లో 42 వేల ఎకరాల చిక్కులు.. రైతులకు న్యాయం ఎప్పుడు? రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ–అటవీ శాఖల మధ్య భూముల వివాదం.. 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమస్యలు.. సంయుక్త సర్వేతోనైనా రైతులకు విముక్తి దక్కేనా?



భూమి రైతుకు జీవనాధారం. తరతరాలుగా సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్న రైతుకు తన భూమిపై హక్కులే ప్రశ్నార్థకమైతే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుంది? రెవెన్యూ శాఖ రికార్డులు ఒకలా ఉంటే, అటవీ శాఖ రికార్డులు మరోలా ఉండటం వల్ల తెలంగాణలో వేలాది మంది రైతులు భూముల సమస్యలతో సతమతమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10.84 లక్షల ఎకరాల భూములకు సంబంధించి వివాదాలు ఉన్నట్లు గతంలో వెల్లడైన గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సుమారు 35 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ సమస్యలు ఉన్నట్లు సమాచారం. ఇంతటి భారీ సమస్యకు పరిష్కారం చూపడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

రాష్ట్రవ్యాప్తంగా భూముల పంచాయితీ!

తెలంగాణలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూముల సరిహద్దుల వివాదం కొత్తదేమీ కాదు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యలో కొన్నిచోట్ల రైతుల వద్ద పట్టా పత్రాలు, పహాణీలు ఉన్నప్పటికీ భూముల హద్దుల విషయంలో స్పష్టత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అటవీ శాఖ తమ పరిధిలోని భూములుగా పేర్కొంటుండటంతో వివాదాలు మరింత జటిలమవుతున్నాయి. గత నివేదిక ప్రకారం రాష్ట్రంలోని మొత్తం అటవీ భూమిలో గణనీయమైన విస్తీర్ణానికి సంబంధించి రికార్డుల స్పష్టత, శాఖల మధ్య సమన్వయం అవసరమని తేలింది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సంయుక్త సర్వే చేపట్టాలని నిర్ణయించడం కీలక పరిణామం.

జిల్లాల వారీగా బయటపడిన గణాంకాలు!

2025 నవంబర్‌లో ప్రచురితమైన నివేదికలో కొన్ని జిల్లాలకు సంబంధించిన వివాదాస్పద భూముల వివరాలు వెల్లడయ్యాయి. వాటిలో మహబూబాబాద్‌లో 2.89 లక్షల ఎకరాలు, కుమురం భీం ఆసిఫాబాద్‌లో 1.86 లక్షల ఎకరాలు, ఆదిలాబాద్‌లో 1.50 లక్షల ఎకరాలు, నిర్మల్‌లో 70 వేల ఎకరాలు, వికారాబాద్‌లో 42 వేల ఎకరాలు, ఖమ్మంలో 35 వేల ఎకరాలు, పాత వరంగల్ రూరల్ జిల్లాలో 26 వేల ఎకరాలు, నల్గొండలో 13 వేల ఎకరాలు వివాదంలో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఇవి గత నివేదికలో వెల్లడైన ప్రధాన జిల్లాల గణాంకాలు మాత్రమే. రాష్ట్రంలోని అన్ని జిల్లాల పూర్తి తాజా వివరాలు ఇంకా స్పష్టంగా అందుబాటులో లేవు. పేర్కొన్న జిల్లాల గణాంకాలను కలిపితే 8.11 లక్షల ఎకరాలు అవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా పేర్కొన్న 10.84 లక్షల ఎకరాలకు మిగిలిన విస్తీర్ణం ఏయే జిల్లాల్లో ఉందో ప్రభుత్వం వెల్లడించాల్సిన అవసరం ఉంది.

వికారాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి!

రాష్ట్రవ్యాప్త భూ వివాదాల్లో వికారాబాద్ జిల్లా పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. గత నివేదిక ప్రకారం జిల్లాలో సుమారు 1.08 లక్షల ఎకరాల అటవీ భూమి ఉండగా, అందులో 42 వేల ఎకరాలు వివాదంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సంఖ్య వెనుక ఎంతమంది రైతుల జీవితాలు, ఎన్ని కుటుంబాల భవిష్యత్తు ముడిపడి ఉందో అధికారికంగా తేలాల్సి ఉంది. జిల్లాలోని ఏ మండలంలో ఎంత భూమి వివాదంలో ఉంది? ఏ గ్రామాల్లో సర్వే నంబర్ల సమస్య ఉంది? ఎన్ని కుటుంబాలు ప్రభావితమయ్యాయి? అనే వివరాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, ధారూరు, పూడూరు, బషీరాబాద్ తదితర ప్రాంతాల్లో రికార్డులను సమగ్రంగా పరిశీలించాలి.

రికార్డుల గందరగోళంతో రైతులకు ఇబ్బందులు!

భూమిపై హక్కుల స్పష్టత లేకపోతే రైతు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. బ్యాంకు రుణాలు పొందడం, భూమిని బదిలీ చేయడం, ఇతర ప్రభుత్వ సేవలు పొందడం కష్టమవుతుంది. కొన్నిచోట్ల సాగు చేస్తున్న భూములపైనా వివాదాలు తలెత్తడంతో రైతుల్లో భయాందోళనలు నెలకొంటున్నాయి. పాత రికార్డులను పరిశీలించి నిజమైన భూ యజమానులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒక శాఖ నుంచి మరో శాఖకు సమస్యను బదిలీ చేస్తూ కాలయాపన చేయడం వల్ల పరిష్కారం లభించదు.

సంయుక్త సర్వేతో పరిష్కారం సాధ్యమేనా?

రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం సంయుక్త సర్వే చేపట్టాలని నిర్ణయించింది. నవంబర్ 2న సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల హద్దులను గుర్తించాలని, పాత రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను పరిశీలించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో సంయుక్త కమిటీలు ఏర్పాటు చేసి స్థానికంగా పరిష్కరించగల సమస్యలను అక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. విధానపరమైన నిర్ణయాలు అవసరమైన అంశాలను ప్రభుత్వానికి పంపాలని స్పష్టం చేశారు.

అటవీ భూముల రక్షణ.. రైతుల హక్కుల భరోసా!

భూముల వివాదాల పరిష్కారంలో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అటవీ భూములను కాపాడటం ఎంత అవసరమో, చట్టబద్ధమైన హక్కులు కలిగిన రైతులకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యం. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు, సంప్రదాయ అటవీ నివాసుల హక్కులను గౌరవించాలి. నిజమైన అటవీ భూములను పరిరక్షిస్తూనే, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిదిద్దాలి. రైతుల వద్ద ఉన్న పాత పట్టాలు, పహాణీలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలి. ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రభుత్వానికి సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు!

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివాదాస్పద భూముల పూర్తి జాబితా ఎప్పుడు విడుదల చేస్తారు? వికారాబాద్‌లోని 42 వేల ఎకరాలకు సంబంధించి మండలాల వారీ, గ్రామాల వారీ వివరాలు ఎప్పుడు ప్రకటిస్తారు? సంయుక్త సర్వే ఎప్పటిలోగా పూర్తవుతుంది? నిజమైన రైతులకు భూ హక్కుల భరోసా ఎలా కల్పిస్తారు? అధికారుల తప్పిదాల వల్ల వివాదాల్లో చిక్కుకున్న భూములకు పరిష్కారం చూపే బాధ్యత ఎవరిది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి.

భూమికి హద్దులు.. రైతుకు హక్కులు!

భూముల వివాదాలు పరిష్కరించడం అంటే కేవలం రికార్డుల్లో మార్పులు చేయడం కాదు. తరతరాలుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలకు భరోసా కల్పించడం. రాష్ట్రవ్యాప్తంగా 10.84 లక్షల ఎకరాల సమస్యకు పరిష్కారం చూపడం ప్రభుత్వానికి పెద్ద పరీక్ష. అందులో వికారాబాద్ జిల్లాలోని 42 వేల ఎకరాల వివాదాన్ని పరిష్కరించడం జిల్లా యంత్రాంగానికి కీలక బాధ్యత. ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి, ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన వివరాలను స్పష్టంగా ప్రకటించాలి. రైతులకు తమ వాదనలు వినిపించే అవకాశం కల్పించాలి. పరిష్కారానికి కాలపరిమితి విధించాలి. భూమి కోసం రైతు అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి. రికార్డుల్లో స్పష్టత రావాలి.. హక్కులకు భద్రత కలగాలి.. అటవీ సంపదకు రక్షణ ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాల్లో పారదర్శకత కనిపించాలి. పది లక్షల ఎకరాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపినప్పుడే రైతులకు నిజమైన న్యాయం జరిగినట్లు. అదే భూ వివాద రహిత తెలంగాణకు పునాది కావాలి!



ఏం రవీందర్
7901503777

జాతీయం-అంతర్జాతీయం



హైజాకర్ల నుండి మత్స్య నౌకను రక్షించిన భారత నేవీ

న్యూఢిల్లీ :
సోమాలియా ఈశాన్య తీరంలో సాయుధ సముద్రపు దొంగలు హైజాక్ చేసిన మత్స్య నౌక 'అజిని'ని భారత నేవీ విజయవంతంగా రక్షించింది. 48 గంటలకు పైగా సాగిన ఆపరేషన్‌లో నౌకలోని 20 మంది సిబ్బందిని సురక్షితంగా విడిపించింది. గత నెల ప్రారంభంలో సాయుధ సముద్రపు దొంగలు ఈ మత్స్య నౌకను హైజాక్ చేసినట్లు భారత నౌకాదళం తెలిపింది. ఈ ప్రాంతంలో ప్రయాణించే వాణిజ్య నౌకలపై మరిన్ని దాడులు చేసేందుకు దీనిని 'మదర్‌షిప్'గా ఉపయోగించుకోవాలని భావించారని, ఇది సముద్ర భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని హెచ్చరించింది. వివరాల ప్రకారం.. హైజాక్‌కు గురైన నౌకను గుర్తించి, దాని కదలికలను పర్యవేక్షించేందుకు సముద్ర నిఘా విమానం సహకారంతో యుద్ధనౌకను రంగంలోకి దింపింది. నిరంతర నిఘా అనంతరం నౌకను అదుపులోకి తీసుకునేందుకు, దొంగలు తప్పించుకోకుండా నిరోధించేందుకు పకడ్బందీ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. ఆపరేషన్‌లో భాగంగా భారత వైమానిక దళానికి చెందిన సీ17 విమానం నుండి మెరైన్ కమాండోలను నౌకపైకి దించారు. కమాండోలు వేగంగా వ్యూహాత్మక చర్యలు చేపట్టి నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సముద్రపు దొంగల ముప్పును తొలగించి, నౌకలోని 20 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించారు.

వాంగ్‌చుక్ పాఠశాలకు లడఖ్ యంత్రాంగం నోటీసులు

లెహ్ :
పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పాఠశాలకు లడఖ్ యంత్రాంగం ఆదేశించింది. వాంగ్‌చుక్ స్థాపించిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అల్టర్నేటివ్ (హెచ్ఐఏఎల్) కు చెందిన డెసర్ట్ పాఠశాలలో హైకోర్టు తుది తీర్పు వెలువడే వరకు కార్యకలాపాలను నిలిపివేయాలని ఆదేశించింది. లెహ్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఆదివారం నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నోటీసును హెచ్ఐఏఎల్ సహ వ్యవస్థాపకురాలు, సిఇఒ, వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె. ఆంగ్మోకు ఈ నోటీసులు పంపారు. లేహ్‌లోని డెసర్ట్ ఫ్లవర్ స్కూల్‌లో, సంబంధిత అధికారుల నుండి అవసరమైన సమ్మతి, అనుమతులు లేదా ఆమోదాలు పొందకుండానే



తరగతులు, ఇతర కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని యాజమాన్యానికి సమాచారం అందినట్లు నోటీసు పేర్కొంది.సెప్టెంబర్ 22న అంగ్మో పంపిన ఒక లేఖను కూడా ప్రస్తావించింది. పాఠశాల నిర్వహణ కమిటీలో ప్రతిపాదిత సభ్యులకు 'నిరభ్యంతర పత్రం' (ఎన్ఓసీ) జారీ చేయాలని సెప్టెంబర్ 22న అంగ్మో లేఖలో కోరినట్లు యాజమాన్యం ప్రస్తావించింది. ఈ పాఠశాల హెచ్ఐఏఎల్ వ్యవస్థలో భాగంగా నిర్వహించబడుతోంది. హెచ్ఐఏఎల్‌కు సంబంధించిన ఒక విషయం ప్రస్తుతం జమ్మూ,కాశ్మీర్ మరియు లడఖ్ హైకోర్టులో విచారణలో ఉందని యాజమాన్యం పేర్కొంది. న్యాయస్థానంలో విచారణ పెండింగ్‌లో ఉన్న దృష్ట్యా, హైకోర్టు తుది తీర్పు ఇచ్చే వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు, పాఠశాల నిర్వహణకు సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టవద్దని లేదా కార్యకలాపాలను ప్రారంభించవద్దని హెచ్ఐఏఎల్‌కు, అంగ్మోకు తహసీల్దార్ సూచించినట్లు ఆ నోటీసులో పేర్కొన్నారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుపై ప్రభావం చూపేలా ఎటువంటి చర్యలు తీసుకోకుండా, యథాతథ స్థితిని (స్టేటస్ కో) పాటించాలని హెచ్చరించింది.



బల్గేరియా అధ్యక్షులుగా యిటోవా

సోఫియా:
బల్గేరియా అధ్యక్ష ఎన్నికల్లో 62ఏళ్ల ఇలియానా యొటోవా విజయం సాధించారు. ప్రోగ్రెసివ్ బల్గేరియా పార్టీ తరపున పోటీ చేసిన ఆమెకు దాదాపు 58.2 శాతం ఓట్లు వచ్చాయి. బల్గేరియా చరిత్రలో ఎన్నికైన తొలి మహిళా దేశాధినేతగా యొటోవా రికార్డు నెలకొల్పారు. ప్రధానమంత్రి రుమెన్ రాదేవ్ కూడా ఇలియానాకు మద్దతు తెలిపారు. యొటోవాపై పోటీ చేసిన ఆండ్రే గ్యూరోవ్‌కు 39.6శాతం ఓట్లు వచ్చాయని ఆదేశ మీడియా నివేదించింది. అయితే, ఉక్రెయిన్ యుద్ధం ఈ ఎన్నికల్లో కీలకాంశంగా మారింది. ఇలియానా రష్యాతో చర్చల జరిపి శాంతియుత పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రచారం చేశారు. అంతేకాకుండా ఉద్రిక్తతలు తగ్గించేందుకు పాశ్చాత్య దేశాలతో మరింత సన్నిహిత సంబంధాలు నెలకొల్పుతామని ఆమె పేర్కొన్నారు. బల్గేరియా నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై డ్రోన్ దాడులు పేరిగాయి. ఈ ఆందోళనల నేపథ్యంలో యూరప్‌తో బల్గేరియా సంబంధాలను కొనసాగిస్తూనే, రష్యాతో మెరుగైన సంబంధాలకు మద్దతు ఇచ్చే రాదేవ్ విధానాన్ని ఇలియానా కొనసాగిస్తారని పరిశీలకులు భావిస్తున్నారు.

హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రణాళికను పరిశీలిస్తున్నాం : ఇరాన్



టెహ్రాన్ :
అమెరికా తమ షరతులను అంగీకరిస్తే, హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి రెండు రోజుల ప్రణాళికను పరిశీలిస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ సోమవారం తెలిపారు. ఇరాన్ షరతులను అమెరికా అంగీకరించడంపైనే ఈ ప్రణాళిక " ఆధారపడి" ఉందని, ఆ తర్వాతే తదుపరి దశల గురించి చర్చించగలమని అన్నారు. ఇరాన్ షరతులను అంగీకరిస్తే, హార్మూజ్ జలసంధి వద్ద భద్రతను పునరుద్ధరించడం, త్వరలోనే చర్చలను తిరిగి ప్రారంభించడం సాధ్యమవుతుందని తాము భావిస్తున్నామని బఖాయీ స్థానిక మీడియాకు వెల్లడించారు. మధ్యవర్తుల ద్వారా అమెరికాతో సందేశాల మార్పిడి కొనసాగుతోందని ఇరానియన్ అధికారి ఒకరు పేర్కొన్నారు.
హార్మూజ్ జలసంధి మీదుగా రవాణా కోసం ఇరాన్, ఒమన్ మధ్య అంగీకరించిన కొత్త మార్గాన్ని అమెరికా తప్పక అంగీకరించాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి పేర్కొన్నారు. ఇటీవల విధించిన ఆంక్షలను కూడా అమెరికా తొలగించి, ఆ ప్రాంతంలో మోహరించిన అమెరికా సైనిక బలగాల సంఖ్యను తగ్గించాలని ఆయన తెలిపారు.అంతర్జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. పశ్చిమాసియాలో అన్ని ప్రాంతాల్లో యుద్ధానికి ముగింపు పలకడం, విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, ఇరాన్ చమురు రంగంపై విధించిన ఆంక్షలను ఎత్తివేయడం, అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడం వంటివి

కుప్పకూలిన ప్రైవేటు జెట్ విమానం



తొమ్మిది మంది దుర్మరణం
ఫ్లోరిడా :
అమెరికాలోని ఫ్లోరిడాలో లియర్‌జెట్ 60 అనే ప్రైవేటు వ్యాపార విమానం ఆదివారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. దక్షిణ ఫ్లోరిడాలోని పామ్ బీచ్ కౌంటీలో జరిగిన ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న తొమ్మిది మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. టెక్సాస్‌లోని ఆస్టిన్ నుంచి బహమాస్‌కు వెళుతుండగా ఫ్లోరిడాలోని గ్రీన్‌ఏకర్స్ ప్రాంతంలో ఉన్న నివాస సముదాయం సమీపంలో జనసమ్మర్దంగా ఉండే రోడ్డు పైకి విమానం నిలువుగా దూసుకొచ్చి పడిపోయింది. భూమిని ఢకొ్నే వెంటనే విమానంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి పేలిపోయింది. విమానం కూలిపోవడానికి కొన్ని నిమిషాల ముందు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో పైలట్ మాట్లాడారు. విమానంపై మంచు పేరుకుపోతోందని, నిమిషానికి 20 వేల నుంచి 32 వేల అడుగుల వేగంతో కిందికి పడిపోతున్నామని ఆయన ఆందోళనతో చెప్పారు. 'మాకు సమయం అయిపోయింది' అంటూ పైలట్ చెప్పిన చివరి మాటలు రికార్డయ్యాయి. ఈ ప్రమాదం కారణంగా రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. సమీపంలోని నీటి పైప్‌లైన్లు, ఇళ్లు దెబ్బతిన్నాయి. భద్రతా కారణాల రీత్యా ఆ ప్రాంతంలోని 600 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి రెడ్‌క్రాస్ సాయంతో షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రమాదానికి వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులు కారణమా లేక సాంకేతిక లోపం ఏదైనా తలెత్తిందా అనే విషయంపై దర్యాప్తు జరుగుతోంది.

ఒమన్ తీరంలో భారత నౌక ప్రమాదం..



న్యూఢిల్లీ :
ఒమన్ తీరం సమీపంలో అనుమానాస్పద వస్తువును ఢీకొని భారతీయ నౌక ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒక నావికుడు మరణించగా, మిగిలిన 13 మంది సిబ్బందిని ఒమన్ కోస్ట్‌గార్డ్ సురక్షితంగా రక్షించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ మంగళవారం వెల్లడించారు.
వివరాల ప్రకారం.. సోమవారం 14 మంది భారతీయ నావికులతో ప్రయాణిస్తున్న భారత నౌక ఎంఎస్‌పీ అల్ జుసుఫీ, ఒమన్ తీరానికి సమీపంలో గుర్తుతెలియని వస్తువును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన గంధర్ నహీమ్ అజీజ్ అనే నావికుడు మరణించారు. మిగిలిన 13 మంది సిబ్బంది సురక్షితంగా బయటపడగా, వారిని ఒమన్ కోస్ట్‌గార్డ్ రక్షించింది. రక్షించబడిన 13 మంది సిబ్బందికి తక్షణ సహాయం అందించడంతోపాటు, మరణించిన నావికుడి మృతదేహాన్ని భారత్‌కు తీసుకురావడానికి కేంద్ర మంత్రిత్వ శాఖ, ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయని సోనోవాల్ తెలిపారు. మరోవైపు అక్టోబర్ 30న మార్షల్ దీవుల జెండాతో ప్రయాణిస్తున్న ఎం/టి అల్ మయేదా అనే ఎల్ఎన్‌జీ నౌక పర్షియన్ గల్ఫ్‌లో క్షిపణి దాడికి గురైంది. ఈ నౌకలో ఆరుగురు భారతీయ నావికులతో సహా మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నట్లు సోనోవాల్ తెలిపారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో ప్రభావిత జలాల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతపై తాజా ఘటన మరోసారి ఆందోళనలను పెంచింది.ఇటీవల జి20 విదేశాంగ మంత్రుల సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జయశంకర్ పౌర నౌకాయానం, నావికులపై జరుగుతున్న వరుస దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ జలాల్లో నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల ప్రభావాలను గ్లోబల్ సౌత్ దేశాలు అసమానంగా భరిస్తున్నాయని పేర్కొన్నారు. పౌర నౌకాయానంపై దాడులు ఇంధనం, ఆహారం, ఎరువుల సరఫరా, ధరలకు ముప్పుగా పరిణమిస్తున్నాయని జయశంకర్ హెచ్చరించారు.

ఉక్రెయిన్‌లో మానవతా సహాయ కేంద్రంపై రష్యా వైమానిక దాడి..
24 మంది మృతి, 20 మంది గల్లంతు

రష్యాఉక్రెయిన్ మధ్య పరస్పర దాడులు తీవ్రరూపం దాలుస్తున్నాయి. సోమవారం దక్షిణ ఉక్రెయిన్‌లోని ఓ సహాయ శిబిరంపై పుతిన్ సేనలు వైమానిక దాడులు చేశాయి. ఈ ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 20 మంది ఆచూకీ గల్లంతయ్యింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికి తీయడానికి సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. కొమిషువాఖా నివాస ప్రాంతంలోని ఓ పాఠశాలను తాత్కాలిక సహాయక కేంద్రం గా వినియోగిస్తున్నామని అధికారులు వెల్లడించారు. సోమవారం ఆ పాఠశాల భవనం సహా దాని సమీపంలోని మరో సహాయక కేంద్రంపైనా దాడులు జరిగినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. సామాన్య ప్రజలు ఆశ్రయం పొందుతున్న భవనాలపై కూడా రష్యా భీకర దాడులకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించాలని గానీ, యుద్ధాలను ముగించాలని గానీ ఆ దేశం కోరుకోవట్లేదనడానికి ఇది మరో నిదర్శనమన్నారు.
దద్దరిల్లిన ఖేష్మ దీపం.. ఇరాన్‌పై అమెరికా రహస్య దాడులు..!
ఓవైపు తాము అమెరికాతో శాంతి చర్చలు జరపడానికి నిరంతరం కృషి చేస్తుంటే.. రష్యా మాత్రం తమ ప్రజల ప్రాణాలు తీస్తోందని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొమిషువాఖా ప్రాంతంలోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ రష్యా దాడులకు పాల్పడిందని ఆరోపించారు. ఖార్కివ్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన దాడుల్లో శీతలీకరణ కేంద్రాలు, గ్రీన్‌హౌస్‌లు, నివాస భవనాలు దెబ్బతినగా.. 12 మంది తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు.



ఒడెసాలో డ్రోన్లు విరుచుకుపడడంతో గిడ్డంగులు, పలు నివాస భవనాలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.
డ్రోన్లతో సహాయక చర్యలకు ఆటంకం..
రష్యా దాడుల వల్ల కూలిపోయిన భవనాల శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక బృందాలు కృషి చేస్తున్నాయి. అదే సమయంలో రష్యా పలుమార్లు డ్రోన్‌లను ప్రయోగించడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం వాటిల్లినట్లు ఉక్రెయిన్ సైనిక అధికారులు వెల్లడించారు.

ప్రశ్నించేందుకు భయపడితే నియంతృత్వమే

జస్టిస్ ఉజ్వల్ భుయాన్
షిల్లాంగ్:
ప్రశ్నించడానికి భయపడే సమాజం నిరంకుశత్వానికి సులభంగా లొంగిపోతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ హెచ్చరించారు. సంప్రదాయాన్ని పరిశీలనకు అతీతంగా చూసే సమాజం అన్యాయమైన ఆచారాలను సంస్కరించడంలో విఫలమయ్యే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. మేఘాలయలోని యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 12వ స్నాతకోత్సవంలో శనివారం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
శాస్త్రీయ దృక్పథమే చట్టబద్ధ పాలనకు పునాది
శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్) చట్టబద్ధ పాలనకు పునాది వేస్తుందని జస్టిస్ భుయాన్ అభిప్రాయపడ్డారు. ''అజ్ఞానం, భయం, పరిశీలించని నమ్మకాలపైనే ఏకపక్ష అధికారం మనుగడ సాగిస్తుంది. రుజువు లేకుండా వాదనలను అంగీకరించే సమాజం మూఢనమ్మకాలకు, తప్పుడు సమాచారానికి బలవుతుంది. ప్రశ్నలకు భయపడే సమాజం నిరంకుశత్వానికి లోనవుతుంది. సంప్రదాయాన్ని పరిశీలనకు అతీతంగా భావించే సమాజం అన్యాయమైన పద్ధతులను సరిదిద్దుకోలేకపోవచ్చు'' అని ఆయన పేర్కొన్నారు. సమాచార ప్రసారం, దానిపై ప్రజా తర్కంతో జరిగే పరిశీలన కలిసి, ప్రజాస్వామ్య సమాజం న్యాయంతో ప్రతిధ్వనించే ప్రక్రియలో



భాగమవుతాయని ఆయన వివరించారు.''అజ్ఞానం, భయం, పరిశీలించని నమ్మకాలపైనే ఏకపక్ష అధికారం మనుగడ సాగిస్తుంది. రుజువు లేకుండా వాదనలను అంగీకరించే సమాజం మూఢనమ్మకాలకు, తప్పుడు సమాచారానికి బలవుతుంది. ప్రశ్నలకు భయపడే సమాజం నిరంకుశత్వానికి లోనవుతుంది. సంప్రదాయాన్ని పరిశీలనకు అతీతంగా భావించే సమాజం అన్యాయమైన పద్ధతులను సరిదిద్దుకోలేకపోవచ్చు'' అని ఆయన పేర్కొన్నారు.
ప్రజా తర్కాన్ని (పబ్లిక్ రీజనింగ్) ఆరోగ్యకరమైన భాగస్వామ్య ప్రజాస్వామ్యానికి ''అసలైన సారాంశం''గా ఆయన అభివర్ణించారు. నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త అమర్త్యసేన్ 2009లో రాసిన 'ది ఐడియా ఆఫ్ జస్టిస్' పుస్తకాన్ని ప్రస్తావిస్తూ, అందులో సంస్థాగత ప్రజాస్వామ్యానికి, కార్యాచరణాత్మక ప్రజాస్వామ్యానికి మధ్య ఉన్న తేడాను సేన్ వివరించారని, ప్రజా తర్కానికి ఆ గ్రంథంలో ప్రత్యేక వివరణ ఉందని గుర్తుచేశారు. అలాగే, విద్యాసంస్థల్లో వైవిధ్యం గురించి మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం అనేది తమ చుట్టూ ఉన్న భిన్నత్వాన్ని కనుగొనే ప్రదేశమని ఆయన అన్నారు. ''వారు వేర్వేరు భాషలు మాట్లాడతారు, వేర్వేరు మతాలకు చెందినవారు, వేర్వేరు ప్రాంతాలు, జాతి నేపథ్యాల నుంచి వచ్చిన వారు. వారి పెంపకం, ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానాలు, సాంస్కృతిక గుర్తింపులు మీకంటే భిన్నంగా ఉండవచ్చు. ఈ వైవిధ్యం ముందు మనల్ని మనం 'అన్‌లెర్న్' చేసుకోవాలని, ఆ తర్వాత ఉమ్మడి విలువలను కనుగొనాలని చెబుతుంది'' అని ఆయన విద్యార్థులకు సూచించారు. భిన్నత్వంలోనే ఏకత్వం ఉందని, వైవిధ్యాన్ని కాదనుకోకుండా గౌరవించాలని స్పష్టం చేశారు.భారత రాజ్యాంగ ప్రవేశిక 'భారత ప్రజలమైన మేము' అనే మాటలతోనే మొదలవడం యాదృచ్ఛికం కాదు. రాజ్యాంగం ఒక వర్గంతోనే మాట్లాడదు. పౌరులందరినీ రాజ్యాంగ వ్యవస్థలో సమాన సభ్యులుగా సంబోధిస్తుంది. భిన్న గుర్తింపులు ఉన్నప్పటికీ రాజ్యాంగ చట్రంతో ఐక్యమైన ప్రజలందరికీ 'మనం' అనే భావన రాజ్యాంగ రూపం ఇస్తుంది. వ్యక్తిగత, సమూహ గుర్తింపులు మన ఉమ్మడి రాజ్యాంగ ఐక్యతను తగ్గించవు'' అని జస్టిస్ భూయాన్ పేర్కొన్నారు. ''మనం వారు'' అనే ద్వంద్వ భావనకు దూరంగా ఉండాలని, తమకు భిన్నమైన అభిప్రాయాలను గౌరవించిన తర్వాతే సొంత అభిప్రాయం ఏర్పరచుకోవాలని ఆయన సూచించారు. ''ఈ ఉమ్మడి వేదికలో నేర్చుకోవడం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదు. భిన్నాభిప్రాయం ఉన్నప్పటికీ ఒకరి దృక్కోణాన్ని మరొకరు గౌరవించి, అర్థం చేసుకున్నప్పుడే అసలైన అభ్యాసం జరుగుతుంది. పోటీ వాదనలు, సామాజిక సంఘర్షణల వల్ల మనం సులభంగా 'విభజన' అనే ఉచ్చులో పడతాం. ఇష్టంగానో, అయిష్టంగానో 'మనం వారు' అనే తప్పుడు కథనంలోకి లాగబడతాం'' అని ఆయన అన్నారు. సమాజాన్ని మరింత న్యాయబద్ధంగా, మానవీయంగా మార్చాలంటే ఈ విధ్వంసకర విభజన నుంచి బయటపడి ఏకత్వ భావనను స్వీకరించడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

గ్రిడ్ విధానంలో రహదారుల నిర్మాణం

ఇ-3 ఎలివేటెడ్ కారిడార్ కోసం భూసార పరీక్షలు
అమరావతి :
రాజధాని అమరావతి పరిధిలో సెక్రటేరియట్ టవర్లతోపాటు రోడ్లనూ గ్రిడ్ పద్ధతిలో నిర్మిస్తున్నారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ కన్సార్టియం ఇచ్చిన మాస్టర్ ప్లాను ప్రకారం ప్రతి వెయ్యి ఎకరాలకూ ఒక గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రాజధానిలో తూర్పు నుండి పడమరకు ఈ (ఈస్ట్) సిరీస్‌తో కూడిన రోడ్లు, ఉత్తరం నుండి దక్షిణం వరకూ ఎన్ (నార్త్) సిరీస్‌తో కూడిన 34 రోడ్లను నిర్మిస్తున్నారు. సుమారు 1,500 కిలోమీటర్లకు పైబడిన ఈ రోడ్లలో మేజర్ ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్, ఆర్టీరియల్, కలెక్టర్ రోడ్లను నిర్మిస్తున్నారు. ప్రధాన రోడ్లకు సంబంధించి ప్రస్తుతం 313 కిలోమీటర్ల దూరంతో కూడిన 41 రోడ్ల పనులు జరుగుతున్నాయి. వీటిల్లో ఇప్పటికీ ఈ3 రోడ్డు నిర్మించారు. దీనిలో రెండోదశ పూర్తయింది. మూడోదశ నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం భూసార పరీక్షల దశలో ఉంది. మాస్టర్ ప్లాను ప్రకారం నిర్మిస్తున్న రోడ్లలో గ్రిడ్‌ను ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఒక్క గ్రిడ్‌లో అంటే తూర్పు, ఉత్తరం వెళ్లే రెండు రోడ్ల మధ్యలో మొత్తం వెయ్యి ఎకరాలు (ఒక గ్రిడ్) ఉండేలా ప్లాను రూపొందించారు. నగరంలో ఎక్కడి నుంచైనా 5 నిమిషాలలో అత్యవసర సేవలు, 10 నిమిషాలలో పార్కులు, రిక్రియేషన్ కేంద్రాలు, 15 నిమిషాలలో పనిచేసే కార్యాలయాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని మాస్టర్ ప్లానులో పేర్కొన్నారు. ప్రస్తుతం సీడ్ యాక్సెస్ రోడ్డుకు



మణిపాల్ ఆస్పత్రి వరకూ నిర్మించాల్సిన ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లకు సంబంధించిన భూసార పరీక్షలు జరుగుతున్నాయి. వాటి నివేదిక వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎడిసిఎల్) అధికారులు తెలిపారు.గవర్నమెంటు కాంప్లెక్స్ పనులు పూర్తయ్యేలోపే రోడ్ల నిర్మాణ పనులూ పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని, దాని కనుగుణంగా పనులు చేపడుతున్నామని వివరించారు.ఇటీవల గ్రామాలను ప్రధాన రహదారులకు కలుపుతూ ఏర్పాటు చేయాల్సిన రోడ్లకు సంబంధించి నోటిఫికేషన్ కూడా ఇచ్చామని, కొత్త రోడ్ల నిర్మాణం వల్ల గ్రామాలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. రోడ్లతోపాటు తక్షణ అవసరమైనచోట ట్రైనేజీ, నీటి సరఫరా, భూగర్భ యుటిలిటీ నెట్‌వర్క్, వీధి దీపాలు వంటివాటికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎడిసిఎల్ అధికారులు వివరించారు. రోడ్లన్నీ ఆరు వరుసల్లో నిర్మిస్తున్నారు. ప్రతి రోడ్డుకు సైక్లింగ్, వాకింగ్ ట్రాక్స్, అవెన్యూ ప్లాంటేషన్, తాగునీటి సరఫరా వ్యవస్థ, సీవరేజ్ నెట్‌వర్క్, యూటిలిటీ డక్ట్స్ (విద్యుత్, ఇంటర్నెట్ కేబుల్స్ భూగర్భంలో ఉండేలా), రీయూజ్ వాటర్ లైన్లు, స్ట్రీట్ ఫర్నీచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ1 రోడ్డును కర కట్ట రోడ్డుగా మార్చారు. ఈ3 రోడ్డును సీడ్ యాక్సెస్ రోడ్డుగా పరిగణిస్తున్నారు. మేజర్ ఆర్టీరియల్ రోడ్లుగా ఈ5, 13, ఎన్6, 13 మేజర్ ఆర్టీరియల్ రోడ్లుగా నిర్మిస్తున్నారు.

నేపాల్‌లో ఘోర ప్రమాదం .. భారతీయుడు మృతి

ఖాట్మాండు :
నేపాల్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ల్యాండ్ అవుతుండగా రెండు హెలికాప్టర్లు ఢీకొన్నాయి. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8.11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఒక భారతీయుడు మరణించినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల ప్రకారం.. సోలుఖుంబు జిల్లాలో ఫిష్‌టెయిల్ ఎయిర్, ఎయిర్ డైనస్టీకి చెందిన రెండు హెలికాప్టర్లు ల్యాండ్ అవుతుండగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక భారతీయుడు మృతి చెందగా, భారత సంతతికి చెందిన మరో వ్యక్తి గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. అతనిని ఖాట్మాండులోని ఆస్పత్రికి తరలించినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. ఈ ఘటనలో ఫిష్‌టెయిల్ ఎయిర్ పైలెట్ రవీంద్ర ప్రసాద్, డైనస్టీ ఎయిర్ పైలెట్ ప్రజ్వల్ కేసీ పైలెట్లు కూడా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ రెండు హెలికాప్టర్లలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను సేకరిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. మస్యలు.. సంయుక్త సర్వేతోనైనా రైతులకు విముక్తి దక్కేనా?

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు



అభివృద్ధి ప్రాజెక్టుల డీపీఆర్‌లపై కేంద్రంతో సమీక్ష

న్యూఢిల్లీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ, నవంబర్ 03 (వుదయం జిల్లా ప్రతినిధి) :

వరంగల్ నగరంలో 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద చేపట్టనున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల సమగ్ర నివేదికల (డీపీఆర్‌లు)పై కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MoHUA) అధికారులతో జిల్లా యంత్రాంగం మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించింది. న్యూఢిల్లీ నుంచి MoHUA జాయింట్ సెక్రెటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న ఇతర అధికారులతో కలిసి హనుమకొండ కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ నగరంలో చేపట్టబోయే కీలక అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్‌లను కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర అధికారులకు స్పష్టంగా వివరించారు:వరదల నివారణ ప్రాజెక్ట్: భవిష్యత్తులో నగరంలో వరద ముప్పును తగ్గించేందుకు శాశ్వత పరిష్కారంగా 'స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు' ఎంతో అవసరమని, ఇందుకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌కు వెంటనే ఆమోదం తెలపాలని కేంద్ర అధికారులను కలెక్టర్ కోరారు. ఖిలా వరంగల్‌లో మోటు అభివృద్ధి, వరంగల్ బస్ స్టేషన్ ఆధునీకరణ, హనుమకొండ చౌరస్తా జంక్షన్ డెవలప్‌మెంట్, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టుల నివేదికలను సమర్పించినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా యంత్రాంగం సమర్పించిన డీపీఆర్‌లు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పట్ల కేంద్ర జాయింట్ సెక్రెటరీ ఇషా కలియా పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించాలి

తాగునీరు, విద్యుత్ వృథాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశం

జనగామ, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి) :

రాబోయే వేసవిలో ఎల్‌నినో ప్రభావం కారణంగా తలెత్తే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రజలకు తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు, ఎంపీడీవోలతో వేసవి సన్నద్ధతపై ఆయన



సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రత్యేక డ్రైవ్ (నవంబర్ 15 డిసెంబర్ 31)

తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాల పనితీరును పూర్తిస్థాయిలో తనిఖీ చేసేందుకు మండల స్థాయి బృందాలతో ఈ నెల 15వ తేదీ నుండి వచ్చే నెల 31వ తేదీ వరకు గ్రామీణ ఆవాసాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. చేతిపంపులు, మోటార్లు, పైప్‌లైన్ల లీకేజీలు, బోర్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి, క్లోరినేషన్ పూర్తి చేయాలి. అవసరమైన చోట వినియోగించేందుకు నీటి ట్యాంకర్లను సిద్ధంగా ఉంచుకోవాలి.

సమన్వయం, పర్యవేక్షణతో

రిజర్వాయర్లలో నీటి నిల్వలు, విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి. తాగునీటి సమస్యలున్న ఆవాసాలను ముందే గుర్తించి, ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి.

నూతన బోర్లపై నిషేధం,

కొత్త బోర్ల తవ్వకాలకు అనుమతులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈవో బలరామ రావు, మిషన్ భగీరథ ఈఈలు శ్రీకాంత్, సూర్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ రెడ్డి, డీపీఓ వెంకట్ రెడ్డి, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం ధరల పట్టికలు తప్పనిసరిగా ప్రదర్శించాలి

జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్

జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 03 (వుదయం జిల్లా ప్రతినిధి):

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని బియ్యం వ్యాపారులు, కిరాణా దుకాణాల యజమానులు తమ దుకాణాల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా బియ్యం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీలోని పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో బియ్యం వ్యాపారులు, కిరాణా అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలని స్పష్టం చేశారు. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేసినా, ధరల పట్టికలు ప్రదర్శించకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బీపీటీ / కేఎన్ఎం రకం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా కిలో రూ.74, హెచ్ఎంటీ / జేఎస్ఆర్ కిలో రూ.79,ఇలా ప్రతి దుకాణంలోనూ పై ధరల వివరాలతో కూడిన పట్టికలను వెంటనే ఏర్పాటు చేయాలని, నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత ధరలకే వినియోగదారులకు అందించాలని వ్యాపారులకు సూచించారు.వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యాపారులందరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం రాములు, తూనికలు కొలతల అధికారి శ్రీలత, మార్కెటింగ్ అధికారి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, పౌర సరఫరాల శాఖ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు, రైస్ ట్రేడర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యం, విద్యకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట...



రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పాంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి లో నిర్మాణంలో వున్న 100 పడకల ఆసుపత్రి పనులను తనిఖీ చేసిన మంత్రి

ఖమ్మం వుదయం రూరల్

కుసుమంచి, నవంబర్ 3సంక్షేమ కార్యక్రమాలతో పాటు వైద్య, విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం గంగబండ తాండా వద్ద రూ. 45.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటో బ్లాక్ స్లాబ్ సెంట్రింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు జరుపుతున్నట్లు, రెండో బ్లాక్ స్లాబ్ వేసినట్లు అధికారులు తెలిపారు. రెండో బ్లాక్ కాలం కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు మంత్రికి వివరించారు. నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాళ్ల పిల్లలకు కూడా ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు, పేద వాడికి రోగమొస్తే నయం చేసుకునే ఆర్థిక స్థోమత లేని పరిస్థితుల్లో రోడ్డున పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ప్రతిచోటా 100 పడకల ఆసుపత్రులతో పాటు మౌళిక వసతులను ఏర్పాటు చేస్తూ, ఆసుపత్రుల రిక్రూట్‌మెంట్ బట్టి డాక్టర్లను కూడా కేటాయిస్తున్నామని తెలిపారు.

గతంలో పేదవాడికి జబ్బు చేస్తే "అయ్యో.. ఇంత పెద్ద జబ్బు చేసింది, వైద్యం చేయించుకోవడానికి నా దగ్గర డబ్బు ఏముంది, నాకు చావే గతి" అనే రోజులు ఉండేవని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి పూర్తి భద్రత, భరోసా కల్పిస్తున్నామని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం తీసుకునే వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ధనికులకు ఏ రకమైన వసతులు అందుబాటులో ఉన్నాయో, అదే విధంగా పేదవాళ్లకు కూడా వైద్య, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో సైతం వైద్య రంగానికి కావలసిన పూర్తి మౌళిక వసతులను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

మంత్రి పర్యటన సందర్భంగా డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వైద్య శాఖ ఈఈ టీ. ఉమామహేశ్వర రావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారూ

వుదయం కథనంతో కదలిక!

కార్యాలయ వ్యవహారంపై ఆరా!



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం, కార్యాలయ నిర్వహణ తీరుపై వుదయం తెలుగు దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు తెలియజేస్తూ వివరణాత్మక నివేదిక అందించాలని కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్ అప్పారావును ఆదేశించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సేవలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం జరగాల్సి ఉండగా, కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంపై వచ్చిన కథనం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ స్పందించి సంబంధిత అధికారిని వివరణ కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న వివిధవిధానాలు, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయంపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు నివేదిక అందిన అనంతరం ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రిజిస్ట్రేషన్ సేవలు పారదర్శకంగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామప్ప విశిష్టతను ప్రపంచానికి చాటాలి: అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు



పాలంపేటలో 'వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్–2026' ముగింపు వేడుకలు

ములుగు, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి) :

చారిత్రక కట్టడాల పరిరక్షణపై అవగాహన కల్పించడంలోనూ, మన వారసత్వ సంపద విశిష్టతను ప్రపంచానికి చాటడంలోనూ వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం. సంపత్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేటలోని ప్రపంచ ప్రసిద్ధ రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన "వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్-2026" ముగింపు సమారోహానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... చరిత్ర, పురావస్తు సంరక్షణపై ఆసక్తితో శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లను అభినందించారు. రామప్ప దేవాలయ విశిష్టతను, కాకతీయుల శిల్పకళా వైభవాన్ని మరింత మందికి తెలియజేయాలని, వారసత్వ పరిరక్షణలో యువత చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మ నాయక్ మాట్లాడుతూ... ఇలాంటి శిక్షణ శిబిరాలు యువతకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచడమే కాకుండా కెరీర్‌పరంగా ఎంతో ఉపయోగపడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, శ్రీధర్ రావు, ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, స్థానిక సర్పంచ్ చల్లగొండ రాజు, పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు, పోలీసులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భువనగిరి, వలిగొండ బస్టాండ్‌ల అభివృద్ధి, అదనపు బస్సుల ఏర్పాటు చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వినతి

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి .

ఈ రోజు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారిని భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు మర్యాదపూర్వకంగా కలిసి భువనగిరి, వలిగొండ బస్టాండ్‌లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





మురసు తుఫాన్ ఎఫెక్ట్..

సూర్యాపేట జిల్లాకు భారీ వర్ష సూచన ప్రజలు

అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, నవంబర్ 03: వుదయం ప్రతినిధి

మురసు తుఫాన్ ప్రభావంతో రాబోయే కొన్ని గంటల్లో సూర్యాపేట జిల్లాకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైందని తెలిపారు.

ముఖ్యంగా కోదాడ, హుజూర్ నగర్ డివిజన్ల లో భారీ వర్షాలు, 5060 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

జిల్లాలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 1077, 181 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, డీపీవో యాదగిరి, డీఎస్పో మోహనబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

నీటి పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

ఎల్ నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

చండూరు, నవంబర్ 3 (వుదయం):

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులకు కారణమవుతున్న 'ఎల్ నినో' ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటి పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కమిషనర్ ఎల్. మల్లేశం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో మంగళవారం ఉదయం 11:00 గంటలకు ఎల్ నినో ప్రభావాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చూడాలన్నారు. భవనాల పైకప్పులపై వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను నిర్మించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అవసరం లేని సమయాల్లో ఇంట్లో లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు ఆపివేసి విద్యుత్‌ను ఆదా చేయాలని కోరారు. నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవడమే భవిష్యత్ సంక్షోభాలకు పరిష్కారమని స్పష్టం చేశారు.

అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ.. ఎల్ నినో అంటే ఏమిటి, దానివల్ల వాతావరణంలో సంభవించే మార్పులు, వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి అంశాలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు. తాగునీటిని వాహనాలు కడగడానికి, ఇంటి ముందు ఆవరణ శుభ్రం చేయడానికి వృథా చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇంటి నల్లాలు, పైప్‌లైన్ల వద్ద లీకేజీలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలన్నారు.వినియోగించిన నీటిని మొక్కల పెంపకానికి మళ్లించాలని సూచించారు. "నీటిని ఆదా చేద్దాం - భవిష్యత్తును కాపాడుదాం" అనే నినాదంతో పట్టణ ప్రజలంతా నీటి పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.



ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, వార్డు ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సన్నూర్ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కలెక్టర్ సత్య శారద.

వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 3.

రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు.మంగళవారం వారు ఆలయాన్ని సందర్శించగా, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సునీత, జడ్పీ సీఈఓ వసంత, డీఆర్డీఓ నాగపద్మజ, ఆర్డీఓ సుమ, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ఆలయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులారా.. ఓటరు నమోదుకు ఇదే చివరి అవకాశం!

మునగాల, నవంబర్ 3 (వుదయం):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మునగాల తహశీల్దార్ సరిత సూచించారు. మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటివరకు మొత్తం 1,926 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు ఈ నెల 6వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యం కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సరిత విజ్ఞప్తి చేశారు.

అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొర్రూరు నవంబర్ 3 (వుదయం ప్రతినిధి):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియకు ఈ నెల 6వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన పట్టభద్రులందరూ సకాలంలో తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పిలుపునిచ్చారు.

మంగళవారం తొర్రూరు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సందర్శించి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు.ఓటరు నమోదు గడువు నవంబర్ 6వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో సమయం చాలా తక్కువగా ఉందని, ప్రజాప్రతినిధులు, పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్,ఎన్ఎస్ యుఐ నాయకులు ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి,అవసరమైన సహకారం అందించాలని సూచించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్, నాయకులు జాటోత్ రవి నాయక్, మహబూబ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,చెవిటి సధాకర్, మేకల కుమార్,జక్కుల రామ్ రెడ్డి, గుండాల నరసయ్య, ఎనగందుల శ్రీనివాస్,రాజేష్ యాదవ్, మిత్తింటి హరీష్, గంధం సతీష్, అశోక్ రెడ్డి, కిరణ్, చిదురాల రవి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

విద్య కు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి - కలెక్టర్

పెద్దపల్లి, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, విద్యాశాఖ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



జిల్లాలో విద్య కు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించిన బిల్లుల విడుదలతో పాటు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (TGEWIDC) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో విద్యకు సంబంధించి చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ పనులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో చేపట్టిన స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేసి, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులతో పాటు విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమీక్షలో TGEWIDC డిప్యూటీ ఈఈ రామకృష్ణ,టెక్నికల్‌అధికారులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికో ఇంకుడు గుంత ప్రతి పొలానికీ కుంట

కరీంనగర్ నవంబర్ 03 (వుదయం ప్రతినిధి):

జలసిరి తో ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలి: కలెక్టర్



ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలానికీ పంటకుంట తప్పడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలని అధికారులను ఆదేశించారు.కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లిలో వీబీ జీ రాంజీ కార్యక్రమం ద్వారా నిర్మించిన కమ్యూనిటీ వ్యవసాయ ఇంకుడు గుంతను, నాగుల మల్యాల గ్రామంలో రైతు ఎర్ర లత పొలం వద్ద నిర్మించిన పంట కుంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదల, నీటి సంరక్షణ ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద గుంతల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు.వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచడం ద్వారా భవిష్యత్తులో నీటి కరువు రాకుండా చూడవచ్చని అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇంద్ల వద్ద ఇంకుడు గుంతలు, పంట పొలాల వద్ద పంట కుంటలు, ప్రభుత్వ భూముల్లో కమ్యూనిటీ వ్యవసాయ ఇంకుడు గుంతల నిర్మాణం శరవేగంగా సాగుతోందని తెలిపారు. వీబీ జీ రాంజీ కార్యక్రమం ద్వారా ఈ పనులు చేపడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. జలసిరి ద్వారా నీటి వనరులు పెంపొందించేందుకు, రైతులకు మరింత మేలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఎల్ నినో నేపథ్యంలో జలసిరి కార్యక్రమం ద్వారా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జి పనులను చేపట్టామని, వీటిని నిర్మించుకునేందుకు రైతులు,ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని సూచించారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమం పై గ్రామస్తులకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో నిర్మించే కమ్యూనిటీ ఇంకుడు గుంతల్లో చేపల పెంపకాన్ని కూడా ప్రోత్సహిస్తామని తెలిపారు. పక్కాభవనాలకు భూ కేటాయింపులు పూర్తి చేయాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి భూ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అన్నారు. అదేవిధంగా ఎలగందల్ మోడల్ స్కూల్, కేజీవీబీల్లో శానిటేషన్ మెరుగు పరచాలని అన్నారు. విద్యార్థుల కోసం కావలసిన అవసరాలు, సౌకర్యాలు, అవసరమైన మరమ్మతులకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఎం ఏ ఓ సంతోష్, మండల ప్రత్యేక అధికారి రణధీర్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ స్వాతి, ఇంజనీర్ స్పందన, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎంఏవో ఆనందం, ప్రిన్సిపాల్ లు రమాదేవి, కే శ్రీనివాస్, సర్పంచులు శ్రీనివాస్, అంజయ్య, చంద్రకళ, నిమ్మల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం జిల్లాకు గర్వకారణం: కలెక్టర్



కామారెడ్డి, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి):

గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు, ఏక్తా దివస్ పరేడ్‌లో కామారెడ్డి జిల్లా నుంచి వెళ్లిన 19 మంది సభ్యుల బృందం పాల్గొని తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను బృంద సభ్యులు కలిసి, తమకు ఈ అరుదైన అవకాశం కల్పించినందుకు జిల్లా యంత్రాంగానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జాతీయ ఐక్యత, దేశభక్తి, సమైక్యతా భావాలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాల్లో జిల్లా నుంచి ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, రైతులు పాల్గొనడం అభినందనీయమని తెలిపారు.గుజరాత్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి, అందులో భాగస్వాములు కావడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యంపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం లభించిందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషి, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బృంద సభ్యులకు సూచించారు.జిల్లా నుంచి మొత్తం 19 మంది సభ్యులతో కూడిన బృందం గుజరాత్ పర్యటనకు వెళ్లిందని, ఈ బృందానికి నోడల్ అధికారిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కృష్ణగౌడ్ వ్యవహరించారని తెలిపారు. ఈసందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ, గుజరాత్ లో ఏక్తా దివస్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించడం, అందులో పాల్గొనే అవకాశం లభించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా పోలీసు అధికారి రాజేష్ చంద్ర, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యంత్రాంగం అందించిన ప్రోత్సాహం, సహకారం మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎస్. సంతోష్, ఏక నితిన్ గౌడ్, రోహిత్, ప్రభాస్, సాధన, రజిత, బి. సూరజ్, లక్ష్మి ,దీప, రాధ, సుబ్బారావు, నరేందర్, లింగారెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి: కలెక్టర్

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 3 నవంబర్ 2026



ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ముధోల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవంతిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దాని స్థానంలో నూతన అదనపు తరగతుల నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. వారి స్నేహితులెవరైనా బడికి రానట్లయితే, వారిని కూడా తీసుకొని రావాలన్నారు. వారితో లెక్కలు సులభంగా అర్థమయ్యేలా మెలకువలను నేర్పి, కొన్ని లెక్కలు చేయించారు. ఇంగ్లీష్ పదాలను వ్యతిరేక క్రమంలో చదివివించారు. విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ మెచ్చుకున్నారు. పలువురు విద్యార్థులకు పెన్నులను బహుమతులుగా ఇచ్చారు. వారిని అభినందించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రతిభపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా విద్యశాఖాధికారి భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపిడివో లవకుమార్, డిఎల్పిఓ లక్ష్మణ్, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జూదం (పేకాట) నిర్మూలనకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు

కామారెడ్డి, నవంబర్ 3 (వుదయం ప్రతినిధి):

24/7 జూద నిర్వాహకులపై పోలీసుల నిఘా.. జూదం నిర్వహించే స్థావరాలపై ఆకస్మిక దాడులు

జూదానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు.. కుటుంబాలను రోడ్డున పడేయొద్దు

జూదం జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనం.. యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దు: జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



జిల్లాలో జూదం, పేకాట కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టే లక్ష్యంతో జిల్లా ఎస్పీ నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ జిల్లావ్యాప్తంగా జూదం నిర్వహించే ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేస్తాయి. ముందస్తు సమాచారాన్ని సేకరిస్తూ ఎక్కడైనా జూదం, పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతాలకు చేరుకొని ఆకస్మిక దాడులు నిర్వహిస్తాయి. జూదం నిర్వాహకులు, పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, కష్టపడకుండా తక్కువ సమయంలో అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో జూదం (పేకాట)కు అలవాటుపడుతున్న కొందరు తమ జీవితాలను, కుటుంబాల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని తెలిపారు. జూదంలో గెలిచి సులభంగా డబ్బు సంపాదించవచ్చనే భ్రమతో కష్టపడి సంపాదించిన సొమ్మును కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఈ వ్యసనం కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జూదం సంపాదనకు మార్గం కాదని, జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనమని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.ముఖ్యంగా యువత క్షణికమైన ఆశలకు, అత్యాశకు లోనై జూదానికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. జూదం(పేకాట) కేసుల్లో పట్టుబడి కేసులు నమోదైతే అవి పోలీసు రికార్డుల్లో నమోదవుతాయని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు జరిగే పోలీసు వెరిఫికేషన్‌లో గత కేసుల వివరాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడవచ్చని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో చట్టప్రకారం వేలిముద్రలు సేకరించి పోలీసు రికార్డుల్లో భద్రపరిచే అవకాశం ఉంటుందని తెలిపారు. క్షణిక ఆనందం కోసం భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని యువతకు సూచించారు.జిల్లాలో ఎక్కడైనా జూదం, పేకాట ఆడుతున్నా లేదా నిర్వహిస్తున్నా ఉపేక్షించేది లేదని, అటువంటి కార్యకలాపాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జూదం(పేకాట) నిర్వహిస్తున్నట్లు గుర్తించినా లేదా సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 86133 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. జూదం, పేకాట నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములై పోలీసులకు సహకరించాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కుటుంబాలకు, సమాజానికి మంచి భవిష్యత్తును అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జూదానికి దూరంగా ఉండండి.. కుటుంబాలను కాపాడుకోండి.. యువత బంగారు భవిష్యత్తును పదిలంగా ఉంచుకోండి.

విద్యార్థులతో కలిసి భోజనం.. విద్యా ప్రమాణాలపై ఆరా

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 3 :

గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో కలెక్టర్ రాజర్షి షా ఆకస్మిక తనిఖీ



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలతో పాటు విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతలోనూ రాజీ పడొద్దని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార నాణ్యత, మెనూ అమలుపై ఆరా తీశారు. పాఠశాలలో తరగతి గదులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో పరిశుభ్రత, పోషక విలువలు తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం వంటశాల, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. తోటలో పండించిన కూరగాయలను భోజనంలో వినియోగించడం అభినందనీయమన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు, ప్రాజెక్టులను తిలకించి అభినందించారు. నూతనంగా ఏర్పాటు చేసిన యోగా, మ్యూజిక్ గదులను ప్రారంభించారు.జిల్లాస్థాయి పీఎం శ్రీ పాఠశాలల మాక్ పార్లమెంట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన గుడిహత్నూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తహసీల్దార్ కవితారెడ్డి, ఏపీఎం సుజాత, సర్పంచ్ ఆడే శీల, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

పాపన్‌పేట్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్



ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపన్‌పేట్ గ్రామంలో ఎస్ఐ కె. రమేష్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అక్రమంగా తయారు చేస్తున్న గుడుంబాపై పోలీసులు దాడులు నిర్వహించి సుమారు 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు మరియు 100 లీటర్ల బెల్లం పానకంను (బెల్లం మిశ్రమం) ధ్వంసం చేశారు.అలాగే గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహించి 20 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకూడదని, ఓటిపి బ్యాంకు వివరాలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు.అదేవిధంగా మోటార్ వెహికల్ చట్టం నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.గ్రామ ప్రజలు పోలీసులకు సహకరిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కె. రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో వేగం పెంచాలి.. భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 03 (వుదయం ప్రతినిధి) :

-- అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు



జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, భూ భారతి కింద వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల రీసర్వే పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు.జిల్లాలోని 13 మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల సరిహద్దుల సర్వేను సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ తదితర శాఖలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించి ఎలాంటి తప్పులకు తావులేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు.రీసర్వే జరుగుతున్న గ్రామాలను సంబంధిత జిల్లా అధికారులు, డీఐలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన చోట పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. భూ రికార్డుల సేకరణ, నమోదు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. భూ భారతి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్‌బాబు, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్లు, డీఐలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు: జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని దహేగాం మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలను అదే రోజు పరిష్కరించడం జరుగుతుంది అని తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు సమర్పించాలని, అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో సమాచారంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు ప్రజాసేతు యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని, యాప్ లో ఇంటి వద్ద నుండి క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి వ్యయ ప్రయాసలకు గురి కావద్దని తెలిపారు. మంగళవారం రోజు అర్ధరాత్రి అయిన సబ్ కలెక్టర్, తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కారం చేసిన తర్వాతనే వెళతారని తెలిపారు. సమస్యల పరిష్కారం పై రైతులకు వివరించాలని, నిరాశ పట్టా పరిష్కారం కొరకు స్లాట్ బుక్ చేసుకుంటే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ప్రజాసేవ యాప్ లో క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన పెద్దల బాణక్క తన భూ సమస్య పరిష్కారానికి మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకొని కలెక్టర్ వెంటనే 1 వేయి 500 రూపాయలు మహిళా రైతుకు అందజేయడంతో సదరు మహిళ రైతు ధన్యవాదాలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మునవర్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే నియంతృత్వ పాలన నశించాలి - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

పెద్దపల్లి, (గోదావరిఖని) నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)



రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ స్థానిక ఎమ్మెల్యే నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామగుండం ప్రాంతంలో చేపట్టిన అపూర్వ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచిన 'అభివృద్ధి ఫైలాన్'ను మున్సిపల్ అధికారులు దొంగచాటుగా తొలగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రామగుండంలో ఐటీ పార్క్, మౌలిక వసతులు, తాగునీటి పథకాలు సహా కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల జ్ఞాపకార్థం గోదావరిఖని గాంధీనగర్‌లో ఈ పైలాన్‌ను నిర్మించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు ఈఅక్రమ కూల్చివేతకు పాల్పడ్డారు. "మున్సిపల్‌అధికారులతీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా విధులు నిర్వహించాల్సిన అధికారులు, మున్సిపల్ కమిషనర్ కాంగ్రెస్ఎ మ్మెల్యేకు తొత్తులుగా వ్యవహరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు."ఎమ్మెల్యే ఏదిచెబితే అది చేయడమే అధికారుల పనా?" అని నిలదీశారు. రామగుండంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలాంటి అక్రమాలు కొత్తేమీ కాదని, గత కొన్నినెలలుగా చివరకు దేవాలయాలను వదలకుండా కూల్చివేస్తున్నారన్నారు.

మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్.
మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (GGH) ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలోని పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, కిచెన్‌ను తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు.అనంతరం చిన్నపిల్లల ఎన్ఐసీయూ (Child NICU) కేంద్రాన్ని సందర్శించి, నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, చికిత్సా సదుపాయాలను పరిశీలించారు.

ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని కూడా సందర్శించి, దివ్యాంగులకు చేపడుతున్న వైద్య పరీక్షలు, అంగవైకల్య నిర్ధారణ ప్రక్రియ, శిబిరంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అర్హులైన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు నాణ్యమైన ఆహారంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీరా తదితరులు ఉన్నారు

భూ వివాదాలకు తెరదించేందుకే రీ సర్వే..
తప్పులకు తావిస్తే సహించేది లేదు!

- హద్దుల నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి.. సాగునీటి ఆశలు వదులుకోవాల్సిందే!
- ఆరుతడి పంటల వైపు రైతుల అడుగులు.. ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మానవపాడు: అక్టోబర్ 03 (వుదయం కరస్పాండెంట్)
భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు, పక్షపాతానికి తావులేకుండా పారదర్శకంగా సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. రైతుల మధ్య భూ తగాదాలకు ఆస్కారం లేకుండా క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలన్నారు.

మంగళవారం మానవపాడు మండలం జల్లాపురం గ్రామ శివారులో కొనసాగుతున్న రీ సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, ఒక రైతు పొలాన్ని కొలిచే సమయంలో పక్క పొలాల రైతుల సమక్షంలోనే హద్దులను నిర్ధారించాలని సూచించారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకొని నిష్పక్షపాతంగా కొలతలు చేపట్టాలని, భవిష్యత్తులో మళ్లీ వివాదాలు తలెత్తకుండా రికార్డులను పకడ్బందీగా రూపొందించాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియపై రైతులకు ఎలాంటి



సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించు కోవాలని సూచించారు. గ్రామ సర్పంచులు కూడా సర్వేకు సహకరించాలని, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
సాగునీటి భరోసా లేదు.. ఆరుతడి పంటలే మేలు!
ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రబీ సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు పరిమితంగా ఉన్నాయని, వచ్చే వర్షాకాలం వరకు తాగునీటి అవసరాలకే వాటిని వినియోగించాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటల సాగుకు సాగునీరు విడుదల చేసే అవకాశం లేదని స్పష్టం చేశారు. . తుంగభద్ర జలాలపై ఆధారపడితే కష్టాలే! అనంతరం సమీపంలోని ఆర్డీఎస్ కాలువను కలెక్టర్ పరిశీలించారు. కాలువలో నీటి నిల్వలు అత్యల్పంగా ఉన్నాయని గుర్తించారు. తుంగభద్ర జలాలపై ఆశలు పెట్టుకొని పంటలు సాగు చేస్తే చివరికి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి లభ్యతపై స్పష్టత లేకుండా సాగుకు దిగితే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని, రైతులు ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ఒక్కో పంచాయతీకి రూ.కోటి పనులకు అవకాశం వ్యవసాయ పనులు లేని సమయంలో రైతు కూలీలు ఉపాధి కోల్పోయామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక్కో గ్రామపంచాయతీలో సుమారు రూ.కోటి విలువైన పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని వెల్లడించారు. విబిజి రామ్‌జీ పథకంలోని జలసిరి కార్యక్రమం ద్వారా పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఇతర జల సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
కాలువల వెంట పెరిగిన ముళ్లపొదలను తొలగించడం, డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానళ్లలో పూడికతీత పనులను ఉపాధి హామీ కింద చేపట్టాలని సూచించారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధితోపాటు కూలీలకు ఉపాధి కల్పించవచ్చన్నారు. పాడి పరిశ్రమతో అదనపు ఆదాయం వ్యవసాయంపై మాత్రమే ఆధారపడకుండా పాడి పరిశ్రమ వంటి అనుబంధ రంగాలపై కూడా రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పశుపోషణను ఆదాయ వనరుగా మలుచుకుంటే కుటుంబాలకు అదనపు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు అందుబాటులో లేని సమయంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని రైతు కూలీలకు సూచించారు.
ఈ పర్యటనలో సర్పంచ్ నందిని, సర్వే ఏడీ నూకరాజు, తహసీల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, డిప్యూటీ తహసీల్దార్ రాములు, ఆర్ఐ గురురాజు, సర్వేయర్ ఇలాయత్ తదితరులు పాల్గొన్నారు



రెవెన్యూ నిర్లక్ష్యంపై కఠిన చర్యలు

- వెల్దుర్తి తహసీల్దార్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం
- భూ రీ-సర్వేలో రైతుల సమక్షం తప్పనిసరి

మెదక్, నవంబర్ 04 (వుదయం ప్రతినిధి):
రెవెన్యూ సేవల్లో అలసత్వాన్ని సహించేది లేదని, భూ సమస్యలను గడువులోగా పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. భూభారతి రీసర్వేలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో భూధార్, రీసర్వే, ధాన్యం కొనుగోళ్లు, ట్రిపుల్ ఆర్, ప్రజావాణి ఫిర్యాదులు, భూ సేకరణపై సమీక్ష నిర్వహించారు.
రైతుల సమక్షంలో భూ సర్వే
రీసర్వేకు ముందు రైతులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలోనే భూ సరిహద్దులు గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే లక్ష్యాలు, విధానంపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సర్వే బృందాల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు.
వెల్దుర్తి తహసీల్దార్‌పై చర్యలు
క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్దుర్తి తహసీల్దార్‌కు సర్వే నిర్వహణపై అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నగేష్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లపై సస్పెన్షన్ సహా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
ప్రతి భూమికి భూధార్ నంబర్
ప్రతి భూభాగానికి 12 అంకెల భూధార్ నంబర్ కేటాయింపును వేగవంతం చేయాలని సూచించారు.
రీసర్వే ఆధారంగా భూధార్‌ను ల్యాండ్ బేస్డ్ మ్యాప్‌తో అనుసంధానం చేస్తే భూ హక్కులు, సరిహద్దులపై స్పష్టత ఏర్పడి అక్రమాలు, ఫోర్జరీలు తగ్గుతాయని తెలిపారు.

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



నారాయణపేట టౌన్ నవంబర్ 3 (వుదయం ప్రతినిధి)
ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. నారాయణపేట మండల పరిధిలోని అప్పక్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ఆయా గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలను సందర్శించి వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా అప్పక్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సాగు చేసిన వరి, టమాట, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంటలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయిన పరిస్థితిని రైతు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా వరి పంటకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడంతో పంటను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. .అనంతరం చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో మరో ఇద్దరు రైతులు సాగు చేసిన వరి పంటలను కూడా కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు లేకపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. గత సంవత్సరం ఇదే సమయంలో వర్షపాతం ఎలా ఉందని, అప్పట్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని, ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే దిగుబడులు, పెట్టుబడులు, ఆదాయంలో ఎంత తేడా వచ్చిందని రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.
రైతులు కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి వినియోగం అవసరమయ్యే సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని తెలిపారు.
రైతులకు అండగా ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి....
వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో పంటల పరిస్థితి, నీటి వనరుల లభ్యత, సాగు విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలిస్తూ రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు నీటి పొదుపు పద్ధతులపై సూచనలు చేయాలని పేర్కొన్నారు.రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని, ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి నష్టాలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో రైతులకు సరైన సమయంలో వ్యవసాయ సలహాలు అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఏఈ వోలు పాల్గొన్నారు.



రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వ్యవసాయ అధికారి

(సంగారెడ్డి జిల్లా ప్రతినిధి) వుదయం :
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మండల వ్యవసాయ అధికారి రమేష్‌రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

లంచం తీసుకుంటున్న సమయంలో పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు దాడి చేసి అధికారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది.

అయితే సదరు అధికారి ఏ పని నిమిత్తం లంచం డిమాండ్ చేశారు? లంచం వ్యవహారంలో ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే వివరాలు ఏసీబీ విచారణలో వెల్లడికావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాలను ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

అర్హులైన రైతులకు బ్యాంకులు
పూర్తి సహకారం అందించాలి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్, నవంబర్ 03 (వుదయం బ్యూరో) :
నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్యక్షతన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (Special DCC) సమావేశం నిర్వహించారు.జిల్లాలో 13 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో, కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఉపశమనం, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, నూతన పంట రుణాల మంజూరు తదితర అంశాలపై అదనపు కలెక్టర్లు బి. చేన్నయ్య, దేవ సహాయంతో కలిసి బ్యాంక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కరువు పరిస్థితుల నేపథ్యంలో పంట నష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.మండలాల వారీగా కరువు గుర్తింపు :జిల్లాలో ఉర్కొండ,



వెల్దండ, వంగూర్, చారగొండ, అమ్రాబాద్, పదర, బల్మూర్, లింగాల, పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల్లో తీవ్ర కరువుగా గుర్తించి, అర్హులైన రైతుల వ్యవసాయ రుణాలకు 12 నెలల మారటోరియం కల్పించి, తిరిగి చెల్లింపు వ్యవధిని గరిష్టంగా 60 నెలల వరకు పొడిగించాలని సూచించారు.
రూ.1,778 కోట్ల రుణాలు : జిల్లా వ్యాప్తంగా 65,893 మంది రైతులు రూ.1,125.10 కోట్ల పంట రుణాలు, 27,297 మంది రైతులు రూ.653.41 కోట్ల వ్యవసాయ కాలపరిమితి రుణాలు పొందినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం రూ.1,778.51 కోట్ల రుణాలకు సంబంధించి అర్హులైన రైతులందరికీ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు.
రుణ పునర్వ్యవస్థీకరణతో పాటు తదుపరి పంటల సాగు కోసం కొత్త పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని, రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, బలవంతపు వసూళ్లు చేయరాదని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులతో సమన్వయంతో గ్రామాలు, మండలాల వారీగా అర్హులైన రైతులను గుర్తించాలని, రైతు వేదికలు, గ్రామసభల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, ఆర్బీఐ ఏజీఎం ప్రదీప్ చంద్ర, నాబార్డ్ డీడీఎం చందు, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత రావు, వివిధ బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పూర్తి కాగానే రైతులకు వివరాలు వెల్లడించాలి

- అనుమానాలు ఉంటే రీ-సర్వే చేసి నివృత్తి చేయాలి
- వీరాపూర్ గ్రామంలో 'భూ భారతి' సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట, నవంబర్ 3 (వుదయం బ్యూరో)
భూ భారతి రీ సర్వేలో భాగంగా భూముల సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా వివరాలను తెలియజేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సర్వేపై రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే మరొకసారి సర్వే నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామంలో సాగుతున్న 'భూ భారతి రీ సర్వే' ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం భూ



యజమానుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేందుకే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.
చిన్న గ్రామాలతో శ్రీకారం – తొలిదశలో వీరాపూర్:
భూ సమస్యలు తక్కువగా ఉన్న చిన్న గ్రామాలను మొదట ఎంచుకోవడం వల్ల సర్వే ప్రక్రియ సులువవుతుందని, అందుకే 557 ఎకరాల విస్తీర్ణం కలిగిన వీరాపూర్ గ్రామాన్ని ఎంపిక చేశామని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు మరియు ఖాళీ బాటలను సర్వే చేస్తారని.. ఆ తర్వాతే పట్టా భూముల సర్వే చేపడతారని తెలిపారు. పట్టా భూముల సర్వే చేపట్టడానికి రెండు రోజుల ముందే ఆయా రైతులకు సమాచారం అందించాలని సర్వే అధికారులను ఆదేశించారు.
రోజుకు 35 నుండి 40 ఎకరాల సర్వే:
క్షేత్రస్థాయిలో లైసెన్స్ సర్వేయర్, జీపీఓ, రెవెన్యూ అధికారులు బృందంగా ఏర్పడి రోజుకు 35 నుండి 40 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేస్తారని కలెక్టర్ వెల్లడించారు. ఒకే భూ యజమానికి ఒకే ప్రాంతంలో వేర్వేరు సర్వే నంబర్లలో భూమి ఉన్నట్లయితే, నూతన భూ భారతి చట్టం ప్రకారం ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు.
రైతులు, భూ యజమానులు అధికారులు చేపడుతున్న ఈ రీసర్వేకు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ప్రజలు క్రొత్తగా భూమిని కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్లు జరపాలని సూచించారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో బెజ్జంకి తహసిల్దార్ శ్రీకాంత్, మండల సర్వే అధికారులు, గ్రామ సర్పంచ్, వీరాపూర్ గ్రామ రైతులు మరియు భూ యజమానులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత రైతులకు వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ
అర్హులైన రైతులను గుర్తించి బ్యాంకులు పూర్తి సహకారం అందించాలి: జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

వనపర్తి నవంబర్ 3 (వుదయం ప్రతినిధి) :
రాష్ట్ర ప్రభుత్వం జి. ఒ నెంబర్ 03, అక్టోబర్ 24, 2026 ప్రకారం వనపర్తి జిల్లాలో ఎల్ నీనో ప్రభావం వల్ల 11మండలాలను కరువు పీడిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో కరువు ప్రభావిత రైతులను ఆదుకోడానికి మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరెట్ కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంకర్ల ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు.
జిల్లాలోని (6) మండలాలు అమరచింత, పాన్గల్, కొత్తకోట, ఆత్మకూర్, వీపనగండ్ల, ఏదుల మండలాలను తీవ్రమైన కరువు మండలాలు గాను, (5) మండలాలు పెద్దమందడి, ఘనపూర్ గోపాల్పేట వనపర్తి పెబ్బేర్ మండలాలను మోస్తారు కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో, కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించడం, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, నూతన పంట రుణాల మంజూరు తదితర అంశాలపై బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరువు పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గి, సాగునీటి కొరతతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హులైన రైతులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI), రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (SLBC) మార్గదర్శకాల ప్రకారం రుణ



పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు.
జిల్లావ్యాప్తంగా అన్ని బ్యాంకు శాఖల పరిధిలో మొత్తం 44816 మంది రైతులు రూ. 635.45 కోట్ల విలువైన పంట రుణాలు పొందగా, మరో 24902 మంది రైతులు రూ. 862.15 కోట్ల విలువైన వ్యవసాయ కాలపరిమితి రుణాలు (Agri Term Loans) పొంది ఉన్నారని, వీరందరికీ నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన రైతులను, రుణ ఖాతాలను గ్రామాలు, మండలాల వారీగా గుర్తించాలని, రైతు వేదికలు, గ్రామసభలు, ఆర్థిక అక్షరాస్యత శిబిరాల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో బ్యాంకు శాఖల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించి, అమలు పురోగతిపై నివేదికలు సమర్పించాలని సూచించారు.
అర్హులైన వారందరికీ ఈ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని రైతులకు కరువు పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, నిర్దేశించిన గడువులోగా రుణ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఈ స్పెషల్ నోటిఫికేషన్ ద్వారా పొందే రుణాలు ఎట్టి పరిస్థితిలో రుణ మాఫీ జరుగదు. కాకపోతే ఒక సంవత్సరం వరకు ఋణం తిరిగి చెల్లించకుండా తర్వాత నుండి తిరిగి చెల్లించాల్సి ఉంటుందని రైతులకు ముందే అవగాహన కల్పించాలని బ్యాంకర్లను సూచించారుఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి వినోద్ కుమార్,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ కుమార్, భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఎల్ డి ఓ ప్రదీప్ చంద్ర నాయక్, నాబార్డ్ డిడిఎం మోహన్ రెడ్డి, వివిధ బ్యాంకుల జిల్లా మరియు స్థానిక శాఖల మేనేజర్లు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాండూరులో గంజాయి కలకలం.. యువతపై మత్తు నీడ!

- 25 మంది గంజాయి వినియోగదారులుగా అనుమానం.. సరఫరా మూలాలపై పోలీసుల ఆరా
- ఏ రాష్ట్రం నుంచి వస్తోంది? సరఫరా వెనుక ఎవరున్నారు?

తాండూరు అక్టోబర్ 3(వుదయం ప్రతినిధి)
తాండూరు పట్టణంలో గంజాయి వినియోగంపై పోలీసుల నిఘా పెరిగినట్లు సమాచారం. గంజాయి వినియోగిస్తున్నట్లు అనుమానిస్తు



న్న సుమారు 25 మందిని టౌన్ పోలీసులు గుర్తించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ వ్యవహారంపై పోలీసులు గోప్యంగా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.యువతకు గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది? ఏ రాష్ట్రం నుంచి పట్టణానికి చేరుతోంది? సరఫరా వెనుక ఎవరున్నారు? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.యువత భవిష్యత్తుకు మత్తు ముప్పు! గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడటం యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉంది. చదువు, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలకు దూరం చేసే వ్యసనాలకు యువత ఆకర్షితులు కావద్దని పలువురు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితుల వలయం, అలవాట్లపై అప్రమత్తంగా ఉండాలి. గంజాయి సరఫరా చేసే మూలాలను గుర్తించి అరికట్టడంతో పాటు యువతను ఈ వ్యసనం నుంచి కాపాడేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని యువతకు పిలుపునిస్తున్నారు......

ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో ఎంపిక పారదర్శకంగా జరగాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్టుకు రాత పరీక్ష.. పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
76 మంది అభ్యర్థులకు గాను 51 మంది హాజరు
గద్వాల, నవంబర్ 03వుదయం కరస్పాండెంట్
గద్వాల జిల్లాలో గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్టుకు అర్హులైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.
గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వాహకులు పరీక్ష విధానం, ప్రశ్నపత్రంలోని అంశాలు, అభ్యర్థుల హాజరు వివరాలను కలెక్టర్‌కు వివరించారు. మొత్తం 80 మార్కులకు నిర్వహిస్తున్న ఈ పరీక్షలో వ్యాసరచన, ప్రజెంటేషన్, డేటా అనాలిసిస్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఐటీ నైపుణ్యాలు తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలను పొందుపరిచినట్లు తెలిపారు. ఈ పోస్టుకు మొత్తం 76 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 51 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. అభ్యర్థుల ప్రతిభ, నైపుణ్యాలు, అర్హతలను నిష్పక్షపాతంగా అంచనా వేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యంత అర్హులైన అభ్యర్థిని ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ నుంచి తుది ఎంపిక వరకు ప్రతి దశలో పారదర్శకత పాటించాలని, ప్రతిభకు ప్రాధాన్యతనిస్తూ ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, ఈడీఎం శివ, జీహెచ్ఎం రేణుకా దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)



ములకలపల్లి మండలం కమలాపురం లోని ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటశాల నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో వారితో నేరుగా మాట్లాడిన కలెక్టర్.. భోజనం నాణ్యత, రుచి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, నిర్ణీత సమయానికి భోజనం పెడుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలో పరిశుభ్రత, భోజనం వడ్డించే విధానం, వంటకు వినియోగిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలోని నిల్వ గదిని పరిశీలించి బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేస్తున్నారా, వాటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అందిస్తున్న చిరుతిళ్ల వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ విద్యార్థులకు సమతుల్యమైన, పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించ కూడదని స్పష్టం చేశారు. వంటశాల, ఆహార పదార్థాల నిల్వ గదులను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులనే వినియోగించాలని సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వంట తయారీ నుంచి భోజనం వడ్డించే వరకు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా, ఆహార విషబాధ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆర్‌ఓ ప్లాంట్ పనితీరుపై ఆరా తీయగా, అది ప్రస్తుతం వినియోగంలో లేదని గుర్తించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్లాంట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరం శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆహారం, తాగునీరు, వసతి సౌకర్యాల విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట తహసీల్దార్ స్వాతి బిందు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలాల నీడలో చిన్నారులు!

అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ స్పందించాలి!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)







చుంచుపల్లి మండలం ధన్‌బాద్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం దయనీయ స్థితికి చేరుకుంది. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కేంద్రం ప్రస్తుతం ప్రమాదాలకు నిలయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్డు, పగుళ్లు ఏర్పడిన పైకప్పు, వర్షపు నీటితో నిండుతున్న గదులు చిన్నారుల భద్రతకు ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షం పడితే అంగన్వాడీ గదుల్లోకి నీరు చేరుతుండటంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పైకప్పు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారినప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? చిన్నారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు.

కొత్త భవనం నిర్మాణం ఎప్పటికి పూర్తయ్యేను?

అంగన్వాడీ కేంద్రానికి నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, నిర్మాణ పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎప్పుడో పూర్తిచేసి చిన్నారులకు అందించాల్సిన భవనం ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడానికి కారణాలేంటి? నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు పర్యవేక్షణ చేయడం లేదా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

కాంట్రాక్టర్ వద్ద డబ్బులు లేక పనులు నిలిచిపోయాయి: డీఈ నాగేందర్

ఈ విషయంపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ డీఈ నాగేందర్‌ను వివరణ కోరగా, కాంట్రాక్టర్ వద్ద డబ్బులు లేక నిర్మాణ పనులు పూర్తి చేయలేకపోయారని తెలిపారు. మరోచోట పనులు చేపట్టారని, అక్కడి నుంచి డబ్బులు వచ్చిన తర్వాత ఈ భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ చెప్పినట్లు వివరించారు. ఇప్పటివరకు సంబంధిత పనులకు బిల్లులు కూడా రాలేదని పేర్కొన్నారు. అయితే కాంట్రాక్టర్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు నిలిచిపోతే చిన్నారుల భద్రతకు బాధ్యత ఎవరిదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ సురక్షిత వసతి కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? ప్రమాదకర పరిస్థితుల్లో చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో ఉంచడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు.

జిల్లా అధికారులు స్పందించాలి

ధన్‌బాద్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం దుస్థితిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన రేకుల షెడ్డు స్థానంలో చిన్నారులకు సురక్షిత వసతి కల్పించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఈవీఎంల భద్రతపై కలెక్టర్ ప్రత్యేక నిఘా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)



కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ గోడౌన్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత కీలకమైనందున, నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను పక్కాగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, దృశ్యాల రికార్డింగ్ వ్యవస్థ, విద్యుత్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, భద్రతా పర్యవేక్షణ విధానాలను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి అలసత్వం వహించరాదని సూచించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరాదని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏవైనా లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దాలని సూచించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ నిర్వహణకు సంబంధించిన తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు పోలీసుల హెచ్చరిక

- అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు
- నీటి ప్రాంతాల వైపు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు..!
- ఎస్సై బండి మోహన్ బాబు

చిలుకూరు నవంబర్ 03:(ఉదయం)

మండలంలో మురసు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మోహన్ బాబు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. చెరువులు కాలువలు ఇతర నీటి ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని ముఖ్యంగా పిల్లలను ఆ ప్రాంతాల్లో ఆడుకోవడానికి అనుమతించవద్దని సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు, తెలిపడిన విద్యుత్ తీగల కు దూరంగా ఉండాలి,రోడ్లపై చెట్లు పడటం రహదారులకు అడ్డంకులు ఏర్పడటం లేదా నీటి ప్రవాహం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే 112 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. చిన్న చిన్న ఆనందాల కోసం అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు.

బడి బాటలో జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 03 (వుదయం ప్రతినిధి)




విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. మంగళవారం కొత్తగూడెం మేదరబస్తీలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు, ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానాలు, విద్యా ప్రమాణాల అమలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడంతో పాటు నిర్దేశించిన అభ్యసన లక్ష్యాలను చేరుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత పాఠశాలలో పదో తరగతి డిజిటల్ తరగతి గదిని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ బోధనా విధానాలను సమీక్షించారు. పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు పూర్తయిన పాఠ్యాంశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పాఠ్యాంశాలపై అవగాహన, చదివే సామర్థ్యం, అభ్యసన స్థాయిని స్వయంగా పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పాఠ్యాంశాలను పూర్తి చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి అన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతుల ద్వారా వారి సామర్థ్యాన్ని పెంపొందించాలని ఆదేశించారు. గత ఏడాది పదో తరగతిలో 86 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రధానోపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేలా ముందస్తు ప్రణాళికతో బోధన సాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. పాఠశాలలో మొత్తం 380 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు అధికారులు వివరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారి పాఠ్యపుస్తకాలను పరిశీలించి చదివే సామర్థ్యం, పాఠ్యాంశాలపై అవగాహన, అభ్యసన స్థాయిని పరీక్షించారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణితానికి సంబంధించిన ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఈ తనిఖీలో కలెక్టర్ వెంట తహసీల్దార్ పుల్లయ్య, ప్రధానోపాధ్యాయులు బి.వి.ఎల్. కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఏదులాపురం మునిసిపాలిటీ 14, 15, 16 వార్డులలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

ఖమ్మం వుదయం రూరల్ఏదులాపురం, నవంబర్- 3



రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి పేద ప్రజల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ఏదులాపురం మునిసిపాలిటీ 14,15,16 వార్డులు తెల్దార్ పల్లి లో రూ. 312.90 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షంలోనూ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ఈ ప్రభుత్వంపై వారికున్న ప్రేమను చాటుతున్నాయన్నారు. తెల్లవారుపల్లి లో మూడు డివిజన్ల పరిధిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల కోసం పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని తెలిపారు. గత 33 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కేవలం తెల్లవారుపల్లి ప్రాంత పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 16.86 కోట్లు వెచ్చించి శంకుస్థాపనలు, పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే, తెల్దారు పల్లి లో మొత్తం 105 ఇందిరమ్మ ఇళ్లను రూ. 5.25 కోట్లతో మంజూరు చేయడం జరిగిందని, పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం ద్వారా పేదవాడి గుమ్మానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు ఎకరానికి రూ. 12,000 రైతు భరోసా ఆర్థిక సహాయం, తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ, ఆసరా పింఛన్లు, నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల క్రింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా గడచిన 33 నెలల్లో రూ. 73 వేల కోట్లు సున్నా వడ్డీకే మహిళలకు అందించామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేస్తున్నామన్నారు.

భూముల సమగ్ర సర్వే, అర్హులైన రైతులందరికీ 'భూధార్' కార్డుల జారీ

రాష్ట్రంలో సుమారు 125 సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, ఈనాడు రాష్ట్రంలో ఉన్న ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూములున్న ఆసాములకు పూర్తి భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. తెల్దారుపల్లి లో రాబోయే కొద్ది రోజుల్లోనే గ్రామమంతా సర్వే చేయించి, అర్హులైన వారందరికీ న్యాయబద్ధమైన భూములను కేటాయించనున్నామన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో సహా, ప్రతి మనిషికి ఆధార్ ఏ విధంగా అయితే ఉంటుందో అదేవిధంగా ప్రతి భూమికి భూధార్ ను మ్యాప్‌తో సహా అందిస్తామని మంత్రి తెలిపారు. తెల్దారు పల్లి ప్రాంత ప్రజల కొరకు నాగార్జున సాగర్ కాల్వపై రూ. 5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి కూడా అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతి అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, గడిచిన ఒక నెల, నెలన్నర రోజుల్లోనే ఎదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్‌లో దాదాపు రూ. 35 నుండి 40 కోట్ల వరకు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. యంత్రాంగం తరఫున ప్రతి ఒక్క పనిని చాలా త్వరగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుల సద్భావన పర్యటన ఘనంగా నిర్వహణ

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ – విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ – మధ్యాహ్న భోజన సిబ్బందికి చీరల వితరణ – ఆంజనేయస్వామి పార్కులో సిమెంట్ బల్లల ఏర్పాటు



భద్రాచలం 03/11/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం పట్టణంలో వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుల సద్భావన పర్యటనను పురస్కరించుకొని పలు సేవా, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ముఖ్య అతిథి వాసవియన్ సౌభాగ్య సేవా సంకల్ప KCGF సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు చేతుల మీదుగా అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం వాసవి క్లబ్ భద్రాచలం అధ్యక్షులు వనామ కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి దర్శి శ్రీనివాసరావు, జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అధ్యక్షులు సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆవిష్కరించడం ఎంతో శుభసూచకమని పేర్కొన్నారు. చదువుల తల్లి సరస్వతి దేవి ఆశీస్సులు విద్యార్థులందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రతిరోజూ అమ్మవారిని ప్రార్థిస్తూ, క్రమశిక్షణతో చదువుకొని విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప ఆయుధమని, విద్య ద్వారానే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడంతో పాటు సమాజానికి, దేశానికి సేవలందించే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వాసవి క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవసరమైన జామెట్రికల్ పరికరాలు, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల ముఖాల్లో ఆనందం నింపుతూ వారికి చదువుపై మరింత ఆసక్తి కలిగించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు తమ వంతు ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి అడ్మినిస్ట్రేషన్ చింతల వినోద్ కుమార్, క్యాబినెట్ ప్రధాన కార్యదర్శి రేపాక ధనుంజయ రాజ మనోహర్, జిల్లా క్యాబినెట్ కోశాధికారి ఉదతా నగేష్ కుమార్, వాసవి క్లబ్ భద్రాచలం ప్రధాన కార్యదర్శి పెనుగొండ సంతోష్ కుమార్, కోశాధికారి నాలా సాయిచంద్, రీజియన్ చైర్‌పర్సన్ బండారు కృష్ణయ్య, జోన్ చైర్మన్ బచ్చు సాగర్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ చారుగుండ్ల రామకృష్ణ, సీనియర్ సభ్యులు వనామ రామారావు, గుడుమాసు వెంకట సత్యనారాయణ, సముద్రాల అనిల్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారం పాపయ్య, ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



పట్టభద్రులారా.. ఓటరు నమోదుకు ఇదే చివరి అవకాశం!


మునగాల, నవంబర్ 3 (వుదయం):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని మునగాల తహశీల్దార్ సరిత సూచించారు. మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటివరకు మొత్తం 1,926 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని అర్హులైన పట్టభద్రులు ఈ నెల 6వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రుల భాగస్వామ్యం కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సరిత విజ్ఞప్తి చేశారు.

టీఆర్ఎస్ (డి) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి

నియామక ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ

భద్రాచలం 03/11/26 వుదయం ప్రతినిధి:



తెలంగాణ రక్షణ సమితి (డి) పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీని విస్తరించాలనే సంకల్పంతో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ నరాల సత్యనారాయణ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ సీనియర్ రాజకీయ నాయకులు, పేదల పెన్నిధిగా గుర్తింపు పొందిన సేవాతత్పరులు, ప్రముఖ సామాజిక సేవకులు డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డిని టీఆర్ఎస్ (డి) పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా (స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్), అలాగే ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డికి రాజకీయ, సామాజిక, సేవా రంగాల్లో ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని, ప్రజలతో ఉన్న సన్నిహిత సంబంధాలను, వివిధ జిల్లాల్లో ఉన్న విస్తృత పరిచయాలను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం తనవంతు కృషి చేసిన సేవామూర్తి అని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి నల్గొండ, వరంగల్ జిల్లాల్లోనూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు విస్తృతమైన పరిచయాలు ఉన్నాయని, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యావంతులు, యువతతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా విశిష్టమైన సేవలు అందించి, అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా మెలిగిన డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పాటు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొని విశేష రాజకీయ అనుభవాన్ని సంపాదించుకున్నారని నరాల సత్యనారాయణ వివరించారు. ఆయనకు ఉన్న రాజకీయ పరిజ్ఞానం, ప్రజల సమస్యలపై అవగాహన, వివిధ సామాజిక వర్గాలతో ఉన్న అనుబంధం తెలంగాణ రక్షణ సమితి (డి) పార్టీ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ రాష్ట్రస్థాయి కార్యకలాపాలను సమన్వయం చేయడంతో పాటు జిల్లాలవారీగా పార్టీ కమిటీల నిర్మాణం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను విస్తృతంగా తీసుకెళ్లడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. అదే విధంగా ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, మహిళలు, యువత, పేదలు, బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పనలో కీలక పాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరించి, వివిధ రంగాల నిపుణులు, ప్రజా సంఘాల ప్రతినిధులతో చర్చించి రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన విధానాలను మేనిఫెస్టోలో పొందుపరిచేలా కృషి చేయాలని ఆయనకు సూచించినట్లు తెలిపారు. రాబోయే నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటుతో ఘన విజయం సాధిస్తారని నరాల సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ (డి) పార్టీ తరఫున ఆయన శాసనమండలికి ప్రాతినిధ్యం వహించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విద్యా వ్యవస్థలోని సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన అంశాలపై ఆయనకు ఉన్న అవగాహన పట్టభద్రుల తరఫున సమర్థవంతమైన గొంతుకగా నిలిచేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే టీఆర్ఎస్ (డి) పార్టీకి వివిధ ప్రజా సంఘాలు, లెక్చరర్ల సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, న్యాయవాదుల సంఘాలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశాయని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డికి అప్పగించిన ఈ రెండు కీలక బాధ్యతలు పార్టీ భవిష్యత్ కార్యాచరణలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని, ఆయన నాయకత్వంలో పార్టీ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సమితి (డి) పార్టీ రాష్ట్రవ్యాప్తంగా తన కార్యకలాపాలను విస్తరించి ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించే దిశగా ముందుకు సాగుతుందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకోవాలి




మునగాల మండల ఇన్‌చార్జి కందిబండ సత్యనారాయణ

మునగాల, నవంబర్ 3 (వుదయం):

ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటు హక్కును అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా నమోదు చేసుకొని, ఎన్నికల సమయంలో సద్వినియోగం చేసుకోవాలని మునగాల మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి, పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మునగాల మండల ఇన్‌చార్జి, సీనియర్ నాయకులు కందిబండ సత్యనారాయణ పాల్గొని పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా కందిబండ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, పట్టభద్రులు తమ హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికల సమయంలో తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. పట్టభద్రుల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ప్రదీప్, మాధవరం సర్పంచ్ ఆరె సురేందర్ రెడ్డి, కోల ఉపేందర్, యువజన నాయకులు కపర్తి మణికంఠ, షేక్ సైదా, లింగరాజు, సాయి, నాగులు బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఫిర్యాదుల కు స్పందిస్తూ వినియోగదారులకు సత్వర సేవలు

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి



సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, వినియోగదారుల ఫిర్యాదుల కు స్పందిస్తూ , సత్వర సేవలు అందిస్తున్నామని ,విద్యుత్ డి ఇ, ఎస్ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. యు ఎస్ ఎల్ సి మీటర్ డిడి కట్టుకుంటే కేబుల్, ఇతర అవసరాలకు అనుగుణమైన మొత్తం పనులు చేపడతామని సందర్భంగా వివరించారు.

మంగళవారం డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సదస్సులో ఫిర్యాదులను స్వీకరించిన, సందర్భంగా పరిష్కారం చేస్తామని హామీలు ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి విద్యుత్ ఎస్ ఈ కార్యాలయంలో వినియోగదారుల ఫోరం నాయకులు ,ఎండి హమ్మద్ హలీ మాట్లాడుతూ, నామమాత్రం గానే వినియోగదారులు హాజరు కావడం ,మొక్కుబడిగా సదస్సులు నిర్వహించడం సరి అయింది కాదని, ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ పోలిశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యుత్ అధికారులు, ఇబ్బంది నిర్లక్ష్యం కారణంగా వార్డులో సమస్యలు పరిష్కరించకుండా, కాలయాపన చేస్తున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు. ప్రజల ప్రాణహాని లేకుండా భద్రత కల్పించాలని, పహాడీ నగర్, బంజారా హిల్స్, తారక రామ నగర్ ల లో 33 కెవి విద్యుత్ లైన్ కు బదులుగా టవర్ లైన్ కు కనెక్షన్లు ఇవ్వాలని కాంగ్రెస్ సేవ దళ్ జిల్లా అధ్యక్షులు షేక్ వాజిద్ , కౌన్సిలర్ అమర్నాథ్ లు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏ డి ఈ , పి.రవీందర్, డి ఇ,టెక్నికల్, ఎస్ సుధీర్, ఏ ఈ లు,పి సాయి కృష్ణ, వెంకటేశ్వర్లు విజయలక్ష్మి , సత్యనారాయణ రెడ్డి ,హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చక్కని ఆరోగ్యం

వెన్ను నొప్పికి అసలు కారణాలు ఏమిటి..



ఉంటుంది. శరీరంలోని పొత్తికడుపు కండరాలు, వెన్ను కండరాలు, కటి ప్రాంతంలోని కండరాలు, శ్వాసకు తోడ్పడే డయాఫ్రాగమ్ వంటి కండరాల సమూహాన్ని కోర్ కండరా లు అంటారు. ఇవి వెన్నెముకకు ఆధారంగా నిలుస్తూ శరీరానికి స్థిరత్వాన్ని అందిస్తాయి. ఈ కండరాలు బలహీనంగా ఉన్నప్పుడు కూర్చున్న స్థానం నుంచి లేవడం, నేలపై ఉన్న వస్తువులను ఎత్తడం, శరీరాన్ని తిప్పడం, ఎక్కువసేపు కూర్చోవడం, నిలబడడం లేదా నడవడం వంటి సాధారణ పనులు కూడా ఇబ్బందిగా మారతాయి. ముఖ్యంగా ముందుకు వంగి వస్తువులను ఎత్తేట ప్పుడు నొప్పి పెరిగే అవకాశం ఉంటుంది. కండరాల్లో తగినంత బలం, శక్తి లేకపోతే గాయాల ప్రమాదం కూడా పెరుగుతుంది.

వెన్ననొప్పికి అసలు కారణం ఏమిటో గుర్తించడం కొన్నిసార్లు వైద్య పరీక్షలు, స్కానింగ్ చేసిన తర్వాత కూడా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఈ సమస్యకు ఒకటి కంటే ఎక్కువ కారణాలు ఉంటాయి. అయితే కోర్ కండరాలను బలోపేతం చేయడం వల్ల చాలామందిలో వెన్ననొప్పి తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతు న్నారు. దీనికోసం వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, నొప్పి తీవ్రత, కండరాల బలాన్ని పరిశీలించి తగిన వ్యాయామ ప్రణాళిక రూపొందించుకో వాలి. మాడిఫైడ్ ప్లాంక్స్, బ్రిడ్జెస్, అబ్డామినల్ బ్రేసింగ్ వంటి వ్యాయామాలు కోర్ కండరాల బలాన్ని పెంచేందుకు ఉపయోగపడతాయి. అయితే ఏ వ్యాయామం చేయాలి, ఎంత తీవ్రతతో చేయాలి అనేది వ్యక్తి పరిస్థితిని బట్టి నిర్ణయించాలి. వ్యాయామాలతోపాటు కూర్చునే, నిలబడే భంగిమను సరిచేసుకో వడం కూడా ముఖ్యం. వస్తువులను ఎత్తేటప్పుడు సరైన పద్ధతిని పాటించడం, వెన్నుపై అనవసరమైన ఒత్తిడి పడకుండా చూసుకోవడం, రోజువారీ పనుల్లో అవసరమైన మార్పులు చేసుకోవడం వల్ల నొప్పిని నియం త్రించవచ్చు. కోర్ కండరాల బలహీనత ఒక్కటే వెన్ననొప్పికి కారణం కాదని గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరిలో నొప్పికి దారితీసే అంశాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి వైద్య పరీక్షల ఆధారంగా కారణాన్ని గుర్తించి, తగిన వ్యాయామాలు, భంగిమలో మార్పులు, జాగ్రత్తలతో సమస్యను నిర్వహించుకోవడం అవ సరమని నిపుణులు సూచిస్తున్నారు.

మైక్రో వర్కవుట్లు.. ఆరోగ్యానికి ఎంతో మేలు

జీవితం చాలా బిజీగా మారిపోయింది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ.. క్షణం తీరిక లేకుండా గడిచిపోతున్నది. ఇలాంటి సమయంలో.. పార్కులు, జిమ్‌లో ఓ 60 నిమిషాలు గడపడం కూడా అసాధ్యంగా మారిపో తున్నది. ఇలాంటప్పుడు 'మైక్రో-వర్కవుట్లు' ఎంతో సహాయ పడతాయని వ్యాయామ నిపుణులు చెబుతు న్నారు. కేవలం రెండు నుంచి 10 నిమిషాలపాటు సాగే అత్యంత సమర్థమైన వ్యాయామాలను వివరిస్తున్నారు. వీటిని క్రమంతప్పకుండా చేయడం వల్ల జీవక్రియ మెరుగుపడు తుందనీ, గుండె ఆరోగ్యం బలపడుతుందనీ అంటున్నారు.



రెండు నిమిషాలు: ఇల్లు, ఆఫీస్‌లోని మెట్లు ఎక్కుతూ, దిగుతూ.. రెండు నిమిషాలపాటు నడవండి. ఓపిక ఉంటే పరిగెత్తండి.

మూడు నిమిషాలు: మోకాళ్లను పైకి ఎత్తుతూ.. 20 సెకన్ల పాటు మార్చింగ్ లేదా రన్నింగ్ చేయండి. ఆ తర్వాత 10 సెకన్లు విశ్రాంతి తీసుకోండి. ఇలా మొత్తం ఆరు రౌండ్లు చేయండి.

ఐదు నిమిషాలు: ఒక్కో నిమిషం చొప్పున జంపింగ్ జాక్స్, హై నీస్, మౌంటెయిన్ క్లయింబర్స్, స్క్వాట్స్, సైడ్ కిక్ అవుట్స్ చేయండి. రెండు నిమిషాలు: మొదటి నిమిషం ఎయిర్ స్క్వాట్స్ లేదా కుర్చీ నుంచి లేవడం, రెండో నిమిషం రివర్స్ లంగ్స్ లేదా ట్యాప్ బ్యాక్స్ చేయండి. మూడు నిమిషాలు: 45 సెకన్ల పాటు కౌంటర్ పుష్-అప్స్ చేసి, 15 సెకన్లు విశ్రాంతి తీసుకోండి. దీనిని మూడుసార్లు పునరావృతం చేయండి.

ఐదు నిమిషాలు: ఒక్కో నిమిషం చొప్పున.. స్క్వాట్స్ లేదా చైర్ స్టాండ్స్; నేలపైన, కౌంటర్‌పై లేదా గోడపై పుష్-అప్స్; రివర్స్ లంగ్స్ లేదా ట్యాప్-బ్యాక్స్; ఫోర్-ఆర్మ్ ప్లాంక్; చివరగా వాల్ సిట్ చేయండి.

రోజువారీ పనులు, అలవాట్లతో.. వ్యాయామాన్ని కలిపే యండి. కాఫీ తయారయ్యేలోపు 10 పుష్-అప్స్ చేయండి. లేదా ప్రతి జూమ్ మీటింగ్ తర్వాత ఓ మూడు నిమిషాలు మెట్లు ఎక్కి దిగండి. డెస్క్ ఉద్యోగాలు చేసేవారు.. ప్రతి గంటకూ ఒకసారి లేచి శరీరాన్ని స్ట్రెచ్ చేసుకోండి. ఇందుకోసం మీ ఫోన్‌లో అలారం సెట్ చేసుకోండి.

లేవగానే బ్రష్ చేయకుండానే నీళ్లు తాగుతున్నారా..



సాధారణంగా చాలామందికి ఉదయం లేవగానే నీళ్లు తాగడం అలవాటు. ఉదయాన్నే నీళ్లు తాగే అలవాటు మంచిది కూడా. అయితే కొంతమంది బ్రష్ చేసి నీళ్లు తాగితే.. కొంతమంది మాత్రం బ్రష్ చేయకుం డానే తాగుతారు. అయితే ఇలా బ్రష్ చేయకుండా నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నోటిని శుభ్రం చేసుకోకుండా నీళ్లు తాగితే అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. ఆ అనారోగ్య సమస్యలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. సాధారణంగా రాత్రికి పడుకుని ఉదయం లేచేసరికి నోటి నిండా బ్యాక్టీరియా ఫామ్ అవుతుంది. పళ్లపై, నాలుకపై సూక్ష్మక్రిములు పేరుకుపోతాయి. కాబట్టి లేవగానే నోరు శుభ్రం చేసుకోకుండా నీళ్లు తాగితే.. నీళ్లతో పాటు క్రిములు కూడా శరీరంలోకి ప్రవేశిస్తాయి. దీనివల్ల అనేక వ్యాధులు వస్తాయి. పళ్లు కూడా దెబ్బతింటాయి. అయితే పళ్లు తోముకుని పరగడుపున నీటిని తాగవచ్చని నిపుణులు చెబుతున్నారు. పరగడుపున ఒక గ్లాస్ లేదా రెండు గ్లాసుల నీళ్లు తాగడంవల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుందని, దానివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు. ఉదయం లేవగానే బ్రష్ చేసుకుని నీళ్లు తాగడంవల్ల శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో నీళ్లు తాగితే చర్మ సమస్యలు పోయి ఆరోగ్యంగా ఉంటుంది. చర్మానికి సహజంగానే మెరుపు వస్తుంది. గోరువెచ్చని నీళ్లు తాగితే జీర్ణాశయం కూడా శుభ్రమవుతుందని నిపుణులు అంటున్నారు.

రాత్రి ధనియాలను నానబెట్టి ఉదయాన్నే ఆ నీళ్లు తాగితే ఆరోగ్యానికి ఎంత మేలో తెలుసా..?



సంబంధిత సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తీసుకున్న ఆహారం బాగా జీర్ణమవు తుంది.

ధనియాల్లో విటమిన్ కె, విటమిన్ సి, విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యానికి ఎంతో మంచిది. ప్రతి రోజు ధనియాలు నానబెట్టిన నీటిని తీసుకుంటే జుట్టు రాలుడు సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

డయాబెటిస్ బాధితులకు కూడా ధనియాల నీరు ఎంతో ఉపయోగపడు తుంది. ముఖ్యంగా రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉండేవారు ప్రతి రోజూ ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకుంటే షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

ప్రతిరోజు ఉదయం నానబెట్టిన ధనియాల నీటిని తీసుకోవడం వల్ల రోగని రోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఫ్రీ రాడికల్స్‌కి వ్యతిరేకంగా పోరాడుతాయి. ఇమ్యూనిటీ వ్యవస్థను బలపరుస్తాయి.

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు లాంటి సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే రోజూ ధనియాల నీటిని తాగాలని నిపుణులు సూచిస్తున్నారు.

కిడ్నీ సమస్యలతో బాధపడే వారికి కూడా ధనియాల నీరు బాగా ఉపయోగపడు తుంది. ముఖ్యంగా యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ సమస్యలు ఉన్నవారు కూడా ధనియాల నీటిని రోజూ పరగడు పున తీసుకో వాలి.

పండుగ సమయంలో గుండె జబ్బుల ముప్పు ఎక్కువ..

భారత్‌లో పండుగల సమయంలో అనం దోత్సాహాలతోపాటు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపే కొన్ని అంశాలు కూడా పెరు గుతాయి. నిద్ర వేళల్లో మార్పులు, నూనె పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం, ఉప్పు, చక్కెర అధికంగా ఉండే ఆహారం తినడం, వేడుకల్లో శారీరక శ్రమ పెరగడం, భావోద్వేగ ఒత్తిడి వంటివి గుండెపై అదనపు సమయంలో భారీగా భోజనం చేసిన తర్వాత ఛాతి లేదా పొత్తికడుపు పైభాగంలో మంట, అసౌకర్యం కలిగితే చాలామంది దాన్ని గ్యాస్, ఎసిడిటీగా భావిస్తారు. సాధారణంగా భోజనం తర్వాత ఎసిడిటీ సమస్య పెరుగుతుంది. పడుకున్నప్పుడు అసౌకర్యం ఎక్కువై, యాంటాసిడ్స్ వాడితే ఉపశమనం కలుగు తుంది. కానీ గుండె సంబంధిత నొప్పి దవడ, చేయి, వీపు లేదా మెడ వరకు వ్యాపిస్తుంది. యాంటాసిడ్స్ తీసుకున్నా తగ్గకపోవడంతోపాటు వికారం, చెమటలు పంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఛాతీ లేదా పొత్తికడుపు పైభాగంలో అసౌక ర్యంతోపాటు విపరీతంగా చెమటలు పడితే వెంటనే వైద్య సహాయం పొందాలి. లక్షణాలు తగ్గుతాయేమోనని వేచి చూడకుండా గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం. పండుగల సమయంలో ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో వచ్చే మార్పులు కూడా గుండెపై ప్రభావం చూపుతాయి. ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండి రక్తపోటు పెరుగుతుంది. మద్యం సేవించడం వల్ల గుండె వేగం, రక్తపోటు పెరగడం తోపాటు కొన్ని గుండె మందుల పనితీరుపై ప్రభావం పడుతుంది. నిద్ర సరిగా లేకపోవడం వల్ల రక్తపోటు నియంత్రణ, శరీరంలోని వాపు ప్రక్రియల్లో మార్పులు వస్తాయి. వేడుకల్లో ఎక్కువ సేపు నృత్యం చేయడం, బరువులు మోయడం, నిల బడడం వంటి శారీరక శ్రమ వల్ల గుండెపై ఒక్కసా రిగా భారం పెరుగుతుంది. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలు లేదా అధిక రక్తపోటు ఉన్నవారిలో ఈ అంశాలన్నీ కలిసినప్పుడు గుండెపోటు ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అధిక రక్తపోటు, మధుమేహం లేదా గతంలో గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు పండుగల సమయంలోనూ తమ మందులను నిర్ణీత సమయా నికి తప్పనిసరిగా తీసుకోవాలి. మందుల వాడకంలో ఎలాంటి విరామం ఇవ్వకూ డదు. ఈ సమయంలో రక్తపోటును తరచూ పరీక్షించుకోవడం మంచిది. ఆహారాన్ని మితంగా తీసుకోవడం, నూనె పదార్థాలు, ఉప్పు అధికంగా ఉండే పంటకాలను తగ్గించడం, తగినంత నీరు తాగడం వంటి జాగ్రత్తలు పాటించాలి. గుండెపోటును సూచించే లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రికి వెళ్లాలి. లక్షణాలు తగ్గుతా యేమోనని ఇంట్లోనే ఉండిపోవడం లేదా ఎసిడిటీ మందులు వేసుకుని వేచి చూడడం ప్రాణాపాయానికి దారితీస్తాయి. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళంలో అడ్డంకి ఏర్పడితే, సకాలంలో చికిత్స అందించడం ద్వారా దాన్ని తొలగించి గుండె కండరాలకు జరిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందువల్ల పండుగల ఆనందంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, ప్రమాద సంకేతాలను గుర్తించి వెంటనే స్పందించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.



నెయ్యి తింటే బరువు పెరుగుతారా..

నెయ్యి (Ghee) అనేక పోషక విలువలు కలిగిన పదార్థం. కానీ నెయ్యిలో కొవ్వు ఉంటుందని, దీన్ని ఆహారంగా తీసుకోవడంవల్ల బరువు పెరుగుతారని చెబుతుంటారు. దాంతో చాలా మంది భయంతో నెయ్యి మానేస్తు న్నారు. నిజంగానే నెయ్యి తినడంవల్ల బరువు పెరుగు తారా..? అంటే కాదనే సమాధా నమే వస్తుంది. ఎందుకంటే నెయ్యితో బరువు పెరుగుతార నడం కేవలం అపోహేనని ఆరోగ్య నిపుణులు చెబుతు న్నారు. పైగా రోజూ మితంగా నెయ్యి తీసుకుంటే బరువును తగ్గించు కునే అవ కాశం ఉన్నదంటున్నారు. రోజులో 1 నుంచి 2 టీ స్పూన్లకు మించకుండా నెయ్యి తీసుకుంటే బరువు తగ్గడంతోపాటు ఇంకా అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. రోజువారీ ఆహారంలో నెయ్యిని చేర్చుకోవడం ద్వారా రోజంతా చురుకుగా, శక్తివంతంగా ఉండవచ్చు. నెయ్యి శక్తిని ఉత్పత్తి చేసే ఒక పవర్‌హౌస్ లాంటిది. అందుకే మహిళలకు గర్భధారణ సమయంలో నెయ్యి తిన్నాల్సిందిగా సూచిస్తారు. నెయ్యిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి చర్మంలోని మాయిశ్చరైజర్‌ను లాక్ చేయడం ద్వారా ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖంలో నిగారింపు, ఆరో గ్యకరమైన చర్మం పొందాలంటే ఆహారంలో నెయ్యిని కలు పుకోవాల్సిందే. శరీరంలోని హార్మోన్లను బ్యాలెన్స్ చేయడంలో నెయ్యి సహాయపడుతుంది. పీరియడ్స్ రెగ్యులర్‌గా రాక బాధపడే మహిళలు ఆహారంలో నెయ్యిని చేర్చుకోవడం ద్వారా సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. నెయ్యిలో విటమిన్ కె పుష్కలంగా ఉంటుంది. అది కాల్షియం శోషణలో సహాయపడుతుంది. తద్వారా దంత క్షయాన్ని నివారించడా నికి, అథెరోస్క్లెరోసిస్ రాకుండా ఎముకలను బలంగా ఉంచడానికి తోడ్పడుతుంది.



డిప్రెషన్‌కు అందరికీ ఒకేలాంటి చికిత్స పనిచేయదు..

దీనికి సంబంధం ఉంటుంది. ది బ్రిటిష్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీలో ప్రచురితమైన ఈ అధ్యయనంలో, తీవ్రమైన డిప్రెషన్‌ను జీవ సంబంధిత, వైద్యపరమైన, జన్యుపరమైన లక్షణాల ఆధారంగా ప్రత్యేక మైన సర్కేడియన్ రకంగా వర్గీకరించవచ్చా అనే అంశాన్ని పరిశోధిం చారు. ఆస్ట్రేలియన్ జెనెటిక్స్ ఆఫ్ డిప్రెషన్ అధ్యయనానికి చెందిన సమా చారాన్ని ఉపయోగించి, డిప్రెషన్‌తో బాధపడుతున్న 10 వేల మందికి పైగా వ్యక్తులపై వైద్యపరమైన, జన్యుపరమైన విశ్లేషణ నిర్వహించారు.



రకాలతో ఎలా భిన్నంగా ఉంటాయో తెలుసుకోవడమే అధ్యయనం లక్ష్యం. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిలో దాదాపు నాలుగో వంతు మందికి సర్కేడియన్ డిప్రెషన్ ఉన్నట్లు గుర్తించామని, వీరిలో తీవ్రమైన, పదేపదే వచ్చే లేదా దీర్ఘకాలిక డిప్రెషన్‌తో బాధపడేవారు కూడా ఉన్నారని పరిశోధకురాలు ఎమిలియానా టోనిని వెల్లడించారు. ఈ రకమైన డిప్రెషన్ ఉన్నవారిలో నిద్ర, మేల్కొనే సమయాలకు సంబంధించిన కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయి. అవి.. ఉదయం వేళల్లో విపరీతమైన అలసట, డిప్రెషన్ సమయంలో సాధారణం కంటే ఎక్కువసేపు నిద్రపోవడం, రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోయే అలవాటు, నిద్రలో మధ్య సమయం ఆలస్యంగా ఉండడం, సామాజిక జీవనశైలికి అనుగుణంగా నిద్ర సమయాలు లేకపోవడం, కాలానుగుణంగా వ్యాధి లక్షణాలు మారుతూ ఉండడం. డిప్రెషన్ అనేది అందరిలోనూ ఒకే విధంగా ఉండే వ్యాధి కాదని, దాని వివిధ రకాల లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా బాధితులకు సరైన చికిత్సను ముందుగానే అందించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

ఇతర రకాల డిప్రెషన్‌తో పోలిస్తే సర్కేడియన్ డిప్రెషన్ ఉన్నవారిలో కొన్ని ప్రత్యేక లక్షణాలు కనిపించాయి. వీరి సగటు వయసు సుమారు 18.7 సంవత్సరాలు ఉండగా, ఇతర రకాల డిప్రెషన్ ఉన్నవారిలో ఇది 23.2 సంవత్సరాలుగా నమోదైంది. ఈ రకమైన డిప్రెషన్ ఎక్కువగా మహిళల్లో కనిపించింది. మొత్తం కేసుల్లో దాదాపు 80 శాతం మంది మహిళలే ఉన్నారు. అలాగే వీరిలో వ్యాధి చిన్న వయసులోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వైద్య పరంగా కూడా ఈ రకం డిప్రెషన్ తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. బైపోలార్ వ్యాధిలో కనిపించే లక్షణాలను పోలిన హైపోమానియా లేదా మానియా లక్షణాలు, మానసిక భ్రాంతులకు సంబంధించిన అనుభవాలు, ఆత్మహత్య ఆలోచనలు, వాటి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలసట వంటి శారీరక సమస్యలతోపాటు మానసిక లక్షణాలు కూడా ఎక్కువగా కనిపిస్తాయి. సర్కేడియన్ డిప్రెషన్ ఉన్న వారిలో సాధారణంగా ఉపయోగించే కొన్ని యాంటీడిప్రెసెంట్ మందులు తక్కువ ప్రభావాన్ని చూపుతు న్నట్లు అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా సెరోటోనిన్ స్థాయిలపై పనిచేసే ఎస్ఎస్ఆర్ఐ, ఎస్ఎన్ఆర్ఐ తరహా మందులు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని బాధితులు తెలిపినట్లు పరిశోధకులు పేర్కొన్నారు.

వాల్ట్ డిస్నీలో వేల సంఖ్యలో ఉద్యోగాల కోత..?

వినోద రంగానికి చెందిన దిగ్గజ సంస్థ వాల్ట్ డిస్నీ వేల సంఖ్యలో ఉద్యోగాల కోత (Layoffs)కు సిద్ధమైంది. దాదాపు 20% వ్యయాలను తగ్గించుకొనేందుకు చర్యలు చేపట్టాలని ఇప్పటికే కీలక మేనేజర్లకు వెల్లడించింది. ఈ పొదుపులో భాగంగా ఉద్యోగులను తొలగించడంతోపాటు వ్యయాలను నియంత్రించే చర్యలు కూడా చేపట్టవచ్చని అంతర్జాతీయ మీడియా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి.

బిజినెస్

ఆదాయం కోసం 'ఇతర' మార్గాలు.. ఐటీఆర్-1 కంటే 2, 3లే ఎక్కువ!



ఉద్యోగం.. నెల జీతం.. అందులో కొంత భాగం పొదుపు. ఇదీ ఒకప్పటి సూత్రం. కానీ, పరిస్థితుల ప్రభావమో, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న ఉద్దేశమో గానీ.. భారతీయులు ఆదాయం పెంచుకునేందుకు కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. ఉద్యోగంతో పాటు ఫ్రీలాన్సింగ్, ట్రేడింగ్, వ్యాపారాల్లో పెట్టుబడుల వంటి రూపంలో అదనపు ఆదాయ మార్గాలు చూసుకుంటున్నారు. బహుళ ఆదాయ మార్గాలు కలిగిన వారి సంఖ్య ఏటికేడు పెరుగుతోందని క్లియర్ ట్యాక్స్ పోర్టల్ (ClearTax report) పేర్కొంది. 2026-27 మదింపు సంవత్సరానికి గానూ వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఐటీఆర్ ఫైలింగ్‌ల ఆధారంగా ఒక నివేదికను రూపొందించింది. అందులో కొన్ని ఆసక్తికర గణాంకాలను పొందుపరిచింది. క్లియర్ ట్యాక్స్ నివేదిక ప్రకారం.. ఐటీఆర్-1 కంటే సంక్లిష్ట ఐటీఆర్‌లు ఫైల్ చేసే వారి సంఖ్య పెరిగింది. సాధారణంగా ఉద్యోగం ద్వారా వచ్చే ఆదాయం ఉన్నవారు ఐటీఆర్-1ను ఫైల్ చేస్తుంటారు. ఇతర ఆదాయం కలిగిన వారు ఐటీఆర్-2, 3 దాఖలు చేస్తారు. ఇలా నాన్ ఐటీఆర్-1 దాఖలు చేసే వారి సంఖ్య 62 శాతంగా ఉంది. 2025-26లో 53 శాతం ఉండగా.. అంతకు ముందు సంవత్సరం ఇది 40 శాతం మాత్రమే. ఐటీఆర్-2, ఐటీఆర్-3 ఫైల్ చేసే వారి సంఖ్య రెండేళ్ల క్రితం 36.2 శాతం కాగా.. ఈ ఏడాది 57.2 శాతానికి పెరిగింది. 2026-27 మదింపు సంవత్సరంలో స్వచ్ఛందంగా ఐటీఆర్‌లు దాఖలు చేసిన 47 శాతం మంది పెట్టుబడులు, వ్యాపారం, ఫ్రీలాన్సింగ్ లేదా క్రిప్టోకరెన్సీ వంటి ఆదాయాలు ఉన్నట్లు చూపించారు. 2022-23లో ఈ సంఖ్య 9.5 శాతం మాత్రమే. జీతం కాకుండా రెండూ, అంతకంటే ఎక్కువ వేతనేతర ఆదాయాలు ఉన్న వారి సంఖ్య కూడా 3.5 శాతం నుంచి 24 శాతానికి పెరిగినట్లు క్లియర్ ట్యాక్స్ పేర్కొంది.
యువ నిపుణులు ఈక్విటీ మార్కెట్లలో పాల్గొనడం, స్వతంత్రంగా పనిచేయడం కోసం ప్రాధాన్యం ఇస్తున్నారని క్లియర్ ట్యాక్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ అర్చిత్ గుప్తా అన్నారు. కేవలం నెలవారీ జీతంపైనే ఆధారపడే ధోరణి మారిందని, సంపదను పెంచుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.

కార్బన్ రీ ఎంట్రీ.. మార్కెట్‌లోకి వచ్చేసిన కొత్త స్మార్ట్‌ఫోన్స్



దేశీయ మొబైల్ తయారీ కంపెనీ కార్బన్.. స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చింది. కార్బన్ రెబల్ సిరీస్ పేరిట రెబల్, రెబల్ ప్రో ఫోన్లను లాంచ్ చేసింది. ఆక్టాకోర్ మీడియాటెక్ ప్రాసెసర్‌తో వస్తున్నాయి. రెండేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, సెక్యూరిటీ అప్‌గ్రేడ్స్ ఇస్తామని కంపెనీ తెలిపింది. మరి ఫీచర్లు పరిశీలిస్తే...
6.75 అంగుళాల HD+ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 90Hz రిఫ్రెష్ రేట్, 650 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆక్టా కోర్ మీడియాటెక్ హీలియో G81 ప్రాసెసర్‌పై పనిచేస్తుంది. ఫోన్ వెనుక వైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా ఉంది. స్టాండర్డ్ సెన్సర్‌తో సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 7,000mAh బ్యాటరీ+ 18W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. IP64 రేటింగ్ ఉంది. యూఎస్‌బీ టైప్ సీ కేబుల్ సదుపాయం ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్‌ను 6జీబీ+128 జీబీ వేరియంట్‌లో తీసుకొచ్చారు. ప్రారంభ ధర రూ.14,999గా నిర్ణయించగా.. లాంచ్ ఆఫర్, బ్యాంక్ ఆఫర్లలో భాగంగా రూ.10,999కు కొనుగోలు చేయొచ్చు. బ్లూ, గోల్డ్, సిల్వర్ రంగుల్లో లభిస్తుంది.
₹20వేల్లోపు బడ్జెట్‌లో శాంసంగ్ కొత్త స్మార్ట్‌ఫోన్ 6.7 అంగుళాల HD+ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేట్, 720 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. IP64 రేటింగ్ ఉంది. ఆండ్రాయిడ్ 16పై పనిచేస్తాయి. ఆక్టా కోర్ మీడియాటెక్ హీలియో G81 ప్రాసెసర్ అమర్చారు. ఫోన్ వెనుక వైపు 64 ఎంపీ ప్రధాన కెమెరా, ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6,000mAh బ్యాటరీ, 20W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. మెమరీ కార్డు ద్వారా 1TB వరకు స్టోరేజ్ సదుపాయం ఉంది. ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ.14,999గా కంపెనీ నిర్ణయించగా.. లాంచ్ ఆఫర్, బ్యాంక్ ఆఫర్లతో కలుపుకొని రూ.11,499కు కొనుగోలు చేయొచ్చు. బ్లూ, చెర్రీ రెడ్, గోల్డ్, గ్రే రంగుల్లో వస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్లు నవంబర్ 4 నుంచి అమెజాన్ ద్వారా విక్రయాలకు రానున్నాయి.

రిలయన్స్ నుంచి కొత్త బిస్కెట్ వేరియంట్స్



రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (RCPL) తన బిస్కెట్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. ఇండిపెండెన్స్ బ్రాండ్ కింద 9 కొత్త బిస్కెట్ వేరియంట్లను మార్కెట్లోకి తీసుకొచ్చింది. కంపెనీకి ప్రధాన మార్కెట్‌గా ఉన్న తమిళనాడులో ఈ బిస్కెట్లను లాంచ్ చేసింది. పవర్ అప్, మిల్కీ పవర్, బటర్ బ్లిస్, మేరీ ప్రైమ్, కోకో వెనిలా & చాక్లెట్ తదితర రుచుల్లో ఈ బిస్కెట్ ప్యాక్‌లను ఆర్ఎస్‌పీఎల్ పరిచయం చేసింది. పవర్ అప్ బిస్కెట్ల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటుడు అజిత్ కుమార్‌ను ఎంపిక చేసింది. ట్రయల్ ప్యాక్‌ల ధర రూ.5, షేరింగ్ ప్యాక్ రూ.10, ఫ్యామిలీ హోమ్ ప్యాక్ రూ.40 నుంచి రూ.125 వరకు అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొంది. రిలయన్స్ రిటైల్, హోల్‌సేల్ ఛానెల్స్, ఈకామర్స్ ప్లాట్‌ఫామ్స్, ప్రాంతీయ బ్రాండ్ స్టోర్‌ల ద్వారా ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నట్లు కంపెనీ తెలిపింది.

ఎల్‌జీ నుంచి 115 అంగుళాల టీవీ ధర రూ.14.99 లక్షలు



ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా దేశీయ విపణిలోకి 115 అంగుళాల (292 సెం.మీ) క్యూఎన్ఈడీ ఈఓ ఏఐ మినీ ఎల్ఈడీ 4కే స్మార్ట్ టీవీని విడుదల చేసింది. దీని ధర రూ.14,99,990 గా పేర్కొంది. ఈ శ్రేణిలో ఇదే అతి పెద్ద టీవీ. ఆల్ఫా 8ఏఐ ప్రాసెసర్ జెన్3, 4కే చిత్ర నాణ్యత, 100% కలర్ వాల్యూమ్, వర్చువల్ 11.1.2 ఛానెల్ సరౌండ్ సౌండ్ దీని ప్రత్యేకతలు. గేమింగ్ కోసం 165 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 330 హెర్ట్జ్ మోషన్ బూస్టర్ అందించారు. వెబ్ఓఎస్ 26 ద్వారా వాయిస్ ఐడీ, గూగుల్ జెమినై, మైక్రోసాఫ్ట్ కోపైలట్ సదుపాయాలు లభిస్తాయి. సినిమాలు, క్రీడలు, గేమింగ్ అనుభవాన్ని మరింత మెరుగుపరిచేలా ఈ టీవీని రూపొందించినట్లు ఎల్‌జీ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సొల్యూషన్స్ డైరెక్టర్ బ్రియాన్ జంగ్ తెలిపారు.

లాంక్సెస్, బీపీసీఎల్ భాగస్వామ్యం



స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లాంక్సెస్, దేశంలోని ప్రముఖ సమీకృత ఇంధన కంపెనీలలో ఒకటి, మహారత్న ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), భారతదేశంలో అధునాతన పారిశ్రామిక లూబ్రికంట్ సాంకేతికతలు, స్పెషాలిటీ ఫ్లూయిడ్స్ ఉత్పత్తులు, సంబంధిత వినియోగాలలో దీర్ఘకాలిక సహకార అవకాశాలను అన్వేషించడానికి ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ అవగాహన ఒప్పందంపై లాంక్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంతకాలు చేశాయి.రెండు సంస్థల ఉన్నత నాయకత్వం హాజరైన సంతకాల కార్యక్రమం ద్వారా ఈ పక్షాలు పరస్పర సహకారాన్ని అధికారికం చేశాయి. ఈ అవగాహన ఒప్పందం భారతదేశంలోని పారిశ్రామిక రంగాలలో వినూత్న లూబ్రికెంట్ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, ఓఈఎం ఆమోదాలకు మద్దతు ఇవ్వడం, స్థానికీకరణను మెరుగుపరచడం, వినియోగదారులకు దీర్ఘకాలిక విలువను సృష్టించడం లక్ష్యంగా సాంకేతిక, వాణిజ్య అవకాశాలను మూల్యాంకనం చేయడానికి ఒక నాన్-ఎక్స్ క్లూజివ్ చట్రాన్ని ఏర్పాటు చేస్తుంది.ప్రతిపాదిత ఫ్రేమ్‌వర్క్ కింద, అధునాతన పారిశ్రామిక కందెనలు, సంకలిత సాంకేతికతలు, సంబంధిత ప్రత్యేక ఉత్పత్తుల అభివృద్ధి, మూల్యాంకనం, అర్హత మరియు వాణిజ్యీకరణలో లాంక్సెస్, బీపీసీఎల్ సహకారాన్ని అన్వేషిస్తాయి. ఆసక్తి ఉన్న రంగాలలో అధిక-పనితీరు గల బేరింగ్, సర్కులేటింగ్ ఆయిల్స్, ప్రీమియం హైడ్రాలిక్ ఫ్లూయిడ్స్, టర్బైన్ ఆయిల్స్, రిఫ్రిజిరేషన్ లూబ్రికంట్స్, తుప్పు నివారణ ఆయిల్స్, ప్రత్యేక గ్రీజులు, డేటా సెంటర్ల కోసం ఇమ్మర్షన్ కూలింగ్ ఫ్లూయిడ్స్, పర్యావరణానికి ఆమోదయోగ్యమైన లూబ్రికంట్స్, పారిశ్రామిక అడిటివ్ ప్యాకేజీలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల కోసం లూబ్రికంట్ ఉత్పత్తులు ఉన్నాయి.ఈ సహకారం లాంక్సెస్ ప్రపంచవ్యాప్త లూబ్రికెంట్ యాడిటివ్ నైపుణ్యం, ఫార్ములేషన్ సామర్థ్యాలు, ఓఈఎం సంబంధాలను, బీపీసీఎల్ బలమైన దేశీయ మార్కెట్ ఉనికి, బేస్ ఆయిల్ పోర్ట్‌ఫోలియో, తయారీ మౌలిక సదుపాయాలు, వినియోగదారుల విస్తరణతో మిళితం చేస్తుంది. వర్తించే ఆమోదాలు, కచ్చితమైన ఒప్పందాలకు లోబడి, ఉత్పత్తి స్థానికీకరణ, ఉమ్మడి సాంకేతిక మూల్యాంకనాలు, క్షేత్రస్థాయి పరీక్షలు, ఓఈఎం భాగస్వామ్యం, నాలెడ్జ్ ఎక్స్ ఛేంజ్, భవిష్యత్ వాణిజ్యీకరణ కార్యక్రమాలకు సంబంధించిన అవకాశాలను కూడా ఈ కంపెనీలు అన్వేషించాలను కుంటున్నాయి. దీనికి అదనంగా, వేగంగా పెరుగుతున్న డిజిటల్ మౌలిక సదుపాయాల అవసరాల కోసం బయో-ఆధారిత లూబ్రికంట్స్, ఎలక్ట్రిక్ వాహన ఫ్లూయిడ్స్, హైడ్రోజన్ ఎకానమీ అప్లికేషన్లు, ప్రత్యేక శీతలీకరణ ద్రవాలు, వ్యక్తిగత సంరక్షణ పదార్థాలు, ఇమ్మర్షన్ కూలింగ్ సొల్యూషన్లతో సహా తదుపరి తరం, సుస్థిర సాంకేతికతలలోని అవకాశాలను ఈ పక్షాలు అంచనా వేస్తాయి.

క్రీడలు



యూత్ ఒలింపిక్స్.. ఖుష్బూకు రజతం

యూత్ ఒలింపిక్స్‌లో భారత్ బోణీ కొట్టింది. పోటీల రెండో రోజు రెండు పతకాలు దేశం ఖాతాలో జమ అయ్యాయి. జూడోకా ఖుష్బూ రజక్‌భాయి రజతం సాధించగా.. స్విమ్మర్ ధినిధి దేసింగు కాంస్యం గెలిచింది. జూడో మహిళల 63 కేజీల విభాగంలో 15 ఏళ్ల ఖుష్బూ.. క్వాడెట్ ప్రపంచ ఛాంపియన్ జోలినా రీన్‌హోల్డ్ (జర్మనీ) చేతిలో పరాజయం పాలైంది. ఈ పోటీ 48 సెకన్లలోనే ముగిసింది. ఫైనల్ ముందు వరకు చక్కటి ప్రదర్శన చేసిన గుజరాత్ అమ్మాయి ఖుష్బూ.. తుది పోరులో మాత్రం ప్రత్యర్థి ధాటికి నిలవలేకపోయింది. యూత్ ఒలింపిక్స్ జూడోలో భారత్‌కు దక్కిన రెండో పతకమిది. 2018లో తబబి దేవి కూడా రజతమే గెలిచింది. మరోవైపు బెంగళూరుకు చెందిన 16 ఏళ్ల ధినిధి మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్ రేసులో మూడో స్థానం సాధించింది. ఆమె 56.27 సెకన్లలో పూర్తి చేసింది. అనా బొబనోవిచ్ (55.89 సె) స్వర్ణం, క్రొయేషియా), అలీసా (న్యూజిలాండ్ (56.13 సె) రజతం గెలిచారు. యూత్ ఒలింపిక్స్ స్విమ్మింగ్‌లో పతకం గెలిచిన భారత తొలి క్రీడాకారిణి ధినిధినే.

భారం మోయగలరా?

కివీస్‌తో ఇటీవలే ముగిసిన టీ20 సిరీస్‌లో ఎంతో అనుభవజ్ఞుడైన భువనేశ్వర్ పేస్ దళానికి నాయకత్వం వహించాడు. నాలుగేళ్ల తర్వాత జట్టులోకి పునరాగమనం చేసిన అతను.. అంచనాలను ఏమాత్రం అందుకోలేకపోయాడు. నాలుగు మ్యాచ్‌లాడి 11కు పైగా ఎకానమీ నమోదు చేసి, ఒక్కటే మొదటి మూడు మ్యాచ్‌లు నెగ్గి భారత్ సిరీస్‌ను చేజిక్కించుకుంది. కానీ చివరి రెండు టీ20ల్లో కివీస్ బ్యాటింగ్ పతాక స్థాయిని అందుకుని అలవోకగా విజయాలు సాధించడం వన్డే సిరీస్ ముంగిట భారత్‌కు ప్రమాద సూచికే. ముఖ్యంగా అనుభవ లేమితో కనిపిస్తున్న పేస్ విభాగానికి కివీస్ బ్యాటర్లు కఠిన సవాలే విసిరేలా కనిపిస్తున్నారు.



సిరాజ్ మీదే ఆశ..: హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ కొంత కాలంగా టెస్టులకే పరిమితం అవుతున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో పెద్దగా కనిపించడం లేదు. అయితే కివీస్‌తో సిరీస్‌లో మాత్రం పేస్ విభాగంలో ఆశలన్నీ ప్రధానంగా అతడి మీదే ఉన్నాయి. పేసర్లలో అత్యధిక అనుభవం ఉన్నది అతడికే. 51 వన్డేల్లో 77 వికెట్లు పడగొట్టాడు. న్యూజిలాండ్‌లో పేస్‌కు అనుకూలించే పిచ్‌లు సిరాజ్‌కు నప్పుతాయని, అతను పేస్ దళాన్ని ముందుండి నడిపిస్తాడని జట్టు ఆశిస్తోంది. అయితే గత రెండేళ్లలో కేవలం ఏడు వన్డేలే ఆడిన సిరాజ్.. ఈ ఫార్మాట్లో ఏమేర రాణిస్తాడన్నది చూడాలి. అర్ష్‌దీప్‌కు టీ20ల్లో ఘనమైన రికార్డే ఉంది కానీ.. వన్డే ఫార్మాట్లో పెద్దగా రాణించింది లేదు. 18 మ్యాచ్‌లే ఆడి 30 వికెట్లు తీశాడు. వన్డే సిరీస్‌కు ఎంపికైన మిగతా పేసర్లు గుర్నూర్ బ్రార్ (9 వన్డేలు), అన్షుల్ కంబోజ్ (1), ఆకిబ్ (1)ల అనుభవం మరీ తక్కువ. చివరి రెండు వన్డేల కోసం జట్టులోకి వచ్చిన యశ్ ఠాకూర్ ఇంకా వన్డే అరంగేట్రమే చేయలేదు. సిరాజ్ మొదలుకుని.. పేసర్లలో అందరూ ధారాళంగా పరుగులిచ్చేసే వాళ్లే. ఎవరి ఎకానమీ ఆశాజనకంగా లేదు. ఎక్కువ వికెట్లూ పడగొట్టలేదు. ఒక మోస్తరు అనుభవం ఉన్న ప్రసిద్ధ్ కృష్ణ కూడా అందుబాటులో లేకపోవడంతో పేస్ విభాగం బాగా బలహీనపడినట్లు కనిపిస్తోంది. మరి వీరిలో ఎవరు జట్టు ఆశలను నిలబెడతారో చూడాలి.

యశస్వి 150+ స్కోర్.. కివీస్‌తో టెస్టులకు ఎంట్రీ దక్కేనా?



కొంతకాలంగా పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటోన్న భారత ఓపెనింగ్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (Yashasvi Jaiswal) చోటు దక్కలేదు. అజేయ సెంచరీతో అదరగొట్టాడు. 162 బంతుల్లో 155 పరుగులు బాదిన జైస్వాల్.. టెస్ట్ సిరీస్‌కు ముందు కివీస్ బౌలర్లకు గట్టి సందేశం పంపాడు.
ఓవర్‌నైట్ స్కోరు 32 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్-ఎ ఆదిలోనే సాయి సుదర్శన్ (11) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ కూడా నిరాశపర్చడంతో ఒక దశలో మన జట్టు 36/2తో కష్టాల్లో పడింది. ఆ సమయంలో క్రీజులోకి వచ్చిన యశ్ రాథోడ్‌తో కలిసి యశస్వి అద్భుతమైన ఇన్నింగ్స్ నిర్మించాడు. వీరిద్దరూ 247 పరుగుల భాగస్వామ్యాన్ని సాధించారు. యశస్వి 155 పరుగులు బాదాడు. ఇందులో 15 బౌండరీలు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఇక లెఫ్ట్ హ్యాండర్ యశ్ రాథోడ్ కూడా 100 పరుగులతో అజేయ శతకం నమోదు చేశాడు. అయితే, టీ విరామం తర్వాత వెలుతురు లేమి, ప్రతికూల వాతావరణం కారణంగా ఆటను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. దీంతో భారత్-ఎ, న్యూజిలాండ్-ఎ రెండో అనధికారిక టెస్ట్ డ్రాగా ముగిసింది. అంతకుముందు, తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్-ఎ 424 పరుగులు చేసింది. భారత్-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగులకు ఆలౌట్ అవ్వగా.. రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 282 పరుగులు సాధించింది. ప్రస్తుతం భారత్-న్యూజిలాండ్ మధ్య టీ20 సిరీస్ ముగిసింది. బుధవారం నుంచి ఐదు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఆ తర్వాత కివీస్‌తో రెండు టెస్టులు ఆడనుంది.

ఇండియా-ఎ సారథిగా తిలక్



ఏసీసీ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో పాల్గొనే ఇండియా-ఎ జట్టుకు హైదరాబాదీ తిలక్‌వర్మ సారథ్యం వహించనున్నాడు. ఈనెల 19 నుంచి 29 వరకు దోహాలో జరగనున్న ఈ టోర్నీకి రజత్ పాటీదార్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గ్రూపు-బిలో ఇండియా-ఎతో పాటు పాకిస్థాన్-ఎ, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. గ్రూపు-ఎలో బంగ్లాదేశ్-ఎ, శ్రీలంక-ఎ, అఫ్గానిస్థాన్-ఎ, హాంకాంగ్, చైనాలకు చోటు దక్కింది. ఎ, బి గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇండియా-ఎ: అభిషేక్‌శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), తిలక్‌వర్మ (కెప్టెన్), రజత్ పాటీదార్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), సూర్యాంశ్ షెడ్గె, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబె, తనుష్ కొటియాన్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్‌ఖాన్.

ఆంటోనెలి అదరహో..



జర్మనీ స్టార్ సెబాస్టియన్ వెటెల్ (23 ఏళ్లు; 2010లో) పేరిట ఉన్న రికార్డును అతడు అధిగమించాడు. ఈ సీజన్లో ఇప్పటిదాకా తొమ్మిది రేసుల్లో గెలిచిన ఆంటోనెలి.. మెక్సికో గ్రాండ్‌ప్రిని సైతం నెగ్గి ఎఫ్-1 టైటిల్‌ను సొంతం చేసుకుంటాడని ఊహించారు. అయితే వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఆంటోలినిని వెనక్కి నెట్టి విజేతగా నిలిచాడు. పోల్ పొజిషన్ నుంచి రేసు మొదలుపెట్టిన ఫెరారీ స్టార్ లూయిస్ హామిల్టన్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. డ్రైవర్ స్టాండింగ్స్‌లో 380 పాయింట్లతో ఉన్న ఆంటో నెలి.. ఈ సీజన్లో మరో నాలుగు రేసులు మిగిలి ఉండగానే ఎఫ్-1 కిరీటాన్ని సొంతం చేసుకున్నాడు. ఓవరాల్ జాబితాలో వెర్‌స్టాపెన్ (261), హామిల్టన్ (259) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. 1953లో అలెర్టో అస్కారి తర్వాత ఎఫ్-1 టైటిల్ గెలిచిన ఇటలీ రేసర్ ఆంటోలినినే. ఒక ఫార్ములావన్ సీజన్లో అన్ని రేసుల్లో కలిపి అత్యధిక పాయింట్లు సాధించిన డ్రైవర్‌కు ఎఫ్-1 ఛాంపియన్ టైటిల్ దక్కుతుంది. ''ఏం జరిగిందో అర్థం చేసుకోవడానికి కొంచెం సమయం పట్టింది. కఠోరంగా శ్రమిస్తే.. ప్రత్యేకమైన ఘనతను సొంతం చేసుకోవచ్చు.

సాయి ధరమ్ తేజ్ నిశ్చితార్థం



వుదయం సినిమా: మెగా అభిమానులకు మరో గుడ్ న్యూస్ వచ్చేసింది. మెగా కుటుంబంలో మరోసారి పెళ్లి సందడి మొదలుకాబోతోంది. మెగా కాంపౌండ్ హీరో సాయి ధరమ్ తేజ్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నాడనే వార్త గత కొద్ది రోజుల నుంచి వినిపిస్తున్న సంగతి తెలిసిందే. చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఆయన పెళ్లి విషయంపై తాజాగా కొన్ని కీలక వివరాలు బయటకు రావడం విశేషం. సాయి ధరమ్ తేజ్ నిశ్చితార్థ వేడుక నవంబర్ 5న జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక డిసెంబర్‌లో హైదరాబాద్‌లోనే పెళ్లి జరగనుందని తెలుస్తోంది. అయితే ఈ విషయాలపై సాయి ధరమ్ తేజ్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సాధారణంగా మెగా కుటుంబంలో జరిగే పెళ్లిళ్లు ఎంతో సందడిగా ఉంటాయి. మరి ఈ పెళ్లి కూడా అంతే సందడితో జరుగుతుందా అనే విషయం చూడాలి. కానీ ఈ హీరో పెళ్లి చేసుకునే అమ్మాయి ఎవరు? పెళ్లి ఎక్కడ జరగనుంది? వంటి వివరాలను ఇంకా అధికారికంగా చెప్పలేదు. గతంలో సాయి ధరమ్ తేజ్ తన పెళ్లి 2026లో జరుగుతుందని చెప్పిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా గతంలో ప్రేమ విషయంలో ఎదురైన ఇబ్బందుల కారణంగా తాను కొంతకాలం బాధపడ్డానని కూడా వెల్లడించారు. ఇక ఎన్ని సంవత్సరాలకే ఫైనల్ గా ఆయన పెళ్లి చేసుకోవడానికి సిద్ధమైపోయారు. ఇక త్వరలోనే ఈ హీరో స్వయంగా పెళ్లి వివరాలను ప్రకటిస్తారని అందరూ ఎదురుచూస్తున్నారు.ఇక సినిమాల విషయానికి వస్తే సాయి ధరమ్ తేజ్ ప్రస్తుతం సంబరాల ఏటి గట్టు సినిమాతో బిజీగా ఉన్నారు. రోహిత్ కె.పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా సంక్రాంతి 2027 సందర్భంగా విడుదల కానుంది.

ఈఎన్ఈ రిపీట్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



వుదయం సినిమా: ఈ నగరానికి ఏమైంది' సినిమాలోని క్రేజీ గ్యాంగ్ మళ్లీ కలుసుకోబోతున్న సమయం ఆసన్నమైయింది. ఈకల్ట్ సినిమాకు సీక్వెల్‌గా రూపొందుతున్న 'ఈఎన్ఈ రిపీట్' నవంబర్ 19న విడుదల కానుంది. తరుణ్ భాస్కర్ ధాస్యం రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్‌లో విశ్వక్ సేన్, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి మరోసారి కలిసి నటిస్తున్నారు. ప్రేక్షకులకు ఎంతో ఇష్టమైన ఈ కాంబినేషన్ మళ్లీ తెరపైకి వస్తుండటంతో సినిమాపై సహజంగానే అంచనాలు పెరిగాయి. ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా బ్యానర్ల పై సృజన్ యర బోలు, సందీప్ నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజా గా మేకర్స్ ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు.మొదటి పార్ట్ ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే ఈ సీక్వెల్ కథ మొదలవుతుంది. వివేక్, తన స్నేహితుల గ్యాంగ్‌తో కలిసి ఒక వైల్డ్ సర్వైవల్ ఫిల్మ్ తీయడానికి బయలుదేరుతాడు. ఈ ప్రయాణంలో ఆ గ్యాంగ్‌కు వరుసగా ఎన్నో క్రేజీ, ఊహించని సంఘటనలు ఎదురవుతాయి. గందరగోళం, ఉత్సాహంతో నిండిన ఒక ఎంటర్‌టైనింగ్ జర్నీని ఈ సినిమా అందించబోతోందనే హింట్ ఇచ్చింది.

‘ఇట్లు అర్జున’ నేడే ట్రైలర్ రిలీజ్

వుదయం సినిమా: కింగ్ నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం ‘ఇట్లు అర్జున’. అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. మహేష్ ఉప్పల ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.



దర్శకుడు వెంకీ కుడుముల ఈ సినిమాతో నిర్మాతగా కూడా పరిచయం అవుతున్నారు. ఆయన కొత్తగా ప్రారంభించిన వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘ఇట్లు అర్జున’ నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లో విడుదల కానుంది. విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో సినిమా పై మరిం త ఆసక్తిని పెంచేందుకు మేకర్స్ ట్రైల ర్ విడుదల తేదీని ప్రకటించారు. నవంబర్ 4న ‘ఇట్లు అర్జున’ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఆసక్తికరమైన పోస్టర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.ఈ పోస్టర్‌లో అనీష్ కారు నడుపుతూ సీరియస్‌గా కనిపిస్తుండగా, పక్కనే కూర్చున్న అనస్వర రాజన్ టెన్షన్తో కనిపిస్తున్నారు. పగిలిపోయిన కారు అద్దం, గాల్లో ఎగురుతున్న గాజు ముక్కలు, వారి వాహనాన్ని వెంబడిస్తున్న కొంత మంది వ్యక్తులతో పోస్టర్ ఉత్కంఠను రేకెత్తి స్తోంది. హీరోహీరోయిన్ల జీవితాల్లో చోటుచేసుకోబోయే అనూహ్య పరిణామాలను ఈ పోస్టర్ సూచిస్తోంది. ‘ఇట్లు అర్జున’ ఓ విభిన్నమైన ప్రేమకథ. అర్జున్ అనే మూగ యువకు డు తన జీవితమంతా కీర్తిని మౌనంగా

ఆదర్శ కుటుంబం' సెకండ్ హాఫ్‌పై కూడా రకరకాల కామెంట్స్



వుదయం సినిమా: ఆదర్శ కుటుంబం విడుదలయ్యాక వెంకటేష్ కామెడీ, త్రివిక్రమ్ డైలాగుల గురించి ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. సెకండ్ హాఫ్‌పై కూడా రకరకాల కామెంట్స్ వస్తున్నాయి. అయితే వీటి మధ్య సైలెంట్ సర్‌ప్రైజ్ లాగా ఓ నటి కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సినిమాలో ఆమెకు ఎక్కువ సన్నివేశాలు లేవు. అయినా కనిపించిన కాసేపట్లోనే గుర్తుండిపోయేలా చేశారు. త్రివిక్రమ్ సినిమాల్లో చిన్న పాత్రలకు కూడా మంచి నటులను ఎంచుకుంటారనే విషయం తెలిసిందే.ఆ నటి దేవియాని శర్మ. 'ఆదర్శ కుటుంబం'లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించారు. డైలాగులు ఎక్కువగా లేకపోయినా కళ్లతో పలికించిన హావభావాలు ఆకట్టుకున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పాత్రలో ఏమాత్రం ఎక్కువ చేసి నటించినా తేడా కొట్టే ప్రమాదముంది. దేవియాని మాత్రం తన చూపులతోనే పాత్ర స్వభావాన్ని తెలియజేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె నటనకు ప్రశంసలు వస్తున్నాయి.దేవియాని తెలుగు ప్రేక్షకులకు పరిచయమే. 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో ముందే గుర్తింపు తెచ్చుకున్నారు. అందులో ఆమె నటన, కామెడీ టైమింగ్ ఆకట్టుకున్నాయి. ఇప్పుడు త్రివిక్రమ్ సినిమాలో పూర్తి భిన్నమైన పాత్ర దక్కింది. ఓటీటీలో చూసిన నటిని థియేటర్ సినిమాలో మరోలా చూడటం ప్రేక్షకులకు కూడా కొత్తగా అనిపిస్తోంది. ముఖ్యంగా నెగెటివ్ పాత్రలోనూ నటించగలనని చూపించుకునే అవకాశం ఆమెకు వచ్చింది.దేవియాని ఇప్పటికే వెబ్ సిరీస్‌లో ఒక తరహా నటన చూపించారు. ఇప్పుడు మరో రకమైన పాత్ర చేశారు.

వుదయం సినిమా

'సీన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్



వుదయం సినిమా: హీరో సూర్య, మలయాళ బ్లాక్‌బస్టర్ ‘ఆవేశం’ ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలసి యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్ ‘సీన్’ చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నస్లేన్, ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య అగరం స్టూడియోస్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషన్ కంటెంట్ కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎన్వీఆర్ సినిమా ద్వారా గ్రాండ్ రిలీజ్ కానుంది. 'సీన్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 2026 నవంబర్ 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ.. అందరికీ థాంక్యూ. లవ్ యు. మనందరం ఒక్కటే. వి ఆర్ వన్ ఫ్యామిలీ. మీరందరూ నాకు అన్‌కండిషనల్ లవ్ ఇచ్చారు. ఈ ఏడాదిలో మిమ్మల్ని కలవడం ఇది మూడోసారి. దీన్ని ఒక బ్లెస్సింగ్‌గా భావిస్తున్నాను. ఈ ఏడాది చాలా అద్భుతంగా ఉంది. ఇప్పుడు అందరూ పాన్ ఇండియా గురించి మాట్లాడుతున్నారు. కానీ నాగార్జున గారు ఇంతకుముందే ఇతర భాషల డైరెక్టర్స్‌తో కలిసి పనిచేశారు. అన్ని ఇండస్ట్రీలను కలుపుకుంటూ వర్క్ చేసేవారు. మణిరత్నం గారు, ప్రియదర్శన్ గారు, మహేష్ భట్ గారు.. ఇలా ఎంతోమంది దర్శకులతో కలిసి పనిచేశారు. అది ఎప్పుడూ నా మనసులో ఉంటుంది. 'విశ్వనాథన్ అండ్ సన్స్'లో చాలా భాషలకు చెందిన నటీనటులు కలిసి పనిచేశారు. ఎక్కడికి వెళ్లినా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. వెంకీ చాలా బ్యూటిఫుల్ ఫిల్మ్ ఇచ్చాడు. ఇప్పుడు జిత్తుతో కలిసి 'సీన్' చేశాను. తన 'రోమాంచం', 'ఆవేశం' సినిమాలను మీరు చూసే ఉంటారు. 'సీన్' కూడా అలాంటి ఒక బ్యూటిఫుల్ సినిమా. తనతో కలిసి పనిచేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. 'వీర భద్రుడు', 'విశ్వనాథన్ అండ్ సన్స్' తర్వాత మరోసారి మిమ్మల్ని కలవడం హ్యాపీగా ఉంది. మీ అందరి ప్రేమకు థాంక్యూ. మా టీమ్ సభ్యులు అద్భుతమైన వర్క్ ఇచ్చారు. మేమందరం కలిసి ఒక బ్యూటిఫుల్ సినిమాను అందిస్తున్నాం. ఇందులో మర్డర్ మిస్టరీ, మ్యాడ్‌నెస్, నవ్వులు.. అన్నీ ఉన్నాయి. రాకేందు మౌళి తెలుగులో చాలా చక్కని మాటలు, పాటలు రాశారు. చాలా కమిట్‌మెంట్‌తో పనిచేశారు. ఈ సినిమాలో చాలా ఫ్రెష్ టాలెంట్ కూడా ఉంది. నజ్రియాతో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా అనిపించింది. తను చాలా అద్భుతమైన నటి. తను నేచురల్ స్టార్. ఈ సినిమాలో తను స్టంట్స్ కూడా చేసింది. ఇది చాలా స్పెషల్ ఫిల్మ్. ఇందులో ఒక డైలాగ్ ఉంది.

"మయూఖ" 25 డేస్ గ్రాండ్ సక్సెస్ సెలబ్రేషన్స్



వుదయం సినిమా: పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటించిన సినిమా "మయూఖ". ఈ చిత్రాన్ని ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మించారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహించారు. ఇటీవలే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ ద్వారా ప్రేక్షకుల ముందుకొచ్చిన "మయూఖ" సినిమా ట్రెండ్ సెట్టింగ్ థ్రిల్లర్ గా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఈ సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ ఈ రోజు హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ లీడర్ చిన్న శ్రీశైలం యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు మీడియా మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని "మయూఖ" సినిమా టీమ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం గాఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి.గిరీష్ రెడ్డి మాట్లాడుతూ – మా సినిమాకు ఉన్న బడ్జెట్ లో ఇంత క్వాలిటీగా సినిమా చేసి, గ్రాండ్ గా రిలీజ్ చేసుకున్నాం అంటే అందుకు మా డైరెక్టర్ విజన్ కారణం. ఆయనకు పెద్ద బడ్జెట్ ఇచ్చి సినిమా చేయమంటే మిరాకిల్స్ చేస్తారు. మా సినిమాను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. అన్నారు.యాక్టర్ రఘు వాసిరెడ్డి మాట్లాడుతూ – మా సినిమా సక్సెస్ షీల్డ్ అందుకోవడం నా కెరీర్ లో ఎంతో స్పెషల్ మూవ్ మెంట్ గా భావిస్తున్నా. ఈ షీల్డ్ నేను అందుకున్నానంటే కారణం మా డైరెక్టర్ శ్రీతేజ్. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. అన్నారు.యాక్టర్ అభిలాష్ అద్ద మాట్లాడుతూ – ఈ రోజున సినిమాలు ఒక వారం రోజులు ఆదరణ పొందితేనే గొప్ప విషయం. అలాంటిది మా సినిమాకు పాతిక రోజుల రన్ ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. చిన్న సినిమాల విషయంలో బాక్సాఫీస్ వద్ద ఇది అరుదుగా దక్కే విజయం. ఈ సినిమా సక్సెస్ మా డైరెక్టర్ విజన్, కన్విక్షన్ ను చూపిస్తోంది. అన్నారు. ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ఒక సినిమా రిలీజై నెక్స్ట్ వీకే చూడటం అనేది అరుదు. అలాంటిది 25 రోజులు థియేటర్స్ లో సినిమా రన్ కావడం అంటే ఈజీ కాదు. అలాంటి ఘనత సాధించిన "మయూఖ" టీమ్ ను అభినందిస్తున్నా. ఈ రోజు చిన్న చిత్రాలు థియేటర్స్ లో ఆడటం ఎంత కష్టమైందో మనం చూస్తున్నాం. ఈ టీమ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. వీ5 ఎండీ వెంకటేష్ మాట్లాడుతూ – "మయూఖ" సినిమా ప్రీమియర్స్ వేశారు. అప్పుడు సినిమా చూసి ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుందని చెప్పాను. మేము ఆశించినట్లే "మయూఖ" సినిమాను సూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. అన్నారు.యాక్టర్ దేవ్ డి మాట్లాడుతూ – మా సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్ కు మైండ్ బెండింగ్ బ్లాక్ బస్టర్ అని పేరు పెట్టారు. ఇంతకంటే పెద్ద పేరు పెట్టినా మాకు సంతోషమే. కొత్త టీమ్ తో ఇలాంటి డిఫరెంట్ థ్రిల్లర్ నిర్మించిన మా ప్రొడ్యూసర్ గారికి, సినిమాను రూపొందించిన మా డైరెక్టర్ గారికి థ్యాంక్స్. అన్నారు.హీరోయిన్ పాయల్ చెంగప్ప మాట్లాడుతూ – తెలుగులో నాకు ఇది ఫస్ట్ మూవీ. మా టీమ్ కూడా కొత్త వాళ్లే. ఇలాంటి కొత్త టీమ్ కు పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియెన్స్ కు థ్యాంక్స్.

"వేట్టువం" సంక్రాంతికి రిలీజ్

వుదయం సినిమా: సరికొత్త కథా నేపథ్యాలతో అద్భుతమైన మేకింగ్ తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే దర్శకుడు పా. రంజిత్ "వేట్టువం" టైటిల్ తో మరో భారీ యాక్షన్ చిత్రాన్ని మన ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో ఆర్య, వి.ఆర్. దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "వేట్టువం" సినిమాను లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై



ప్రొడ్యూసర్స్ ఎస్. సాయి దేవానంద్, ఎస్. సాయి వెంకటేశ్వరన్, పా.రంజిత్ నిర్మిస్తున్నారు. భారీ పాన్ ఇండియా యాక్షన్ మూవీగా "వేట్టువం" తెరకెక్కుతోంది. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు. వచ్చే సంక్రాంతి పండక్కి ఈ సినిమాను వరల్డ్ వైడ్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో 2027 సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో మరో ఇంట్రెస్టింగ్ మూవీ చేరినట్లయింది. "వేట్టువం" సినిమా నేపథ్యాన్ని, పాత్రల స్వభావాలను, ఎంత భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారో వివరిస్తూ ఇటీవల రిలీజ్ చేసిన 'వరల్డ్ ఆఫ్ వేట్టువం' వీడియో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ వీడియోకు తెలుగులో రానా దగ్గుబాటి, మలయాళంలో సౌబిన్ షాహిర్, కన్నడ వెర్షన్ కు కిచ్చా సుదీప్, తమిళంలో పా. రంజిత్ వాయిస్ అందించడం క్రేజ్ తీసుకొచ్చింది.విభిన్న సమూహాల మధ్య ఉండే సంఘర్షణలు, పోరాటాలు, ఊహకందని సంఘటనలను ప్రధానాంశంగా తీసుకుని దర్శకుడు పా. రంజిత్ "వేట్టువం" సినిమాను రూపొందిస్తున్నారు.

"సమ్మర్ హాలిడేస్" ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్



వుదయం సినిమా: కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ నయన్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు డైరెక్టర్ శ్రీకర్ నయన్.– మాది విశాఖ. కాలేజ్ డేస్ లోనే షార్ట్ ఫిలింస్ రూపొందించాను. అలా స్క్రిప్ట్, షార్ట్ ఫిలింస్ మేకింగ్ మీద ఆసక్తి పెరిగింది. చదువులు పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చి తెల్లవారితే గురువారం, మరికొన్ని చిత్రాలకు దర్శకత్వ శాఖలో పనిచేశాను. కొన్ని కథలు సిద్ధం చేసుకుని అవకాశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించాను. మధుర శ్రీధర్ రెడ్డి ద్వారా ధీరజ్ మొగిలినేనిని కలిశాను. ఆయనకు ఒక థ్రిల్లర్ మూవీ కథ చెప్పాను. కథ ఆయనకు నచ్చింది. అయితే ఫిలింమేకింగ్ లో అనుభవం ఉంటే బాగుంటుంది మనం ఖచ్చితంగా చేద్దామని చెప్పారు. ఆ తర్వాత కొన్ని ప్రొడక్షన్ హౌస్ లు అవకాశం ఇచ్చాయి కానీ అక్కడ సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు చాలా టైమ్ పట్టేలా కనిపించింది. ఆ తర్వాత ధీరజ్ కు సమ్మర్ హాలిడేస్ కథ నచ్చి అవకాశం ఇచ్చారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.